www.andhrajyothy.com
వెల (Price) : Rs. 8.00
విజయవాడ సిటీ*

# ఆంధ్రజ్యోతి

పేజీలు: 12 + 16 + 32
పేజీల ఆదివారం అనుబంధం
సంపుటి (Volume) : 60
సంచిక (Issue) : 233
ఆదివారం | 8-12-2019
శ్రీవికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం; తిథి: ఏకాదశి ఉ. 8.30 తదుపరి ద్వాదశి; నక్షత్రం: అశ్విని తె. 3.31 తదుపరి భరణి; వర్జ్యం: రా. 11.10-12.54; దుర్ముహూర్తం: సా. 4.09-4.53; అమృతఘడియలు: రా. 7.42-9.26; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.37; సూర్యాస్తమయం: 5.37
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai





ఉన్నావ్ బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఢిల్లీలో కొవ్వొత్తులతో ర్యాలీ

## సామాన్యుడికి అందనంత దూరంలో న్యాయం

హైకోర్టు, సుప్రీంకోర్టుకు వెళ్లలేకపోతున్నారు
ఖరీదైన వ్యవహారంగా మారిపోయిన ప్రక్రియ
అందరికీ న్యాయం అందాలని రాజ్యాంగ పీఠికలోనే రాసుకున్నాం: కోవింద్



11

## మహిళ రోదిస్తోంది

సత్వరం న్యాయం జరిగేలా చూడండి
సుప్రీం చీఫ్ జస్టిస్‌కు కేంద్రం అభ్యర్థన
న్యాయవ్యవస్థ జాప్యంపై పరోక్ష నిష్ఠూరం
రేప్ కేసులు రెండునెలల్లోగా తేల్చేయండి
దర్యాప్తు వేగంపై సీఎంలకు లేఖలు: రవిశంకర్



11

## న్యాయం ప్రతీకారంగా మారరాదు తక్షణ న్యాయం అసాధ్యం

నేర న్యాయవ్యవస్థ తీరు మారాలి
న్యాయవ్యవస్థ తన తప్పులు దిద్దుకోవాలి
షాద్‌నగర్ ఎన్‌కౌంటర్ నేపథ్యంలో సుప్రీం సీజే బోబ్డే కీలక వ్యాఖ్యలు



# ప్రయాణికులపై 'చార్జ్'

నాలుగేళ్ల తరువాత ఆర్టీసీ ప్రయాణికులపై తొలిసారి చార్జీల పెంపు భారం పడింది. వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై మొదటి బరువు మోపింది. అన్నింటా 'తెలంగాణ బాట' అన్నట్టు సాగుతున్న ప్రభుత్వం.. ఆర్టీసీ చార్జీల విషయంలోనూ అదే దారిలో నడవనున్నదన్న 'ఆంధ్రజ్యోతి' కథనమే నిజమైంది.

## కిలోమీటరుకు 20 పైసల పెంపు

## ప్రజలపై ఏటా 675 కోట్ల వడ్డన

## పల్లె, సిటీ బస్సులకు 10 పైసలు

పల్లె సర్వీస్‌పై సగటున రూ.4 భారం
నాలుగేళ్లలో పెంపు ఇదే తొలిసారి
తెలంగాణ బాటలోనే జగన్ నిర్ణయం
ఎండీ ప్రకటనతో త్వరలో అమల్లోకి..
పెంచక తప్పడం లేదు: మంత్రి నాని
పెంపుపై ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'





మీడియాతో మాట్లాడుతున్న మంత్రి పేర్ని నాని, ఆర్టీసీ ఎండీ కృష్ణబాబు

అమరావతి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి కిలోమీటరుకు పల్లె, సిటీ బస్సులపై పది పైసలు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులపై ఇరవై పైసలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. అన్ని సర్వీసులపైనా సరాసరి 20శాతం మేర చార్జీలను వడ్డించింది. ప్రస్తుతం విజయవాడ నుంచి హైదరాబాద్‌కు సూపర్ లగ్జరీలో రాకపోకలు సాగిస్తే రూ. 710 చార్జీ (ఒక వైపు రూ.355) వసూలు చేస్తున్నారు. ఇకపై అదనంగా రూ.120 నుంచి రూ.140 ప్రయాణికుడు భరించాల్సిందే! ఈ లెక్కన బెజవాడ నుంచి విశాఖపట్నం వెళ్లివస్తే రూ. 150పైగా, తిరుపతికి అయితే రూ.225పైగా అదనపు భారం ప్రయాణికుడిపై పడనుంది. నష్టాల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొన్న ఈ నిర్ణయం వల్ల ఏటా సుమారు రూ. 675 కోట్ల భారం ఆర్టీసీ

మిగతా 8వ పేజీలో...

### పెద్ద భారమేమీ కాదు!

ఆర్టీసీ మనుగడకు అనివార్యం
పెంపు లేకపోతే ప్రైవేటుబాటే
నష్టాలను దాటకపోతే కష్టాలే
అయినా తెలంగాణలా పెంచలేదు
త్వరలో కొత్త చార్జీలు అమల్లోకి
'ఆంధ్రజ్యోతి'తో మంత్రి పేర్ని నాని

8

## రూ.15 వేల కోట్లు కావాలి ప్లీజ్!

### కొత్త అప్పులకు అనుమతికై రాష్ట్రం విన్నపం

ఈ ఏడాది ఇప్పటికే రూ.29 వేల కోట్ల అప్పు
నిబంధనల ప్రకారం మరో 3,300 కోట్లకే చాన్స్
అయినా అవకాశం కోసం కేంద్రానికి రాష్ట్రం లేఖ
ఎఫ్ఆర్‌బీఎం నుంచి రీపేమెంట్లను మినహాయించాలనీ వేడుకోలు

సంక్షేమ జపం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని కాసుల కొరత కలవరపెడుతోంది. ఆరు నెలలుగా అప్పులను ఆసరాగా చేసుకుని నెట్టుకొస్తున్న జగన్ ప్రభుత్వం... మళ్లీ అప్పుల వైపే చూస్తోంది. ఈ దిశగా అనుమతించాలంటూ కేంద్రానికి లేఖ రాసింది. ఇప్పటికే రుణ పరిమితిని చేరుకున్న రాష్ట్రం.. వచ్చే మూడు నెలల కాలానికి అదనపు రుణ సమీకరణకు ఒప్పుకోవాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని వేడుకుంటోంది.

2

## దాగుడు మూతల రాజకీయం

### కేంద్ర -రాష్ట్ర ప్రభుత్వాల పవర్ ప్లే



బీజేపీ, జగన్-కేసీఆర్ మధ్య రసవత్తర రాజకీయం
సీఎంలిద్దరూ వ్యతిరేకంగా పనిచేస్తున్నట్టు బీజేపీ సందేహం
జగన్ తీరు తొలినుంచీ ఆ వైపే
బీజేపీయేతర పక్షానికి మద్దతు
అది వికటించినా ఆగని యత్నం
అందుకే షా దగ్గర అవమానం!
కేసీఆర్‌పైనా కేంద్ర పెద్దల కన్నెర్ర

జగన్-కేసీఆర్ వ్యవహారశైలిపై కేంద్ర ప్రభుత్వం అసంతృప్తిగా ఉందా? వారిని దారిలోకి తెచ్చుకునేందుకు ఒత్తిడి ఎత్తుగడలను ప్రయోగిస్తోందా? మోదీ- షా సంగతి తెలిసిన జగన్-కేసీఆర్ కూడా అప్రమత్తమయ్యారా? పైకి వినయం నటిస్తూనే లోపాయకారీ వ్యూహాలను ప్రయోగిస్తున్నారా? మొత్తమ్మీద తెలుగు రాష్ట్రాల పాలకులు- కేంద్ర పాలకులు దాగుడు మూతలు దండాకోర్ ఆట ఆడుతున్నారా? ఢిల్లీలోని, రాష్ట్రంలోని విశ్వసనీయ రాజకీయ వర్గాలు చెబుతున్న సమాచారం, జరుగుతున్న పరిణామాలు ఈ సంకేతాలనే ఇస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల సారథులకు, బీజేపీకి మధ్య రసవత్తర రాజకీయం నడుస్తోందని, కొంచం నీరు- కొంచం నిప్పు అనే రీతిలో అది సాగుతోందని అవి వివరిస్తున్నాయి.

న్యూఢిల్లీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీకి, వైసీపీ-టీఆర్ఎస్‌కు మధ్య లోక్‌సభ ఎన్నికల ముందు వరకు నెలకొన్న సమన్వయ సంబంధాలు, ఆ తర్వాత కనిపించడం లేదు. తన వ్యవహారాల్లో కేంద్రం ఆశించినంతగా సహకరించడం లేదని వైసీపీ అధినేత భావిస్తుండగా, తెలంగాణలో బీజేపీ నాలుగు లోక్‌సభ సీట్లను గెలుచుకోవడం టీఆర్ఎస్‌కు కంట్లో నలుసులా మారింది. తెలుగు రాష్ట్రాల్లో బీజేపీ విస్తరణను అడ్డుకోవడానికి ఈ జోడీ గత ఏడాది నుంచీ కూడబలుక్కుని పని చేస్తున్నట్టు కమలనాథులు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అపనమ్మకాలు పెరిగి, రెండు వర్గాలూ ఒత్తిడి ఎత్తుగడలకు పాల్పడుతున్నట్టు విశ్వసనీయ రాజకీయ వర్గాలు తెలిపాయి. "సీఎం కాకముందే కేసీఆర్‌తో జగన్ చేతులు కలిపారు. మాకు వ్యతిరేకంగా రాజకీయం చేశారు" అని

మిగతా 11వ పేజీలో...

## ఐటీ ఊరట!

వేతన జీవులపై తగ్గనున్న భారం
ఐటీ రేట్లలో కోతకు కేంద్రం సన్నద్ధం
ఆ దిశగా బడ్జెట్ కసరత్తు చేస్తున్నాం
కొనుగోలు శక్తి పెంపే లక్ష్యం: నిర్మల



## జీఎస్టీ బాదుడు?

బేస్ శ్లాబ్ 5 నుంచి 9-10 శాతానికి పెంపు
12% శ్లాబు ఎత్తివేత, 18%లోకి 243 వస్తువులు
తాటికల్లు, ప్రైవేటు వైద్యంపైనా భారీ వడ్డన
వచ్చే వారం జీఎస్టీ మండలి సమావేశంలో చర్చ

11

# సమర్థతకు 'సెలవు'!



### నిజాయితీకి బదిలీ బహుమానం

ఎప్పుడు ఏమవుతుందో తెలియక ఒత్తిడిలో పలువురు జిల్లా ఎస్పీలు
5 నెలలకే ఒక ఎస్పీకి 2 బదిలీలు.. ఇసుకను కాపాడి పెద్దల కన్నెర్ర
ఎమ్మెల్యేపై కేసు..ఆపై బదిలీవేటు.. పోలీసులదీ దాదాపు 'ఆనం'మాటే
సిన్సియారిటీకి శిక్షేమిటని ఆవేదన.. అందరిలోనూ అదే చర్చ

అమరావతి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): "రాష్ట్రంలో పారదర్శక పాలన ఉండాలి. నిజాయితీగా పనిచేసే అధికారులకే ప్రాధాన్యం. ఎలాంటి పైరవీలకు తావివ్వొద్దు. అధికార పార్టీ వాళ్లు చెప్పినా సరే వినొద్దు. ఆర్నెల్లలో రాష్ట్రంలో వైసీపీ పాలన దేశానికే ఆదర్శం కావాలి".. ముఖ్యమంత్రి జగన్ ప్రమాణ స్వీకారం రోజు నుంచి పలు సందర్భాల్లో చెప్పిన మాటలివి. ఈ వ్యాఖ్యలు ఎవరికి సరిపోయినా, పోలీసుశాఖకు మాత్రం వర్తించడంలేదు. ఎందుకంటే నిజాయితీగా పనిచేస్తున్న అధికారులు బదిలీ అవుతున్నారు. ప్రజలకు అండగా నిలిచిన పోలీసులు ఇబ్బంది పడుతున్నారు. అధికార పార్టీ నేతలు చెప్పినట్లు వినని వారు, ఉద్యోగాలు చేయలేక పోతున్నారు. జిల్లాల్లో కానిస్టేబుల్ నుంచి ఎస్పీ వరకూ తమ మాట వినాల్సిందేనని పాలకపక్షం నేతలు

మిగతా 2వ పేజీలో...

## ఆనం వ్యాఖ్యలపై జగన్ ఆగ్రహం

సంజాయిషీ కోరాలంటూ విజయసాయికి ఆదేశం
గీత దాటితే ఎవరైనా చర్యలు తప్పవని హెచ్చరిక



8







epaper.andhrajyothy.com



పరంజ్యోతి

## దానం ఒక సత్సంప్రదాయం



*ఈశావాస్య మిదం సర్వం, యత్కించ జగత్యాం జగత్*
*తేన త్యక్తేన భుంజీథాః మా గృధః కస్య స్విద్ధనమ్ ॥*

"ఈ సృష్టి అంతా భగవత్ స్వరూపం. భగవంతుడు మనకు ప్రసాదించింది. దీనిని మనం త్యాగబుద్ధితో అనుభవించాలి. మన కోసం ఏ కొద్ది భాగం అవసరమో అంత మాత్రమే స్వీకరించి, మిగిలినదంతా త్యాగబుద్ధితో ఇతరుల ప్రయోజనం కోసం విడిచిపెట్టాలి. ఇతరుల ధనాన్ని, ద్రవ్యాన్ని ఎట్టి పరిస్థితులలోనూ స్వీకరించరాదు. ఇది మన నిష్కర్ష. ఇదే మన సిద్ధాంతం. ఇదే మన ఆచరణగా ఉండాలి." అని ఈశావాస్యోపనిషత్ చెబుతోంది.

ఇచ్చుట అనే క్రియకు దానము అని పేరు. దానం వలన పుణ్యము లభిస్తుంది. నరకము నుండి విముక్తి కలుగుతుంది. వచ్చే జన్మ ఉత్తమ జన్మ అయ్యేందుకు బీజారోపణం జరుగుతుంది. పాపము తొలగిపోతుంది. ఒక పావురాన్ని రక్షించేందుకు తన శరీరాన్ని గ్రద్ధకు ఆహారంగా ఇచ్చిన శిబి చక్రవర్తి, ఇంద్రునికి దానంగా తన శరీరంలో భాగమైన కవచకుండలాలనిచ్చిన కర్ణుడు, తనను దానం అడిగింది సాక్షాత్ ఆ మహావిష్ణువేనని, తన దానం తనకే ప్రమాదం అని తెలిసికూడా మాట తప్పని బలిచక్రవర్తి.... ఇలా ఎందరో మహాత్ముల గురించి మనం పురాణాల్లో విన్నాం. అనేక విధాలైన దానాలు, దాన ఫలితాలు ఉపనిషత్తులలో చెప్పబడ్డాయి. కాబట్టి పరంపరగా వచ్చిన మన సాంప్రదాయాలలోని దానం... కుటుంబ జీవనంలో అత్యంత ప్రధానమైనది.

నానాటికి సంస్కృతి సంప్రదాయాలు తలక్రిందులవుతున్నాయి. దాని ప్రభావం మనిషి జీవితం మీద పడి యాంత్రిక జీవనం అలవాటైపోయింది. ప్రస్తుతం మనుషులు కేవలం డబ్బు, కీర్తి సంపాదనే ముఖ్యమని, 'ధనమూలమిదం జగత్' అని నమ్మి డబ్బు మీద వ్యామోహంతో విలువలు, నీతిని పక్కనపెట్టి డబ్బే జీవితం అన్నట్లుగా జీవిస్తున్నారు. దానాల వలన సద్గతులు కలుగుతాయి. అందుకే ఉత్తరక్రియలలో చనిపోయిన వారి ఆత్మకు పుణ్యం కలగాలని దానాలు చేయిస్తుంటారు. చాలా మంది దానం అనేది ఏదో మొక్కుబడిగా చేసే వ్యవహారం అనుకుంటారు. శ్రావణమాసంలోనో, కార్తీక మాసంలోనే గుళ్లకు వెళ్లి అయ్యగార్లకు దానాలు ఇస్తే చాలు అనుకుంటారు. పవిత్ర మాసాలలో దేవాలయాల్లో అయ్యగార్లకు తమ రాశుల బట్టి, గ్రహస్థితులను బట్టి దానాలు ఇవ్వడం ఉత్తమమే. కానీ తాను నిత్యం ఆచరించవలసిన ధర్మాలను విస్మరించి, మనపై ఆధారపడ్డ వాళ్లను పట్టించుకోకుండా మొక్కుబడి దానాలు చేయడం వలన ఎలాంటి ఫలితాలు ఉండవు. అన్నదానం, వస్త్ర దానం, విద్యాదానం... ఇలా అనేక విధాలుగా భగవంతుడు మనకు ఇచ్చిన దానిలో కొంత ఇతరులతో పంచుకోవడం ద్వారా సాటి మనిషిలో భగవంతుణ్ని చూస్తూ "పరోపకారమిదం శరీరం" అన్న సూక్తిని ఆచరించాలి.

**- నోముల చంద్రశేఖర్, 98666 69859**





# సమర్ధతకు 'సెలవు'!

(మొదటి పేజీ తరువాయి)

హెచ్చరిస్తున్నారు. నెల్లూరుజిల్లాకు చెందిన అధికార పార్టీ ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై పోలీసులు 'అవును నిజమేగా?' అంటున్నారు. నెల్లూరు జిల్లా ఎస్పీగా వచ్చిన ఐశ్వర్య రస్తోగికి మంచి పేరుంది. అయితే జిల్లాకు చెందిన ఒక వివాదాస్పద ఎమ్మెల్యే ప్రభుత్వ మహిళా అధికారిపై దౌర్జన్యం చేసిన ఘటనలో కేసు నమోదు చేయడ మే రస్తోగిపై కన్నెర్రకు కారణమయిందని పోలీస్‌వర్గాలు చెబుతున్నాయి. ఆ అధికారిణి పోలీసుస్టేషన్‌కు వచ్చి నిరసన వ్యక్తం చేస్తే అప్పుడు ఫిర్యాదు తీసుకుని ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అయితే ఎమ్మెల్యేపై పెద్ద సీరియస్ సెక్షన్లు నమోదు చేయక పోవడంతో తక్షణమే బెయిలు మంజూరైంది. అయినా ఆయన మాత్రం ఎస్పీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తనకు అత్యంత సన్నిహితుడైన సహచర ఎమ్మెల్యే మంత్రిగా ఉండటంతో ముఖ్యమంత్రికి జిల్లా ఎస్పీ గురించి తాను అనుకొంటున్నట్లు చెప్పే మార్గం లభించింది. పైగా, ఇటీవల మంత్రి కావాలని తెచ్చుకున్న ఒక పోలీస్ అధికారిని విధుల్లో చే ర్చుకోవడానికి రస్తోగి ఆసక్తి చూపలేదు. ఇదే అదనుగా పాతవన్నీ కలిపి ప్రభుత్వ పెద్దల చెవిన పడేసి ఎస్పీని బదిలీ చేయించినట్లు ప్రచారం జరుగుతోంది. పోలీసుశాఖలో ఎవ్వరూ ఊహించని బదిలీ కావడంతో ఎక్కువ మందిలో ఇదే చర్చ జరుగుతోంది. "పోలీసులను పని చేయనీయరు. ఎమ్మెల్యేం మేమే వాళ్లను ఉండనియ్యం. నెల్లూరు మాఫియాల అడ్డా. ఎదుర్కొనేందుకు సమర్థమంతమైన అధికారి లేడు. వచ్చినా మా ఎమ్మెల్యేలు ఉండనీయరు. ముగ్గురు ఎస్పీలను మార్చేశాం కదా! నగరాన్ని గ్యాంగ్‌స్టర్‌లకు అప్పగించారు. లక్షలాది మంది కుమిలిపోతున్నారు" అంటూ తాజాగా అధికార పార్టీ ఎమ్మెల్యే ఆనం చేసిన వ్యాఖ్యల్ని మెజారిటీ పోలీసు అధికారులు నిజమే కదా? అని సమర్థిస్తున్నారు.

### కట్టడి చేస్తే కత్తెరే..

చిత్తూరు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సమర్థుడైనా టీడీపీ ప్రభుత్వం నియమించిన అధికారి కావడంతో వైసీపీ అధికారంలోకి రాగానే బదిలీ చేసింది. ఆయన స్థానంలో సమర్థుడిగా పేరున్న వెంకటప్పలనాయుడును నియమించింది. కర్ణాటక, తమిళనాడు సరిహద్దులు, ఎర్రచందనం స్మగ్లింగ్, అతిపెద్ద జిల్లా కావడంతో నేరాలను అదుపు చేయడంలో ఆయన ఉంటే బాగుంటుందని భావించారు. అయితే ఆ జిల్లా పెద్దలు ప్రతి రోజూ ఏదో ఒక పోలీసు బదిలీ గురించి ఎస్పీకి సిఫారసు చేసేవారు. రాజకీయ పైరవీలతో వచ్చేవారు స్టేషన్లలో సరిగా పనిచేయబోరని భావించి.. నిజాయితీ, సమర్థత ఆధారంగా సిబ్బందికి ఆయన పోస్టింగ్ ఇచ్చేవారు. సరిహద్దు జిల్లా కావడంతో ఇసుక లారీలు అటు బెంగళూరు, ఇటు చెన్నైకి వెళ్లేందుకు ఇబ్బందుల్లేకుండా తమ వారిని స్టేషన్లలో నియమించుకోవాలని అనుకున్న పెద్దలకు అప్పలనాయుడు చర్య మింగుడు పడలేదు. దీంతో కొందరు అప్పలనాయుడుకు వేరే మార్గంలో హెచ్చరికలు పంపారు. దీంతో ఆయన మరింత కఠినంగా వ్యవహరిస్తూ ఇసుక రవాణాలో అధికార పార్టీ నేతల అక్రమాలకు అడ్డుకట్ట వేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వంలో పలుకుబడి ఉన్న వాళ్లు ఆయన్ను 5 నెలలు కూడా పూర్తి కాకుండానే బదిలీ చేయించారని పోలీసు వర్గాలే భావిస్తున్నాయి.

### ముందు కొంత.. తర్వాత పూర్తి సెలవు

అనంతపురం ఎస్పీ సత్య యేసుబాబుకు ప్రస్తుతం నంబ ర్ వన్ ఎస్పీగా పేరుంది. ఆయనపై జిల్లాకు చెందిన కొందరు ఎమ్మెల్యేలు సీఎంకి ఫిర్యాదు చేశారు. దీంతో డీజీపీ ఆరా తీయగా, ఒక ఎమ్మెల్యే తండ్రి పేకాట ఆడుతుండగా అరెస్టు చేశారని, మరో ఎమ్మెల్యే సోదరుడు సెటిల్‌మెంట్లు చేస్తుండగా టాస్క్‌ఫోర్స్‌ను పంపి ట్రీట్‌మెంట్ ఇచ్చారని, ఇంకో నేత కాం ట్రాక్టరును డబ్బుల కోసం బెదిరిస్తే ఇవ్వనందుకు సైట్లో యం త్రాలను ధ్వంసం చేసిన వారిపై కేసులు పెట్టారని, కియా ఫ్యా క్టరీ మేనేజరును డబ్బుల కోసం బెదిరించిన వైసీపీ మండలస్థాయి నాయకుడిని పోలీసు స్టేషన్లో కూర్చోబెట్టారని తెలిసింది. దీంతో ఆయన బదిలీ ఆగిపోయింది. సీఎంసొంత జిల్లా కడప ఎస్పీ మహంతిపై కావాలని పట్టుబట్టి ఎన్నికల ముం దు ఈసీకి ఫిర్యాదు చేసిన వైసీపీ, ఎన్నికల తర్వాత ఆయనను కొంతకాలం కొనసాగించింది. అయితే జమ్మలమడుగు, పులివెందుల ప్రాంతాల్లోని కొందరు వైసీపీ నేతల ఆగడాలను అడ్డుకున్నందుకు ఆయనపై ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. దీంతో సెలవుపై పంపి, ఆ తర్వాత పూర్తిగా తప్పించేశారు.

### జనవరిలో మరో వికెట్

నెల్లూరు తరువాత పడే వికెట్ ఏ జిల్లాలో ఉందన్నదానిపై చర్చ జరుగుతోంది. మరో పెద్ద జిల్లా ఎస్పీ త్వరలో బదిలీ అవుతారని, ఆయన పనితీరు సరిగా లేదన్న ప్రచారం అప్పుడే మొదలైంది. యువకుడైన ఆ ఎస్పీ పలు వివాదాస్పద కేసులను సమర్థవంతంగా పరిష్కరించారు. సీఎం సొంతజిల్లాలో గత ప్రభుత్వం లో పనిచేసిన ఆయన, ఆ తర్వాత వెళ్లిన జిల్లాలో గట్టిగానే ప నిచేస్తున్నారని పోలీసువర్గాలు చెబుతున్నాయి. అయితే ఇప్పుడు బదిలీ చేయకుండా జనవరి ఆఖరులో చేస్తే మంచిద నే ఆలోచన ఉన్నట్లు తెలుస్తోంది. గుంటూరు అర్బన్ ఎస్పీ పీహెచ్‌డీ రామక్రిష్ణ డీఐజీ అవుతున్నందున ఆ స్థానం ఖాళీ అవుతుంది. ఇదే సమయంలో ఉత్తరాంధ్ర జిల్లాల్లో అవినీతి ఆరోపణలు వస్తున్న మరో ఐపీఎస్ అధికారిని కూడా మార్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# రూ.15వేల కోట్లు కావాలి

అమరావతి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నిధుల లేమితో ఖజానా ఖాళీ కావడంతో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా అప్పులపైనే ఆధారపడుతోంది. ఆదాయం పెంచే మార్గాల అన్వేషణపై దృష్టి సారించకుండా వీలైనన్ని అప్పులు, అందుబాటులో ఉన్న నిధుల నిర్వహణపైనే ఆర్థికశాఖ దృష్టి కేంద్రీకరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి చివరి త్రైమాసికమైన జనవరి నుంచి మార్చి నెలలకుగాను రూ.15వేల కోట్ల అప్పు తెచ్చుకునేందుకు అనుమతివ్వాలని కోరుతూ రాష్ట్ర ఆర్థికశాఖ ఇటీవల కేంద్రానికి లేఖ రాసింది. కానీ ఈ ఆర్థిక సంవత్సరంలో పబ్లిక్ రుణం రూపంలో అప్పు తెచ్చుకునేందుకు రాష్ట్రానికి మిగిలిన పరిమితి మరో రూ.3,300 కోట్లు మాత్రమే! అయినప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా అదనంగా రూ.11,700 కోట్లు అప్పు తెచ్చుకునేందుకు రాష్ట్ర ఆర్థికశాఖ ప్రయత్నిస్తోంది! ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి 3 త్రైమాసికాలకుగాను రూ.29వేల కోట్ల అప్పు తెచ్చుకునేందుకు కేంద్రం గతంలో అనుమతించింది. ఇంకా డిసెంబరు పూర్తి కాకముందే రాష్ట్రం ఈ మొత్తం పరిమితిని వాడేసింది. రూ.29వేల కోట్ల అప్పు ఇప్పటికే తెచ్చుకుంది. ఎఫ్ఆర్‌బీఎం నిబంధనల ప్రకారం ఈ ఏడాదికి రూ.32,300 కోట్ల వరకూ రాష్ట్రం అప్పు తీసుకోవచ్చు. ఇందులో ఇప్పటికే రూ.29వేల కోట్ల అప్పు తెచ్చారు కాబట్టి ఇంకా రూ.3,300 కోట్ల అప్పు తెచ్చుకునే వెసులుబాటు మాత్రమే ఉంటుంది. కానీ, నిబంధనలకు విరుద్ధంగా రూ.15వేల కోట్ల అప్పు కోసం అనుమతివ్వాలని రాష్ట్ర ఆర్థిక శాఖ కోరింది!

### రీపేమెంట్ల మినహాయింపు సాధ్యమేనా?

బడ్జెట్‌లో పబ్లిక్ రుణాల పరిమితిని రూ.44వేల కోట్లుగా పేర్కొన్నారు. రాష్ట్రానికి ఉన్న నాబార్డు, ఈఏపీ లాంటి రుణాల రీపేమెంట్లు కూడా దీని పరిధిలోకి వస్తాయి. ఈ రీపేమెంట్లన్నీ పోగా మిగిలే మొత్తాన్ని పబ్లిక్ రుణంగా సమీకరించుకునే వెసులుబాటు ఉంటుంది. దీని ప్రకారమే ఏపీకి ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.32,300 కోట్లు పబ్లిక్ రుణం తెచ్చుకునే అవకాశం వచ్చింది. అయితే, ప్రస్తుతం రాష్ట్రం ఆర్థికంగా తీవ్ర ఒడిదుడుకుల్లో ఉన్నందున రీపేమెంట్ల మొత్తాన్ని ఎఫ్ఆర్‌బీఎం పరిమితి నుంచి మినహాయించుకుని ఆ మొత్తాన్ని కూడా అప్పు రూపంలో తెచ్చుకునేందుకు అనుమతివ్వాలని రాష్ట్ర ఆర్థికశాఖ కోరుతోంది. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఈ ప్రతిపాదనను కేంద్రం తోసిపుచ్చే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని ఆర్థికశాఖ భావిస్తోంది. ఏపీ ప్రతిపాదనకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇస్తే నాబార్డు, ఈఏపీ రుణాల రీపేమెంట్లు నిలిచిపోయే అవకాశముండడమే ఇందుకు కారణం. ఈ పరిస్థితుల్లో ఆర్థికశాఖ కోరిన మొత్తానికి కాకపోయినా ఎంతో కొంత మొత్తాన్ని అప్పు తెచ్చుకునేందుకు కేంద్రం అనుమతించే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. కేంద్రం నుంచి అనుమతి వచ్చే వరకూ పబ్లిక్ రుణం రూపంలో పైసా కూడా అప్పు తెచ్చుకునే అవకాశం లేదు. కానీ ఉద్యోగులకు వేతనాలు, పెన్షన్లు ఇవ్వడం కోసం స్పెషల్ డ్రాయల్ ఫండ్స్(ఎస్‌డీఎఫ్), వేజ్ అండ్ మీన్స్ రూపంలో ఈ నెలలోనే రూ.2700 కోట్లు అప్పు తెచ్చారు. జీతాలిచ్చి వారం రోజులు దాటినా ఇంకా ఆ అప్పు భారం నుంచి ఖజానా బయటపడలేదు.

### అనుమతి ఎప్పటికొచ్చేనో..

సాధారణంగా చివరి త్రైమాసికం కోసం అప్పు తెచ్చుకునేందుకు అన్ని రాష్ట్రాలు కోరిన తర్వాతే వాటన్నింటినీ పరిశీలించి కేంద్రం ఒకేసారి అనుమతిస్తుంటుంది. ఈ ప్రక్రియ మొత్తం జరగడానికి చాలా సమయమే పడుతుంది. ఎందుకంటే గత ఏడాది కూడా చివరి త్రైమాసికం అప్పు కోసం అనుమతి కోరుతూ రాష్ట్ర ఆర్థికశాఖ అన్ని రాష్ట్రాల కంటే ముందే కేంద్రానికి లేఖ రాసింది. కానీ, అన్ని రాష్ట్రాల నుంచి ప్రతిపాదనలు అందాకే స్పందిస్తామని అప్పట్లో కేంద్ర ఆర్థికశాఖ చెప్పింది. నిధుల అవసరం అత్యవసరం కావడంతో గత ఏడాది ఆర్థికశాఖలో పనిచేసిన ఒక అధికారి ప్రత్యేకంగా ఢిల్లీ వెళ్లారు. రాష్ట్రంతో సంబంధం లేకుండా కేవలం తనకున్న పరిచయాలతో అక్కడి అధికారులకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి వివరించి వారం రోజుల్లో రూ.5వేల కోట్లు తీసుకురాగలిగారు. లేదంటే అందరితో పాటే జనవరి చివరి వరకూ ఎదురుచూడాల్సి వచ్చేది.





**విజయవాడ**
భవానీపురం రైతు బజారులో శనివారం మధ్యాహ్నం అమ్మకాలు ముగిసినట్టు ప్రకటించగానే.. సంచుల కింద ఉండిపోయిన ఉల్లిపాయల కోసం మహిళలంతా ఒక్కసారిగా ఎగబడ్డారు.

# ఉల్లి కోసం జాగారం

ఉల్లిపాయలు బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.169కి అమ్ముతున్నారు. దీంతో రైతు బజార్లలో ప్రభుత్వం రూ.25కి విక్రయిస్తున్న రాయితీ ఉల్లికి డిమాండ్ పెరిగిపోయింది. తెల్లవారుజాము నుంచే జనం రైతు బజార్లకు చేరుతున్నారు. పిల్లల తల్లులు, చిన్నారులు, వృద్ధులు... రేషన్ కార్డు, సంచి పట్టుకొని రైతుబజార్లకు చేరుకుంటున్నారు. శనివారం తెల్లవారుజామున మూడు గంటలకు 'ఆంధ్రజ్యోతి' బృందం ఎంవీపీ కాలనీ నుంచి కంచరపాలెం వరకు ఉన్న రైతుబజార్లను పరిశీలించగా అన్నిచోట్లా ఇదే పరిస్థితి కనిపించింది. ఎంవీపీ కాలనీ రైతుబజార్ వద్ద మహిళలు భారీ సంఖ్యలో క్యూలో నిలుచున్నారు. సరకు లేనందున ఆదివారం ఉల్లిని విక్రయించడం లేదని బోర్డులు ఏర్పాటు చేశారు.

- ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం



# చింతపల్లి @ 9

చింతపల్లి(విశాఖ జిల్లా), డిసెంబరు 7: విశాఖ మన్యంలో చలి తీవ్రత పెరిగింది. ప్రజలు గజగజ వణుకుతున్నారు. ఉత్తరాది నుంచి వీస్తున్న శీతల గాలుల ప్రభావంతో కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోయాయి. శనివారం చింతపల్లిలో 9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. వారం రోజుల కిందట ఏడు డిగ్రీలు నమోదు కాగా, తరువాత నుంచి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతూ వచ్చాయి. కానీ శనివారం మళ్లీ ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పడిపోయాయి. తెల్లవారుజాము నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకు మంచు దట్టంగా కురుస్తోంది. లంబసింగి వద్ద మంచు అందాలను వీక్షించేందుకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు.



## ఈ అన్నం వద్దు బాబోయ్!

మేకులు.. పురుగులు, రాళ్లతో ఉన్న ఈ అన్నం మాకొద్దు బాబోయ్ అంటున్నారు... పశ్చిమగోదావరి జిల్లా దేవరపల్లి మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు. మండలంలోని బంధపురం రంగరాయ కాలనీ, గౌరీపట్నం, లక్ష్మీపురం గ్రామాల్లోని పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో శనివారం మేకు, రాళ్లు, పురుగులు కన్పించాయి. ఈ పాఠశాలలకు ఏక్తాశక్తి ఫౌండేషన్ భోజనం సరఫరా చేస్తున్నది. నాసిరకం భోజనంపై ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఈ అన్నం తినలేక కొంతమంది క్యారేజీలు తెచ్చుకుంటున్నారని, మరికొంతమంది అర్ధాకలితో ఉంటున్నారని తెలిపారు.

- దేవరపల్లి

## ఏడు సెజ్‌ల గడువు పెంపు

- ఏర్పాటుకు మూడేళ్లు పొడిగించిన కేంద్రం
- 15 ఏళ్లపాటు ఆదాయపన్ను రాయితీ

న్యూఢిల్లీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఏపీలో ఏడు ప్రత్యేక ఆర్థిక మండళ్ల(ఎస్ఈజెడ్)కు వాటి ఏర్పాటు గడువును కేంద్రం మూడేళ్ల పాటు పొడిగించింది. ప్రపంచీకరణ నేపథ్యంలో వాణిజ్య, వ్యాపారరంగాలలో నెలకొన్న ప్రతికూల పరిస్థితులు, కొన్ని కేంద్రప్రభుత్వ సంస్థల నుంచి అనుమతుల్లో జాప్యం, పర్యావరణ అనుమతుల్లో జాప్యం వంటి ప్రధానమైన కారణాలతో సెజ్‌ల ఏర్పాటు ప్రక్రియ ఆలస్యమవుతోంది. ఈ నేపథ్యంలో సెజ్‌ల డెవలపర్ల నుంచి వచ్చిన విజ్ఞప్తు మేరకు క్షేత్రస్థాయిలో పరిస్థితులను సమీక్షించిన తర్వాత దేశవ్యాప్తంగా 153 సెజ్‌ల ఏర్పాటు గడువును మూడేళ్లు పొడిగించినట్లు కేంద్ర వాణిజ్యం, పరిశ్రమలశాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. అనుమతించబడిన ప్రతిపాదనలకు లోబడి ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన స్పష్టం చేశారు. వీటిలో ఏపీకి చెందిన ఏడు సెజ్‌లు ఉన్నాయి.

### ఏపీలోని సెజ్‌ల వివరాలు

- నెల్లూరు జిల్లా చిల్లక్రు మండలంలోని చింతవరం గ్రామం వద్ద ఎంఎఎస్ ఫ్యాబ్రిక్ పార్క్(ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో టెక్స్‌టైల్ అండ్ అపరెల్ పార్కును ఏర్పాటు చేస్తున్నారు.
- విశాఖ జిల్లా ఆనందపురం మండలంలోని గంభీరం గ్రామం వద్ద ఐటీ, ఐటీఈఎస్ సెజ్.
- శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలంలో ఫార్మాస్యూటికల్స్ సెజ్.
- అనంతపురం జిల్లా మడకశిర మండలంలోని కొడిగేపల్లి, పరిగి మండలంలోని సేరికోకుం గ్రామాల వద్ద మల్టీ సర్వీసెస్ పార్కు.
- తూర్పుగోదావరి జిల్లా కాకినాడ వద్ద కాకినాడ సెజ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మల్టీ ప్రొడక్టు సెజ్.
- అనంతపురం జిల్లా చిలమతూరు మండలం కోడూరు వద్ద బయోటెక్ అండ్ అనుబంధ కార్యక్రమాల సెజ్.
- విశాఖప్పటం జిల్లా రేసపువానిపాలెం గ్రామం వద్ద ఓల్డ్ టీబీ హాస్పిటల్ ప్రాంతంలో ఐటీ, ఐటీఈఎస్ పార్కు.

## సామూహిక 'గీతా' పారాయణం

టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, ఇస్కాన్, ధార్మిక సంస్థల ఆధ్వర్యంలో శనివారం తిరుపతిలోని ఎస్వీ ఉన్నత పాఠశాలలో గీతాజయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలలకు చెందిన వేలాది మంది విద్యార్థులు సామూహిక గీతా పారాయణం చేశారు. భగవద్గీతలోని పురుషోత్తమ ప్రాప్తియోగంలోని 20 శ్లోకాలను పారాయణం చేశారు. ఒక్కసారిగా వేల గొంతులు పారాయణం చేయడం టీటీడీ చరిత్రలో ఇదే మొదటిసారి.

- తిరుపతి కల్చరల్



# తమిళనాడులో తెలుగుకు నిధులు

- 'భారతీయ భాష' స్థానంలో బోధన
- భాష ఎంపికలో విద్యార్థికే స్వేచ్ఛ
- తమిళ భాషాభివృద్ధి మంత్రి ప్రకటన
- తెలుగు సంఘాల హర్షం

చెన్నై, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్వభాషకు పట్టంకట్టే తమిళనాడులో తెలుగుకు భారీ ప్రాధాన్యం దక్కనుంది. 2014లో తీసుకున్న నిర్ణయం మేరకు తమిళ విద్యార్థులకు వారి మాతృ భాషతోపాటు మరో భారతీయ భాషను నేర్పించనున్నారు. దీనికిగాను తెలుగును ఎంపిక చేయడంతోపాటు నిధులు కేటాయించాలని నిర్ణయించారు. దీంతో 'నిర్బంధ తమిళం' మినహాయింపు కోసం ఎదురు చూస్తున్న తమిళనాడులోని తెలుగు విద్యార్థులకు శుభవార్త అందినట్టయింది. తెలుగు బోధనకు నిధులు కేటాయించనున్నట్లు తమిళ భాషాభివృద్ధి శాఖ మంత్రి కె.పాండియరాజన్ శనివారం ప్రకటించారు. చెన్నై తరమణిలో ఉన్న ప్రపంచ తమిళ పరిశోధన కేంద్రంలో ఒక భారతీయ భాష, ఒక విదేశీ భాషను నేర్పించేలా 2014లో అప్పటి సీఎం జయలలిత ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, భారతీయ భాషగా హిందీ నేర్పించడాన్ని అంగీకరించబోమని డీఎంకే సహా పలు తమిళ పార్టీలు వ్యతిరేకించాయి. ఈ నేపథ్యంలో మంత్రి పాండియరాజన్ శనివారం ఈ కేంద్రాన్ని పరిశీలించారు. ఆ సందర్భంగా మాట్లాడుతూ, తమ ప్రభుత్వం 'అమ్మ' బాటలోనే పయనిస్తోందని, ఆమె ఆశయాల మేరకే ప్రపంచ భాషల్లో ఒకటైన ఫ్రెంచ్‌తో పాటు భారతీయ భాషల్లో తెలుగును ఎంపిక చేశామని, హిందీకి కేటాయించిన నిధులను తెలుగు బోధనకు కేటాయిస్తామని ప్రకటించారు. తమిళం గొప్పతనాన్ని ఇతర దేశాలకు తెలిసేలా, అదే సమయంలో ఇతర భాషలను తమిళులు తెలుసుకోవాల్సిన అవసరం కూడా ఉందన్నారు. ఏ భాషలో చదువుకోవాలో విద్యార్థులే ఎంపిక చేసుకుంటారని, దీనిలో నిర్బంధమేమీ ఉండదని మంత్రి చెప్పారు. కాగా, మంత్రి ప్రకటనపై నగరంలోని తెలుగు సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. అఖిల భారత తెలుగు సమాఖ్య అధ్యక్షుడు ఆచార్య సీఎంకే రెడ్డి స్పందిస్తూ, మాజీ సీఎం జయలలిత నుండి ప్రస్తుత సీఎం ఎడప్పాడి వరకు తెలుగు భాషకు న్యాయం చేస్తున్నారని, ఏఐటీఎఫ్ కృషికి తగిన ఫలితం దక్కిందన్నారు. తమిళనాడు కమ్మ నాయుడు సంక్షేమ సంఘం, తమిళగ నాయుడు పేరవై రాష్ట్ర కోశాధికారి తాళ్లూరి సురేష్ తదితరులు ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రశంసించారు.

# నన్నెవరూ తాకలేరు..

- అజ్ఞాతం నుంచే నిత్యానంద వ్యాఖ్యలు
- ముఖం కనిపించకుండా వీడియో విడుదల

న్యూఢిల్లీ, డిసెంబరు 7: వివాదాస్పద మత గురువు నిత్యానంద వ్యాఖ్యలతో కూడిన ఓ వీడియో తాజాగా బయటకు వచ్చింది. అజ్ఞాత ప్రదేశం నుంచి, ముఖం కనిపించకుండా అతడు మాట్లాడినట్లున్న ఈ వీడియోలో.. 'నన్ను ఏ కోర్టులు విచారించలేవు' అన్న వ్యాఖ్యలున్నాయి. అయితే, అతడు ఏ రోజున మాట్లాడినదీ ఇందులో లేదు. 'నేను నిజాలు చెబుతాను. మీలో ఎవరికీ ఇక మరణం ఉండదు' అని తన విశ్వాసులను ఉద్దేశించి సంభాషిస్తున్నట్లు ఉన్న ఈ వీడియోలో కెమెరాను నిత్యానంద ముఖం వైపు చూపకపోవడం గమనార్హం. నిత్యానంద.. దక్షిణ అమెరికా దేశాలకు పారిపోయినట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కాగా, తన ఆశ్రమంలో బాలికలను నిర్బంధించిన ఆరోపణలు ఎదుర్కొంటున్న అతడు గత నెల 21న విదేశాలకు పారిపోయినట్లు చెబుతున్నారు.

## చలికాలం

| కేంద్రం | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| గుంటూరు | 16.9 | 30.5 |
| హైదరాబాద్ | 16.1 | 27.6 |
| కర్నూలు | 18.0 | 30.5 |
| విజయవాడ | 19.4 | 30.0 |
| శ్రీకాకుళం | 22.0 | 32.0 |

## దక్షిణకోస్తాలో వర్షాలు

విశాఖపట్నం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతం నుంచి తూర్పుగాలులు వీస్తుండడంతో కోస్తా, రాయలసీమలో అనేకచోట్ల మేఘాలు ఆవరించాయి. శనివారం దక్షిణకోస్తా, రాయలసీమలో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరుగా వర్షాలు కురిశాయి. నారంపేట, చింతవరం, డీసీపల్లె, ఆత్మకూరుల్లో 2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమలో పలుచోట్ల ఉరుములతో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం లేదా ఒకటి రెండు డిగ్రీలు తక్కువగా నమోదవుతాయని పేర్కొంది.



## సాయుధ బలగాల సంక్షేమానికి విరాళమివ్వండి

సాయుధ బలగాల పతాక దినోత్సవం సందర్భంగా మన బలగాల ధైర్యసాహసాలకు నేను శాల్యూట్ చేస్తున్నాను. వారి సంక్షేమం కోసం విరాళం ఇవ్వాలని ప్రజలను కోరుతున్నాను.

- డిసెంబరు 7 సాయుధ బలగాల దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ



## పౌరసత్వ సవరణ బిల్లుపై రెండో స్వాతంత్ర్య సమరం

పౌరసత్వ సవరణ బిల్లు, ఎన్ఆర్‌సీపై మేము జరిపే పోరాటం రెండో స్వాతంత్ర్య సంగ్రామం వంటిది. మతంతో నిమిత్తం లేకుండా ప్రతి శరణార్థికీ పౌరసత్వాన్ని ఇస్తే, పౌరసత్వ సవరణ బిల్లుకు మద్దతు తెలుపుతాం.

- మమతా బెనర్జీ, పశ్చిమ బెంగాల్ సీఎం



## ప్లాస్టిక్ ద్వారా శరీరంలోకి విష రసాయనాలు

వాషింగ్టన్, డిసెంబరు 7: అన్నం తినే ప్లేటు ప్లాస్టిక్.. నీళ్లు తాగే బాటిల్ ప్లాస్టిక్.. బయట ఏమన్నా తెచ్చుకున్నా ప్యాక్ చేసేది ప్లాస్టిక్.. మన జీవితంలో ప్లాస్టిక్ తప్పించుకోలేనిదిగా మారింది. అయితే ఈ ప్లాస్టిక్ ద్వారా మనకు తెలియకుండానే బీపీఏ అనే రసాయనం మన శరీరంలోకి వెళ్తోందని శాస్త్రవేత్తల తాజా పరిశోధనల్లో తేలింది. అమెరికా పరిశోధకులు కొంత మంది మూత్ర నమూనాలు పరిశీలించగా, వారిలో సాధారణం కంటే 44 రెట్లు ఎక్కువ బీపీఏ ఉన్నట్లు వెల్లడైంది. ఇది సంతానోత్పత్తి, మెదడు పనితీరుపై ప్రభావం చూపుతుందని శాస్త్రవేత్తలు చెప్పారు. ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికే కాకుండా మానవ శరీరానికి కూడా ముప్పేనని హెచ్చరించారు.

## వార్తాపత్రికలో తింటే కేన్సర్ ముప్పు!

న్యూఢిల్లీ, డిసెంబరు 7: హోటల్‌కు వెళ్లి ఏదైనా పార్శల్ చేయమంటే వార్తాపత్రికల్లో చుట్టిస్తారు.. అయితే ఇలా వార్తాపత్రికల్లో పెట్టిన ఆహార పదార్థాలు తినడం ఆరోగ్యానికి చాలా ప్రమాదకరమని భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ శుక్రవారం సూచించింది. వార్తాపత్రికల సిరా రంగుల్లో కేన్సర్ కారకాలు ఉంటాయని తెలిపింది. వాటిల్లో తినడం వల్ల కేన్సర్ వచ్చే ప్రమాదం ఉందని తెలిపింది. పిల్లలు, వృద్ధుల్లో రోగనిరోధక శక్తి తగ్గుతుందని వెల్లడించింది. ఈ రసాయనాలు జీర్ణక్రియపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయని హెచ్చరించింది.

> కార్మికులకు సెప్టెంబరునెల జీతాలు చెల్లించడానికి కూడా డబ్బులేదని చెప్పిన ప్రభుత్వమే ఒకే ఒక్క రోజులో జీతాలు చెల్లించింది. తన మాట లెక్క చేయకుండా సమ్మెకు వెళ్లిన కార్మికులు సెల్ఫ్ డిస్మిస్ అయ్యారనీ, ఆర్టీసీని మూసివేస్తామనీ, కార్మికులను తిరిగి విధుల్లోకి చేర్చుకునే పరిస్థితి లేదనీ ముఖ్యమంత్రిగా కేసీఆర్ చేసిన ప్రకటనలతో దిగులు చెందిన కొంతమంది కార్మికులు ఆత్మబలిదానాలు చేసుకున్నారు. అంటే వారి చావులకు కేసీఆర్ ప్రకటనలే కారణమని చెప్పకుండా ఉండగలమా? అలాంటప్పుడు కేసీఆర్ శిక్షార్హుడే కదా? తప్పుడు అఫిడవిట్లతో హైకోర్టును తప్పుదారి పట్టించడం కూడా నేరమే అవుతుంది కదా! ఈ మొత్తం వ్యవహారంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఏ మాత్రం బాధ్యతగా వ్యవహరించలేదు. అయినా ఆయనను ఎవరూ తప్పుబట్టలేని పరిస్థితి ఏర్పడటానికి సమస్యకు ఆయన ఇచ్చిన ఫినిషింగ్ టచ్ కారణం!

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

కొత్త పలుకు

■ ఆర్కే RK



# కేసీఆర్ చాణక్య నీతి!

అప్పుడప్పుడు ప్రజల భావోద్వేగాలను సంతృప్తిపరుస్తుండటం ప్రజలకు ప్రభుత్వాల పట్ల భక్తిని పెంచుతుంది.. ఇది చాణుక్యుడి రాజనీతి! తనను అవమానించిన ధననందుడు అనే రాజును ధిక్కరించి ఆయన సామ్రాజ్యాన్ని కూల్చివేసి చంద్రగుప్తుణ్ని రాజుగా చేసిన మహా మేధావి చాణక్యుడు. చాణక్యుడికే రాజనీతిని బోధించే సత్తా ఉన్న నేత తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు! ప్రజలలో భావోద్వేగాలు పెచ్చరిల్లే వరకు మౌనంగా ఉండి చివరకు పరిస్థితిని తనకు అనుకూలంగా మలుచుకోవడంలో ఆరితేరిన నేతగా కేసీఆర్ రాజకీయం చేస్తున్నారు. దీంతో అప్పటివరకు ప్రభుత్వాన్ని విమర్శిస్తూ వచ్చే ప్రతిపక్షాలు.. కేసీఆర్ ఇచ్చే ఫినిషింగ్ టచ్‌తో చివరలో చతికిలబడుతున్నాయి. ఆర్టీసీ కార్మికుల సమ్మె విషయంలోనే కాకుండా దిశ ఉదంతంలో కూడా ముఖ్యమంత్రి కేసీఆర్ చాణక్య నీతినే ప్రదర్శించారు. చట్టాలను గౌరవించాలనుకునేవారికి వాయిస్ లేకుండా చేశారు. అత్యాచారానికి, ఆపై హత్యకు గురైన దిశ కుటుంబాన్ని సంఘటన జరిగి వారం రోజులైనా పరామర్శించకపోవడంపై జాతీయ మీడియా కూడా కేసీఆర్‌ను తప్పుబట్టింది. అయినా నోరు విప్పని కేసీఆర్ పది రోజులకు ఇచ్చిన ఫినిషింగ్ టచ్ ద్వారా జేజేలు అందుకున్నారు. దిశపై దారుణానికి ఒడిగట్టిన నలుగురు నిందితులను

> **రెండు లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ కార్మికుల సమ్మెను కేసీఆర్ ముదరనిచ్చారు. ఇందులో మొదటిది తనను ధిక్కరించిన యూనియన్ నాయకులకు మనుగడ లేకుండా చేయడం. రెండవది అసాధారణ రీతిలో బస్సు చార్జీలను పెంచినా ప్రజల నుంచి, ప్రతిపక్షాల నుంచి వ్యతిరేకత రాకుండా చేసుకోవడం. ఆర్టీసీ ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందని ప్రచారం చేయడం ద్వారా ప్రజలను నమ్మించడంలో కేసీఆర్ సక్సెస్ అయ్యారు. ఈ కారణంగానే చరిత్రలో ఎన్నడూ లేని విధంగా చార్జీలు పెంచినా.. కనీస ప్రతిఘటన కూడా ఎదురవ్వలేదు. ప్రతిపక్షాలకు కూడా చార్జీల పెంపును తప్పుబట్టలేని స్థితి కల్పించారు.**

ఎన్‌కౌంటర్ చేశారని శుక్రవారం ఉదయమే వార్త గుప్పుమంది. దీంతో ఆసేతు హిమాచలం పులకించింది. శభాష్ అంటూ తెలంగాణ పోలీసులను అభినందించింది. చట్టాలు చేసే ఎంపీలు కూడా చట్టవిరుద్ధంగా జరిగినట్టు అనుమానిస్తున్న ఎన్‌కౌంటర్‌కు మద్దతుగా మాట్లాడారు. సినీ తారలు, ఇతర ప్రముఖులు కూడా తెలంగాణ పోలీసులను అభినందిస్తూ పోస్టులు పెట్టారు. న్యాయ ప్రక్రియతో సంబంధం లేకుండా 'తక్షణ న్యాయం' అనే విధానాన్ని తెలంగాణ పోలీసులు అమలు చేసినా 'అది తప్పు'.. అనే సాహసం ఎవరూ చేయలేకపోయారు. కారణం ప్రజలలో భావోద్వేగాలు పతాక స్థాయికి చేరుకోవడమే! నాడు నిర్భయ.. నేడు దిశ వంటి సంఘటనలు జరిగినప్పుడు ఎన్‌కౌంటర్ చేసి చంపేయడమే సరైన పరిష్కారం అనే భావన దేశమంతటా వ్యాపించడానికి వ్యవస్థల వైఫల్యమే కారణం! నిర్భయ కేసులో దోషులకు మరణశిక్ష విధించినా ఇంతవరకు అమలు చేయలేదు. దీనికి కారణం న్యాయ ప్రక్రియలో మనం అనుసరిస్తున్న సాగదీత విధానమే! మరణశిక్ష పడినవారికి క్షమాభిక్ష కోరుకునే వెసులుబాటు ఉండటం, సదరు పిటిషన్లపై సత్వరం నిర్ణయం తీసుకోకపోవడం వల్ల శిక్ష అమలులో జాప్యం జరుగుతోంది. ఫలితంగా ప్రజలలో అసహనం ప్రబలుతోంది. నిందితులను ఎన్‌కౌంటర్ చేయడం వల్ల దేశంలో అత్యాచారాలు జరగవా? అంటే చెప్పలేని పరిస్థితి! నిర్భయ సంఘటన తర్వాత మళ్లీ దిశ ఉదంతం జరిగే వరకు దేశంలో ఎంతో మంది బాలికలు, యువతులు, మహిళలు అత్యాచారాలు, హత్యలకు గురయ్యారు. అయితే కొందరి విషయంలోనే సమాజం నుంచి స్పందన వస్తుండటానికి కారణం ఏమిటంటే.. అదొక సమాధానం దొరకని ప్రశ్న! ఆసిఫాబాద్ జిల్లాలో ఒక దళిత యువతిని అత్యాచారం చేసి హత్య చేశారు. అయినా సమాజం నుంచి స్పందన రాలేదు. దీనిపై దళిత సంఘాలు మనసు కష్టపెట్టుకున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్‌లో గతంలో అత్యాచారానికి గురైన యువతిపై రెండు రోజుల క్రితమే పెట్రోల్ పోసి తగులబెట్టి చంపారు. ఈ దారుణానికి ఒడిగట్టింది కూడా అత్యాచారం చేసిన నిందితులే! అయినా సమాజంలో స్పందన లేదు. మొట్టమొదటిసారిగా దక్షిణాదిన జరిగిన దిశ సంఘటనపై ఉత్తరాదిన కూడా భారీ స్పందన వచ్చింది. దక్షిణాదికి చెందిన వారికి ఇది ఊరటనిచ్చే అంశమే! ఇప్పుడు దిశ నిందితుల ఎన్‌కౌంటర్ విషయానికి వద్దాం. నిందితులు పోలీసులపై తిరగబడ్డారని పోలీసులు చెబుతున్న కథనాన్ని ఎన్‌కౌంటర్‌ను సమర్థించినవారు కూడా నమ్మడం లేదు. తక్షణ న్యాయం అన్న సూత్రాన్ని పోలీసులు అమలుచేశారని భావిస్తున్నవారి సంఖ్య ఎక్కువ. అయినా ప్రజల నుంచి అనూహ్య రీతిలో పోలీసులకు అభినందనలు వెల్లువెత్తాయి. గతంలో వరంగల్‌లో యాసిడ్ దాడికి పాల్పడినవారిని ఎన్‌కౌంటర్ చేసిన చరిత్ర ఉన్న సజ్జనార్ పర్యవేక్షణలోనే ఇప్పుడు దిశ నిందితులు కూడా ఎన్‌కౌంటర్ అయ్యారు. దీంతో 'సాహో సజ్జనార్' అంటూ ఆయనను ప్రజలు ప్రశంసలతో ముంచెత్తారు. నిజానికి ముఖ్యమంత్రి కేసీఆర్ అనుమతించి ఉండకపోతే ఈ ఎన్‌కౌంటర్ జరిగి ఉండేది కాదు. చాణక్య రాజనీతిని ఒంటబట్టించుకున్న కేసీఆర్.. ప్రజలలో భావోద్వేగాలను గమనించి ఎన్‌కౌంటర్‌కు అనుమతించడం ద్వారా శభాష్ అనిపించుకున్నారు. ఈ సంఘటనపై నిన్నటివరకు కేసీఆర్ ప్రభుత్వాన్ని విమర్శించిన ప్రతిపక్షాలు కూడా జరిగింది ఏమిటో తెలిసినా ఎన్‌కౌంటర్‌ను సమర్థించక తప్పలేదు. అందుకే అప్పుడప్పుడు మాత్రమే ప్రజల భావోద్వేగాలను సంతృప్తిపరచాలని చాణక్యుడు చెప్పాడు. ప్రజలలో భావోద్వేగాలు ఏర్పడిన ప్రతిసారీ ఇదే తక్షణ న్యాయం అమలుచేసినా వికటిస్తుంది. అందుకే సంఘటన జరిగి వారం రోజులు దాటినా ముఖ్యమంత్రి కేసీఆర్ మౌనంగానే ఉన్నారు. దిశ కుటుంబ సభ్యులను పరామర్శించడం కేసీఆర్‌కు పెద్ద విషయం ఏమీ కాదు. అలా చేసి ఉంటే ఆయన సమక్షంలోనే దిశ కుటుంబ సభ్యులు నిరసన వ్యక్తంచేసి ఉండేవారు. అందుకే పరామర్శలు అనే తాత్కాలిక ఉపశమనాల జోలికి కేసీఆర్ వెళ్లరు. ప్రజల భావోద్వేగాలను ఎప్పుడు సంతృప్తిపరచాలో ఆయనకు బాగా తెలుసు! ఈ ఎన్‌కౌంటర్ ద్వారా నిన్నటివరకు తనను విమర్శించిన వారి నోరు మూయించడంతోపాటు దిశ కుటుంబ సభ్యుల నుంచి కూడా ముఖ్యమంత్రి అభినందనలు అందుకున్నారు. అంతకు ముందు నయీం విషయంలో కూడా కేసీఆర్ ఇదే విధంగా వ్యవహరించారు. నక్సలైట్ ఉద్యమంతో విభేదించి బయటికొచ్చిన నయీం గ్యాంగ్‌స్టర్‌గా అవతరించాడు. ప్రారంభంలో నక్సలైట్లను మట్టుబెట్టడానికై పోలీసులు కూడా నయీంను వాడుకున్నారు. దీంతో పోలీస్ వ్యవస్థ తన జేబులో ఉందని భావించిన నయీం రెచ్చిపోయాడు. తన ఆదేశాలను ధిక్కరించిన వారందరినీ నయీం చిత్రహింసలు పెట్టాడు. కొందరిని హత్య చేశాడు. చివరకు పోలీసులకే సవాల్‌గా మారాడు. చంద్రబాబు హయాంలో మొదలైన నయీం దందాలు.. రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రులుగా ఉన్నప్పుడు వ్యవస్థీకృతం అయ్యాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక నయీంపై దృష్టి కేంద్రీకరించారు. అనువైన సమయం చూసుకుని నయీంను ఎన్‌కౌంటర్ చేయించారు. దీంతో 'సాహో కేసీఆర్' అంటూ అప్పట్లో ఆయనను అందరూ అభినందించారు. రాజకీయ వ్యవస్థను కూడా శాసించే స్థాయికి ఎదిగిన నయీంకు ఎన్‌కౌంటర్‌తో ముగింపు పలికిన ఘనత కేసీఆర్‌కు దక్కింది. ఇన్నాళ్లకు మళ్లీ ఇప్పుడు దిశ నిందితులు ఎన్‌కౌంటర్ అయ్యారు. దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నారు. పోలీసులను పోటీలు పడి మరీ పొగిడారు. దిశపై దారుణం జరిగిన రోజు ఫిర్యాదు చేయడానికి వెళ్లిన ఆమె కుటుంబ సభ్యుల పట్ల ఇదే పోలీసులు అమర్యాదకరంగా వ్యవహరించారు. ఫిర్యాదుపై సకాలంలో స్పందించి ఉంటే దిశపై అఘాయిత్యం జరిగి ఉండేది కాదేమో! ఆమెతోపాటు నిన్న ఎన్‌కౌంటర్‌లో మరణించినవారు కూడా బతికి ఉండేవారేమో! ఇప్పుడు ఈ ఎన్‌కౌంటర్ ద్వారా ఆ వైఫల్యం మరుగునపడిపోయింది. పోలీసుల నిర్లక్ష్యాన్ని ప్రజలందరూ మరచిపోయారు. నయీం విషయంలో కూడా పోలీసు శాఖ చేసిన తప్పు మరుగునపడింది. నిజానికి ఇలాంటి ఎన్‌కౌంటర్లు గతంలో జరిగి ఉంటే మానవ హక్కుల సంఘాల నుంచి ప్రతిఘటన వచ్చేది. శుక్రవారంనాడు అలాంటి పరిస్థితి కనిపించలేదు. హైకోర్టును ఆశ్రయించినవారు కూడా గుట్టుగానే వ్యవహరించారు. ఎందుకంటే ప్రజలలో భావోద్వేగాలు పరాకాష్ఠకు చేరాయి. ఎన్‌కౌంటర్‌పై తమ అభ్యంతరాలను వ్యక్తంచేయడానికి ఎవరూ సాహసించలేని పరిస్థితి! గుత్తా జ్వాల ఒక్కరే తన అభిప్రాయాన్ని స్వేచ్ఛగా వెల్లడించారు. ఆమె అన్నట్టుగా ఈ ఎన్‌కౌంటర్‌తో దేశంలో అత్యాచారాలు ఆగిపోతాయని చెప్పలేని పరిస్థితి. నిర్భయ చట్టం చేసిన తర్వాత కూడా అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయి. వరంగల్‌లో యాసిడ్ దాడికి పాల్పడినవారిని ఎన్‌కౌంటర్ చేసిన తర్వాత కూడా యాసిడ్ దాడులు ఆగిపోలేదు. నిజానికి దిశపై అఘాయిత్యానికి పాల్పడింది 'ఆ నలుగురే' అని పోలీసులు చెప్పడం మినహా.. వారే దోషులు అనడానికి సరైన శాస్త్రీయ ఆధారాలు ఉన్నాయో లేవో కూడా తెలియదు. న్యాయ సమీక్షలో గానీ ఇలాంటి సందేహాలు నివృత్తి కావు. న్యాయ ప్రక్రియ ద్వారా పడాల్సిన శిక్షలను పోలీసులు అమలుచేయడం సమర్థనీయం కాదన్న వాదన కూడా ఉంది. అయితే బాధితులకు ఉపశమనం కలిగేలా నిందితులకు వెనువెంటనే శిక్షలు విధించి అమలుచేయడంలో ప్రస్తుత వ్యవస్థకు నిబంధనలు అడ్డుగా ఉన్నాయి. వంద మంది దోషులు తప్పించుకున్నా ఫర్వాలేదు గానీ, ఒక్క నిర్దోషిని కూడా శిక్షించకూడదన్న విధానాన్ని పాటిస్తున్నందున న్యాయ ప్రక్రియ ఏళ్లు గడిచినా ముగియడం లేదు. దీంతో ప్రజలలో అసహనం గూడుకట్టుకుంటోంది. ఫలితంగా తక్షణ శిక్షలు కావాలని సమాజం కోరుకుంటోంది. కానీ, తక్షణ న్యాయం అన్నది సాధ్యంకాదని, ప్రతీకార న్యాయాన్ని అమలు చేస్తే న్యాయ ప్రక్రియకు అర్థమే ఉండదని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బాబ్డే శనివారం నాడు చేసిన వ్యాఖ్యలు గమనించాలి. నిందితులను ఎన్‌కౌంటర్ చేసే అధికారం పోలీసులకు ఇవ్వడం వల్ల అనర్థాలు జరిగే ప్రమాదం లేకపోలేదు. సమాజం నుంచి వచ్చే ఒత్తిళ్లకు తలొగ్గి నిర్దోషులను కూడా దోషులుగా చిత్రించే అవకాశమూ లేకపోలేదు. చట్టాలు చేసే ఎంపీలు కూడా శుక్రవారం నాడు భావోద్వేగంతోనే పార్లమెంటులో ప్రసంగించారు. ప్రజల భావోద్వేగాలను సంతృప్తిపరచడం ప్రజాప్రతినిధులు, పాలకులకు అవసరమే కావచ్చును గానీ.. మున్ముందు అయినా న్యాయ ప్రక్రియ వేగవంతం కావడానికి ఏమి చేయాలో ఆలోచించడం మంచిది. ఆటవిక న్యాయం అన్ని వేళలా మంచిది కాదు.




> **గతంలో వరంగల్‌లో యాసిడ్ దాడికి పాల్పడినవారిని ఎన్‌కౌంటర్ చేసిన చరిత్ర ఉన్న సజ్జనార్ పర్యవేక్షణలోనే ఇప్పుడు దిశ నిందితులు కూడా ఎన్‌కౌంటర్ అయ్యారు. దీంతో 'సాహో సజ్జనార్' అంటూ ఆయనను ప్రజలు ప్రశంసలతో ముంచెత్తారు. నిజానికి ముఖ్యమంత్రి కేసీఆర్ అనుమతించి ఉండకపోతే ఈ ఎన్‌కౌంటర్ జరిగి ఉండేది కాదు. చాణక్య రాజనీతిని ఒంటబట్టించుకున్న కేసీఆర్.. ప్రజలలో భావోద్వేగాలను గమనించి ఎన్‌కౌంటర్‌కు అనుమతించడం ద్వారా శభాష్ అనిపించుకున్నారు. ఈ సంఘటనపై నిన్నటివరకు కేసీఆర్ ప్రభుత్వాన్ని విమర్శించిన ప్రతిపక్షాలు కూడా జరిగింది ఏమిటో తెలిసినా ఎన్‌కౌంటర్‌ను సమర్థించక తప్పలేదు. అందుకే అప్పుడప్పుడు మాత్రమే ప్రజల భావోద్వేగాలను సంతృప్తిపరచాలని చాణక్యుడు చెప్పాడు.**

## ఆ శభాష్ వెనుక..

ఇప్పుడు ఆర్టీసీ కార్మికుల సమ్మె విషయంలో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవహరించిన తీరు విషయానికి వద్దాం. నిజానికి ఈ సమస్యకు శుభం కార్డు వేయడంలో కేసీఆర్ అనుసరించిన విధానం అత్యంత అభ్యంతరకరంగా ఉంది. అయితే ఈ విషయంలో కూడా చాణక్య నీతినే కేసీఆర్ అనుసరించడం వల్ల ఆయనను బాహాటంగా ఎవరూ తప్పుబట్టలేని పరిస్థితి ఏర్పడింది. చివరకు హైకోర్టు కూడా.. లంకాదహనం తర్వాత విభీషణుడికి పట్టాభిషేకం జరిగినట్టుగా ఉంది అని వ్యాఖ్యానించింది. అంటే జరగాల్సిన అనర్థం జరిగిన తర్వాత సమస్య పరిష్కారం అయ్యిందని హైకోర్టు అభిప్రాయపడిందని భావించాలి. కార్మికుల డిమాండ్లను సానుభూతితో పరిష్కరించాలనీ, తక్షణ ఉపశమనం కింద 40 కోట్లు విడుదల చేయాలనీ హైకోర్టు సూచించినా ప్రభుత్వం ఖాతరు చేయలేదు. హైకోర్టు సూచించినట్టుగా 40 కోట్లు కూడా ఇచ్చే పరిస్థితిలో ప్రభుత్వం లేదని ఏకంగా అఫిడవిట్ సైతం దాఖలు చేశారు. హైకోర్టులో వ్యాజ్యం ముగిసి కార్మిక సంఘాలు సమ్మె విరమించిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రం నలుమూలల నుంచి ఎంపిక చేసిన ఆర్టీసీ ఉద్యోగులను పిలిపించుకుని, వారికి భోజనం పెట్టి మరీ అడిగినవే కాకుండా.. అడగని వరాలు కూడా ప్రకటించారు. కార్మికులకు సెప్టెంబరునెల జీతాలు చెల్లించడానికి కూడా డబ్బులేదని చెప్పిన ప్రభుత్వమే ఒకే ఒక్క రోజులో జీతాలు చెల్లించింది. తన మాట లెక్క చేయకుండా సమ్మెకు వెళ్లిన కార్మికులు సెల్ఫ్ డిస్మిస్ అయ్యారనీ, ఆర్టీసీని మూసివేస్తామనీ, కార్మికులను తిరిగి విధుల్లోకి చేర్చుకునే పరిస్థితి లేదనీ ముఖ్యమంత్రిగా కేసీఆర్ చేసిన ప్రకటనలతో దిగులు చెందిన కొంత మంది కార్మికులు ఆత్మబలిదానాలు చేసుకున్నారు. అంటే వారి చావులకు కేసీఆర్ ప్రకటనలే కారణమని చెప్పకుండా ఉండగలమా? అలాంటప్పుడు కేసీఆర్ శిక్షార్హుడే కదా? తప్పుడు అఫిడవిట్లతో హైకోర్టును తప్పుదారి పట్టించడం కూడా నేరమే అవుతుంది కదా! ఈ మొత్తం వ్యవహారంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఏ మాత్రం బాధ్యతగా వ్యవహరించలేదు. అయినా ఆయనను ఎవరూ తప్పుబట్టలేని పరిస్థితి ఏర్పడటానికి సమస్యకు ఆయన ఇచ్చిన ఫినిషింగ్ టచ్ కారణం! 'విధుల్లో చేర్చుకోండి మహాప్రభో..' అని కార్మికులు వేడుకునే పరిస్థితి వచ్చేవరకు వేచి ఉండి, అప్పుడు కేసీఆర్ తన చాణక్యనీతిని ప్రదర్శించారు. కార్మికులకు భోజనం పెట్టి వందల కోట్ల వరాలు కురిపించి జేజేలు అందుకున్నారు. దీంతో కార్మికులే కాకుండా ప్రజలు కూడా 55 రోజులుగా చోటుచేసుకున్న పరిణామాలను మరిచిపోయి 'శభాష్ కేసీఆర్' అని ప్రశంసించారు. అప్పటివరకు కేసీఆర్‌ను దుర్మార్గుడని తిట్టిపోసినవారు సైతం మెచ్చుకున్నారు. యథావిధిగా ప్రతిపక్షాలు అచేతనంగా మిగిలిపోయాయి. కేసీఆర్ అడుగులు ఎటువైపు పడతాయో గమనించకుండా ఎగిరెగిరి చివరకు చతికిలబడటం తెలంగాణలో ప్రతిపక్షాలకు అలవాటుగా మారింది. రెండు లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ కార్మికుల సమ్మెను కేసీఆర్ ముదరనిచ్చారు. ఇందులో మొదటిది తనను ధిక్కరించిన యూనియన్ నాయకులకు మనుగడ లేకుండా చేయడం. రెండవది అసాధారణ రీతిలో బస్సు చార్జీలను పెంచినా ప్రజల నుంచీ, ప్రతిపక్షాల నుంచీ వ్యతిరేకత రాకుండా చేసుకోవడం. ఆర్టీసీ ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందని ప్రచారం చేయడం ద్వారా ప్రజలను నమ్మించడంలో కేసీఆర్ సక్సెస్ అయ్యారు. ఈ కారణంగానే చరిత్రలో ఎన్నడూ లేని విధంగా చార్జీలు పెంచినా.. కనీస ప్రతిఘటన కూడా ఎదురవ్వలేదు. ప్రతిపక్షాలకు కూడా చార్జీల పెంపును తప్పుబట్టలేని స్థితి కల్పించారు. సమ్మె ప్రారంభమైనప్పుడు గానీ, హైకోర్టు చర్చలు జరపాలని సూచించినప్పుడు గానీ యూనియన్ నాయకులను పిలిపించి ఇప్పుడు ప్రకటించిన వరాలనే ఇచ్చివుంటే క్రెడిట్ కార్మిక సంఘాలకు వెళ్లేది. ముఖ్యమంత్రిని ఇప్పటిలా గుర్తుంచుకునేవారు కాదు. అన్నింటికంటే ముఖ్యమైనది ఏమిటంటే.. అలా చేసి ఉంటే చార్జీలను ఇంత భారీగా పెంచుకునే వెసులుబాటు వచ్చేది కాదు. చివరకు చేతికి మట్టి అంటకుండా ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన వరాల భారాన్ని ప్రజల నెత్తినే వేశారు. ఇప్పటికైనా కేసీఆర్‌ను గ్రేట్ అనకుండా ఎవరైనా ఎలా ఉండగలరు? కేసీఆర్ ఎత్తుగడలను పసిగట్టలేని వారు మాత్రం బోల్తా పడుతూనే ఉంటారు. సమ్మెకు ఇచ్చిన ముగింపును ప్రతిపక్షాలు.. ముఖ్యంగా కార్మిక ఉద్యమాలలో ఆరితేరిన కమ్యూనిస్టులు కూడా స్వాగతించే పరిస్థితి కల్పించడం ద్వారా 'సరిలేరు నాకెవ్వరు..' అని కేసీఆర్ రుజువు చేసుకున్నారు. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నట్టుగా కేసీఆర్ మౌనం వెనుక ఏదో పరమార్థం దాగి ఉంటుంది. జాతీయ స్థాయిలో అపర చాణుక్యుడుగా గుర్తింపు పొందిన బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా కూడా ఒక సందర్భంలో కేసీఆర్ తెలివితేటలను మెచ్చుకోకుండా ఉండలేకపోయారు. కేసీఆర్ చర్యలన్నీ ప్రారంభంలో అరాచకంగా కనిపిస్తాయి. చివరకు ప్రత్యర్థులకు దిక్కుతోచని పరిస్థితి కల్పిస్తాయి. నిజానికి శుక్రవారంనాడు జరిగిన ఎన్‌కౌంటర్‌కు లభించిన మద్దతు వల్ల పాలకుల్లో నియంతృత్వ పోకడలు మరింత పెరిగే ప్రమాదముంది. కానీ భావోద్వేగాలు ఉన్నచోట విచక్షణ ఉండదు. కేసీఆర్ చర్యలన్నీ అంతిమంగా రాజకీయంగా సత్ఫలితాలను ఇవ్వడం వల్ల మంత్రులు సైతం నోరెత్తలేని పరిస్థితి! శుక్రవారంనాటి ఎన్‌కౌంటర్ పట్ల కొంతమంది మంత్రులకు మనసులో అభ్యంతరాలు ఉన్నప్పటికీ బయట నెలకొన్న వాతావరణాన్ని బట్టి మౌనాన్ని ఆశ్రయించక తప్పలేదు. "మా వెలమలలో సాధారణంగా ఎవరికీ ఈ రకం తెలివితేటలు ఉండటాన్ని నేను చూడలేదు. కేసీఆర్‌ను చూస్తే ఆశ్చర్యంగా ఉంటుంది" అని ఒక వెలమ ప్రముఖుడు ముచ్చట పడ్డారు. ఎవరికి అంగీకారం అయినా కాకపోయినా ఆర్టీసీ కార్మికుల సమ్మె విషయంలోనే కాకుండా దిశ నిందితులను ఎన్‌కౌంటర్ చేయించడం ముఖ్యమంత్రిగా కేసీఆర్‌కు కీర్తిప్రతిష్ఠలే తెచ్చిపెట్టింది. దురదృష్టం ఏమిటంటే.. ఇటువంటి సందర్భాలలో చట్టాలు కూడా తెల్లమొహం వేయక తప్పడంలేదు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కూడా ప్రజల భావోద్వేగాలకు అనుగుణంగానే నిర్ణయాలు తీసుకుంటున్నారు. దీంతో జాతీయ స్థాయిలో ప్రతిపక్షాలు వారిరువురి ముందు నిలబడలేకపోతున్నాయి. వేలాది పుస్తకాలను పఠించిన తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్.. చాణక్యుడి రాజనీతి శాస్త్రాన్ని ఔపోసన పట్టకుండా ఎందుకుంటారు? తెలంగాణ సమాజం గురించి పూర్తి అవగాహన ఉన్న కేసీఆర్‌కు చాణక్య నీతిని ఎప్పుడు ప్రదర్శించాలో కూడా బాగా తెలుసు! ఈ కారణంగానే ఎప్పటికప్పుడు తన ప్రత్యర్థులను దిక్కుతోచని స్థితిలోకి నెడుతున్నారు. మీడియా కూడా ప్రజలలో నెలకొన్న భావోద్వేగాలకు విరుద్ధంగా వ్యవహరించలేని పరిస్థితి ప్రస్తుతం నెలకొన్నది. ఈ నేపథ్యంలోనే శుక్రవారంనాటి ఎన్‌కౌంటర్‌ను ఎవరికివారు శక్తి వంచన లేకుండా శ్లాఘించారు. ఈ పరిణామాలు సమాజానికి మంచివా? కాదా? అన్నది కాలమే నిర్ణయించాలి! ■

> నిందితులను ఎన్‌కౌంటర్ చేయడం వల్ల దేశంలో అత్యాచారాలు జరగవా? అంటే చెప్పలేని పరిస్థితి! నిర్భయ సంఘటన తర్వాత మళ్లీ దిశ ఉదంతం జరిగే వరకు దేశంలో ఎంతో మంది బాలికలు, యువతులు, మహిళలు అత్యాచారాలు, హత్యలకు గురయ్యారు. అయితే కొందరి విషయంలోనే సమాజం నుంచి స్పందన వస్తుండటానికి కారణం ఏమిటంటే.. అదొక సమాధానం దొరకని ప్రశ్న! ఆసిఫాబాద్ జిల్లాలో ఒక దళిత యువతిని అత్యాచారం చేసి హత్య చేశారు. అయినా సమాజం నుంచి స్పందన రాలేదు. దీనిపై దళిత సంఘాలు మనసు కష్టపెట్టుకున్నాయి.

# తెల్లబజారులో వెంకన్న విక్రయం!

తిరుమల తిరుపతి దేవస్థానాల యాజమాన్యం.. డబ్బు దండిగా ఉన్న ప్రతి ఒక్కరినీ వీఐపీగా గుర్తించే సంస్కృతికి శ్రీకారం చుట్టింది. తిరుమలేశుని ఆలయాలను దేశవ్యాప్తంగా నిర్మించడానికి ఉద్దేశించిన, టీటీడీ వారి శ్రీవాణి పథకానికి పదివేల రూపాయల విరాళం ఇస్తే చాలు ఏ వ్యక్తికైనా 500 రూపాయలకు వీఐపీ టికెట్ విక్రయించి, ప్రోటోకాల్ దర్శనం ఏర్పాటుచేస్తారు. సంపన్నులకు తిరుమలేశుని అద్భుత దర్శనం ఎన్నడూ అందుబాటులో లేకుండా పోలేదు. ఒక ఎల్ 1 స్థాయి వీఐపీ దర్శనానికి 10–15 వేల రూపాయల చీకటిబజారు ధర నిన్నటి వరకు ఉండేది. తిరుమలలో మిక్కిలిగా దొరికే దళారీలకు ఆ మాత్రం సొమ్ము ముట్టజెబితే వారే కొండమీద గది ఏర్పాటు చేసి, టికెట్లు తెచ్చి చేతిలో పెడతారు. టీటీడీ తాజా నిర్ణయంతో ఈ బ్లాక్ మార్కెటింగ్... తెల్లబజారు విక్రయాలుగా మారింది. అలాగని దళారీల వ్యవస్థ ఆగిపోయే అవకాశం లేదు. పైగా వారిప్పుడు రూ.పదివేల కనీసధరను ఫిక్స్ చేసేసుకున్నారు. సిఫారసు ఉత్తరాల ద్వారా కేటాయించే వీఐపీ దర్శనాలను కుదించకుండా అక్రమాలు ఎలా ఆగుతాయి?

శ్రీవాణి పథకం తిరుమల వేంకటేశ్వరుని ఆలయాలను దేశవ్యాప్తంగా అనేక చోట్ల నిర్మించడానికి ఉద్దేశించిన పథకం. ఈ పథకానికి ఇచ్చేవాళ్లు ఇదివరకు కూడా ఇస్తూనే ఉన్నారు. కేటాయింపులూ ఉంటున్నాయి. పనులు జరుగుతున్నాయి. కానీ.. వీఐపీ టికెట్లు కొనడానికి ఇది అడ్డదోవగా మారడంతో, హఠాత్తుగా నిధుల వెల్లువ మొదలైంది. అక్టోబరు 21న పథకం ప్రారంభిస్తే... యాభై రోజుల్లో 3.21 కోట్ల రూపాయలు వచ్చాయి. కొత్తగా ఆన్‌లైన్ చెల్లింపు ఏర్పాటు వచ్చింది. యాప్ కూడా అందుబాటులోకి తెస్తున్నారు.

శుక్రవారం నాడు 200 టికెట్లు, తతిమ్మా ఆరు రోజుల్లో 500 టికెట్ల వంతున విక్రయానికి ఉంచుతారు. అంటే నెలకు 12,800 వంతున ఏడాదిలో 1,53,600 టికెట్లు అమ్మకానికి ఉంటాయి. టికెట్లు మిగిలిపోయే అవకాశం తక్కువ కనుక, అన్ని టికెట్లనూ పదివేల వంతున విక్రయిస్తే ఏడాదికి అథమ పక్షం 153 కోట్ల రూపాయలు విరాళాలుగా వస్తాయి. ఇవన్నీ కేవలం ఆలయ నిర్మాణాలకు మాత్రమే వాడాలన్నది పథకం ఉద్దేశ్యం. ప్రతిఊరిలో గుడికి స్థలాలు స్థానికంగా విరాళంగా వస్తాయి గనుక, నిర్మించేవి చిన్న ఆలయాలే గనుక.. వ్యయం సగటున 50 లక్షల రూపాయలు అనుకుంటే, ఏడాదిలో 300 ఆలయాలు నిర్మించవచ్చు. 'భక్తకోటి విరాళాలను వెల్లువెత్తిస్తున్నప్పుడు భగవంతుడిని భక్తులకు మరింత చేరువ చేయడంకంటె కావాల్సింది ఏముంటుంది?'.. ఇదంతా ఒక అద్భుతంగానే కనిపిస్తుంది.

దళారీల దురాగతాలకు మంగళం పాడడం అనే ముసుగులో ఇలా వ్యవస్థీకృతంగా పదివేలకు వీఐపీ టికెట్లు విక్రయించడాన్ని ఎవరూ పెద్దగా తప్పుపట్టలేరు. కానీ, శ్రీవాణి పథకానికి మాత్రమే ఎందుకు?, టీటీడీ ఆధ్వర్యంలోని అనేకానేక ఇతర పథకాలకు అంతే మొత్తం విరాళంగా ఇచ్చినా.. వీఐపీ దర్శనభాగ్యం కల్పించవచ్చు కదా?

టీటీడీ పథకాల్లో మిక్కుటం అయిపోయిన విరాళాలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న పథకాల్లో నిత్యాన్నదానం ముఖ్యమైనది. విరాళాల మీద వస్తున్న వడ్డీ డబ్బుతోనే రోజూ మూడు పూటలా నిత్యాన్నదానం నిర్వహిస్తున్నారు. భోజనశాలలోనే కాకుండా, శ్రీవారి ప్రసాదం పేరిట తిరుమల గిరుల్లోని అనేక ప్రాంతాల్లో భోజన సదుపాయం కల్పిస్తున్నారు. అలాగే విద్యా వైద్య సేవలు, ధర్మ ప్రచారానికి సంబంధించి అనేక పథకాలూ ఉన్నా, వీటికి విడివిడిగా దక్కే విరాళాలు చాలినంత ఉండవు. ఇప్పుడు శ్రీవాణి పథకానికి విరాళమిచ్చిన వారికి మాత్రమే వీఐపీ హోదా కట్టబెట్టడం వలన ప్రతి ఒక్కరూ దీనికోసమే ఎగబడతారు కనుక, తతిమ్మా పథకాలకు పైసా రాల్చే భక్తుడు ఉండడు. హుండీలో పదివేలు, ఆ పై మొత్తం వేయదలచుకున్న భక్తుడు (నల్లధనం వేసేవాళ్లు తప్ప) ఆ మొత్తం ఈ పథకానికే చెల్లించి వీఐపీ దర్శనాలు దక్కించుకుంటాడు కనుక హుండీ ఆదాయానికి కూడా భారీగా కోత పడవచ్చు. హుండీ ఆదాయం కూడా తగ్గిందంటే, మిగిలిన పథకాలన్నీ ఈసురోమని పోతాయి. విరాళాలు తగ్గి, హుండీ కానుకలు కూడా తగ్గడం వలన కేటాయింపులు కూడా తగ్గిపోతే ఇతర పథకాలన్నీ కుదేలవుతాయి. టీటీడీ ద్వారా విద్య, వైద్యం, ధర్మ ప్రచారం తదితర రంగాల్లో అనల్పమైన సేవ జరుగుతోంది. ధర్మపరిరక్షణ విషయంలో వేర్వేరు మార్గాలను అనుసరిస్తూ.. ఒక సమగ్ర రూపంలో ఉన్న టీటీడీ వ్యవస్థ.. కొంత కాలానికి అనేకానేక కుదుపులకు గురయ్యే ప్రమాదం ఉంది.

శ్రీవాణితో ఏడాదికి 500కు పైగా ఆలయాలు కట్టొచ్చు. ఏడాదిలోగా రాష్ట్రంలో ప్రతి మండలంలో ఒక వేంకటేశ్వరుని ఆలయం పూర్తిచేయవచ్చు. ఆ దామాషాలో కొన్నేళ్లకు దేశం మొత్తం శ్రీవారి గుడులు వచ్చేస్తాయి. అప్పటికీ విరాళాల వెల్లువ ఆగదు. నెమ్మదిగా మండల కేంద్రాలనుంచి పంచాయతీలకు, తర్వాతి దశలో పంచాయతీలనుంచి చిన్న పల్లెలు, దళితవాడలకు శ్రీవారి ఆలయాలను నిర్మించడం జరుగుతూ పోతుంది. కొన్నాళ్లకు ప్రతి నాలుగైదు కిలోమీటర్లకు వేంకటేశ్వరుని గుడులు వచ్చినా ఆశ్చర్యం లేదు. ఆధ్యాత్మిక చింతనతో చూసే వారికి ఇంతకంటె గొప్ప సంగతి ఏముంటుంది? ప్రతిచోటా గుడి ఉంటుంది! ప్రతి చోటా వేంకటేశ్వరుడే! కానీ.. ఇందులో అనూహ్యమైన పరిణామాలు కూడా పొంచిఉన్నాయి. ఎక్కడో తమిళనాడులో ఒక కుగ్రామంలో ఉండే ఓ నిరుపేద భక్తుడు ఏటా వేంకటేశ్వరుని దర్శించుకుంటాడనుకుందాం.. కొంతకాలం శ్రమించి, తీరిక చేసుకుని తిరుమల వచ్చి మహాలఘుదర్శనంలో లిప్తపాటు స్వామినిచూసి తృప్తిగా తిరిగి వెళ్తుంటాడు. అలాంటి వాడు ఇరవయ్యేళ్ల తర్వాత ప్రతి ఏడాదీ తిరుమల వరకు రాకపోవచ్చు. తమ పల్లెలోనే ఉన్న స్వామిని దర్శించుకుంటూ.. నాలుగైదేళ్లకు ఓసారి 'కుదిరితే' తిరుమల రావచ్చు.



> **శ్రీవాణి పథకానికి మాత్రమే ఎందుకు? అంతే మొత్తం ఇతర పథకాలకు విరాళంగా ఇచ్చినా వీఐపీ దర్శనభాగ్యం కల్పించవచ్చు కదా?**

ఇలా, ఓ ఇరవయ్యేళ్ల తర్వాతి పరిస్థితిని గనుక ఊహిస్తే, తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య తగ్గుతుంది, ఆదాయం ఇంకా తగ్గుతుంది. అప్పటికి శ్రీవాణికి తప్ప మరో పథకానికి విరాళంగా దక్కే రూపాయి ఉండదు. ఇప్పటికే కోటీశ్వరులు వేంకటేశ్వరుడిని ఎక్కడికక్కడ మార్కెట్ చేసుకుంటూ, దేశంలో అనేకానేక ఆలయాలు తమవంతుగా కట్టేసుకుంటూ ఉన్నారు. మరి టీటీడీ లడ్డూప్రసాదాలను దేశంలో ప్రతి సమాచారకేంద్రంలోనూ విక్రయించినట్లుగా దేవుడిని కూడా స్వయంగా ప్రతి ఊరికీ పంచిపెట్టేస్తే ఇక తిరుమలకు ఎందుకు రావాలి? తిరుమల కూడా మక్కా, జెరూసలెం లాగా జీవితకాలంలో ఒకసారి వెళితే చాలు అని హిందూ భక్తులు అనుకునే కేటగిరీలోకి వచ్చేసే ప్రమాదం ఉన్నది. ప్రపంచంలోనే ప్రతిరోజూ 70వేలనుంచి లక్ష మంది భక్తులు దర్శించుకునే అసమానమైన పుణ్యక్షేత్రంగా,ఏడాదికి మూడు వేల కోట్ల రూపాయల పైబడిన ఆదాయం ఉన్న దైవధామంగా, వాటికన్ సిటీని ఎప్పుడో అధిగమించింది తిరుమల. ఆదాయం, భక్తుల రాకడ రెండూ అధోముఖమై మళ్లీ రెండో స్థానానికి పడిపోయే రోజులు రానివ్వకూడదు. 'శ్రీవాణి'కి మాత్రమే విరాళాలు అడగడంలో మరో దురాలోచనకు అవకాశం ఉంది. విచ్చలవిడిగా కాంట్రాక్టులు యిచ్చేసి నిర్మాణాలు ప్రారంభించవచ్చు. సాధారణంగా కొత్త నిర్మాణాలు జరుగుతూ ఉంటే మాత్రమే పాలకులు వాటాలు పంచుకుని నిధులు స్వాహా చేసే ప్రమాదం పెరుగుతుంది. కేవలం గుడుల నిర్మాణాలు తప్ప టీటీడీ తతిమ్మా ధార్మిక కార్యక్రమాలను మందగింపజేస్తే ప్రజలకు ఇలాంటి అనుమానం కూడా కలుగుతుంది.

ఊరూవాడా ప్రతిచోటా వేంకటేశ్వరస్వామి ఆలయాలు మాత్రమే ఎందుకు నిర్మించాలి? ధర్మపరిరక్షణకు అనేకమార్గాలున్నాయి. దేశంలో నిత్య దీపారాధనకు గతిలేని దేవాలయాలు ఎన్నో ఉన్నాయి. టీటీడీ వాటిని దత్తత తీసుకుని.. కొత్త వెలుగు ఇవ్వవచ్చు. శైవాలయాలకు తమ పూచీలేదని భావిస్తే గనుక.. దేశవ్యాప్తంగా దీనస్థితిలో ఉండే వైష్ణవాలయాలనైనా బాగు చేయవచ్చు. తద్వారా హిందూ ధర్మాన్ని, ఆధ్యాత్మిక వైభవాన్ని పరిరక్షించవచ్చు, తిరుమల ప్రాభవం సన్నగిల్లకుండా కాపాడవచ్చు. తిరుమల ప్రశస్తి గురించి ఆయా ఆలయాల ద్వారా మరింత ప్రచారం చేసుకోవడమూ కుదురుతుంది. ఆలయాలు నిర్మించే శ్రీవాణి ట్రస్టుకు విరాళాలు ఇస్తేనే వీఐపీ దర్శనం అనడం పెద్ద కుట్ర. ఆ కుట్రకోణాలను ప్రజలు మొత్తం అర్థం చేసుకోకముందే... టీటీడీ వారి ఏ పథకానికైనా పదివేల విరాళం ఇస్తే చాలు, ఆ భక్తుడికి వీఐపీ దర్శన భాగ్యం కల్పించాలి. గుడుల నిర్మాణాల మీద మోజుతో తతిమ్మా పథకాల ద్వారా జరిగే సామాజిక సేవలు, ధర్మ పరిరక్షణకు గండికొట్టడం విజ్ఞత అనిపించుకోదు.

■ కె.ఎ. మునిసురేష్ పిళ్లె
సీనియర్ పాత్రికేయుడు



## ఉదయాలిక మొలవ్వు

ఇంత పనికిమాలిన
తెల్లారు జామును
ఎప్పుడూ చూడలేదు

భళ్ళున భూమ్మీద పడి
దిక్కులు మార్మోగేలా
ఒళ్ళు విరుచుకోవలసిన
వెలుతురు శిశువు
మృత ప్రసవానికి సాక్షిని
కావలసి వస్తుందనుకోలేదు

సూర్యబింబానికి అడ్డంగా
వేకువ రెక్కల స్వర సమాధులు

కొక్కొరోకోల గొంతు
నులిమేశారు
దూడల అంబారావాల
జాడలేదు

పేపర్‌బాయ్ ముఖానికి
తారు పూశారు
అక్షర కంఠాలు
బలికేకలేస్తున్నాయి

వ్రేళ్ళు పుచ్చిపోయిన
శాసన వృక్షం
విష ఫలాలిస్తోంది

దేశం గోడలనిండా
నరికిన చూపుడువేలు
నెత్తురు అలికారు

ఆధునిక పవిత్రగ్రంథం
పేజీలు చించి పోగులు పెట్టి
తగులబెట్టారు

తలకు కొమ్ములు
మొలుచుకొచ్చాయి

ఆకాశం భూతవైద్యుడయింది
భూమ్మీది ఔషధ మొక్కలు
అదృశ్యమయ్యాయి
ఉదయాలిక మొలవ్వు

■ నిజం

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
ఆదివారం • 8 డిసెంబర్ 2019
navya@andhrajyothy.com

దిశ హత్యాచార ఘటన... దేశవ్యాప్త సంచలనం.
నిందితుల పోలీస్ ఎన్‌కౌంటర్... విదేశీ పత్రికల్లోనూ వార్త.

మొదటిది అమానుషమైతే...
ఎంత సత్వర, సహజ న్యాయమైనా రెండోది చట్టవ్యతిరేకం...
రెండు ఘటనల్లోనూ గెలిచింది అమానవీయతే అన్నది మానవ హక్కుల కోణం.



హత్యాచారానికి కౌంటర్ ఎన్‌కౌంటరేనా?
రెండు తప్పులు ఒక రైటవుతాయా?
ఆవేశం, ఆవేదన, ఆగ్రహాల ముందు
చట్టం... ధర్మం... న్యాయం... చిన్నబోతున్నాయా?
ఆత్మరక్షణ కోసం... ఆడవారే ఆయుధానికి లైసెన్సు కోరుతున్న వేళ...
ఏది ధర్మం... ఏది న్యాయం? ఏది పాపం... ఏది పుణ్యం? ఏది తప్పు... ఏది ఒప్పు?

# గెలిచింది ఎవరు?

## మానవత్వం అంటే...



**- నయనతార**

"ఎప్పుడైనా సరే... సత్వరమే న్యాయం చేస్తే బావుంటుంది - ఇన్నాళ్ళూ ఇదొక సినిమా నానుడి మాత్రమే! కానీ, 'దిశ' ఘటనలో పరిణామాలతో ఇది ఈ రోజు నిజమైంది. నిజమైన హీరోలైన తెలంగాణ పోలీసులు తమ చర్యలతో సత్వర న్యాయం అందిస్తే ఎలా ఉంటుందో చూపించారు. నా వరకూ నేను దీన్ని 'మానవత్వానికి సంబంధించి సరైన చర్య'గానే చూస్తాను. నిజమైన న్యాయం లభించిన రోజుగా ఈ దేశంలోని ప్రతి మహిళా గుర్తుంచుకోవలసిన తేదీ ఇది. మానవత్వం గురించి మాట్లాడాల్సి వస్తే... మహిళలకు సమాన గౌరవం ఇవ్వడం, ప్రేమను పంచడం, కరుణ కలిగి ఉండడమే నిజమైన మానవత్వం! జరిగిన న్యాయం పట్ల ఆనందోత్సాహాలతో ఊగిపోవడం కన్నా... పిల్లల్ని ఎడ్యుకేట్ చేసి చైతన్యవంతుల్ని చేయాల్సిన సమయం ఇది. ముఖ్యంగా మన ఇంట్లోని మగ పిల్లలకు... ఈ విశ్వాన్ని మహిళలకు సురక్షిత ప్రదేశంగా తీర్చిదిద్దినప్పుడే మగవాళ్లు అసలైన హీరోలు అనిపించుకుంటారని చెప్పాలి"

**దిశా ఘటనతో భద్రతా వ్యవస్థపై, పోలీసులపై, ప్రభుత్వంపై మహిళల్లో నమ్మకం కొరవడిందా? వరంగల్‌కు చెందిన నౌషీనా ఫాతిమా 'గన్ లైసెన్స్ కావాలి'అంటూ దరఖాస్తు చేసుకోవడం మహిళల్లో ఇటీవల పెరుగుతున్న భద్రతా పరమైన ఆందోళనలను ప్రతిఫలిస్తోంది. 'ఆపద సమయంలో ఎవరో వస్తారని, రక్షిస్తారని ఆశించకుండా స్వీయరక్షణకు మహిళలు పూనుకోవాల'ని ఫాతిమా ఎందుకు నిర్ణయించుకున్నారు? న్యాయవ్యవస్థపై, చట్టాలపై నమ్మకం కోల్పోవడం కారణమా? ఆమె మాటల్లోనే...**

## ఎవరో వస్తారని ఎదురుచూడొద్దు!

"నేను ఖమ్మంలోని గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నా. రోజూ వరంగల్ నుంచి ఖమ్మం అప్ అండ్ డౌన్ చేస్తుంటా. ఉదయం నాలుగు గంటలకు వరంగల్‌లో రైలు ఎక్కుతా. ఇంటికి తిరిగొచ్చేసరికి రాత్రి బాగా పొద్దుపోతుంది. నేనే కాదు నాలాంటి ఎంతోమంది మహిళలు నిత్యం ఇలా ప్రయాణిస్తుంటారు.

గతంలో రైలులో లేడీస్ కోచ్ ఉండేది. దాన్ని తొలగించి అన్‌రిజర్వ్‌డ్ కోచ్‌లు చేర్చారు. ప్రయాణ సమయంలో ఎంతో అభద్రతా భావానికి గురవుతుంటాం. మౌనిక, దిశ, ఎమ్మార్వో విజయారెడ్డి సంఘటనలు జరిగిన తర్వాత నుంచీ మా ఇంట్లో వాళ్లకి నా గురించి భయం మొదలైంది. ఉద్యోగానికి వెళ్లే ప్రతి రోజూ ఎలా జాగ్రత్తగా ఉండాలో, అనుకోని పరిస్థితులు ఎదురైతే ఏ ఫోన్ నంబర్లకు ఫోన్ చేయాలో చెప్పడం మరింత ఎక్కువైంది. ఈ పరిస్థితులు నాలో భయాన్ని పెంచాయి.

ఈ నేపథ్యంలో నన్ను నేను ప్రశ్నించుకున్నా. ఇది నా ఒక్కదాని సమస్యే కాదు ప్రతి మహిళా ఎదుర్కొంటున్న సమస్య కదా అనుకున్నా. ఎవరో వచ్చి మనల్ని కాపాడతారని ఎదురుచూడడం కన్నా ప్రమాద సమయంలో తక్షణమే ప్రతిస్పందించాల్సిన అవసరం ఉందని గుర్తించా. పోలీసులు, సమాచారాన్ని చేరవేసే ఫోన్ నంబర్లు, యాప్‌లు... వీటన్నింటి కన్నా మొదట నన్ను నేను రక్షించుకోవడానికి సన్నద్ధంగా ఉండాలి అనుకున్నా. నా భద్రత కోసం అన్న, భర్త, స్నేహితులు, పోలీసులు, ఫోన్ నంబర్ల మీద ఆధారపడ్డం కన్నా ప్రమాదాన్ని ఎదుర్కోగల సర్వసన్నద్ధత ప్రతి మహిళకూ అవసరం అనుకున్నా. అలా అని పోలీసులు పనిచేయడం లేదనను. మన వైపు నుంచి మన రక్షణ కోసం మనల్ని మనం సిద్ధం చేసుకోవాలనిపించింది. అందుకే గన్ లైసెన్స్ తీసుకోవాలని అనుకున్నా.

ఈ ఆలోచన నాకు 'దిశ' సంఘటన జరిగిన రోజు వచ్చింది. తోటి మహిళలు 'దిశ' ప్రమాదం నుంచి ఎలా రక్షించుకుని ఉంటే బాగుండేదో అన్న దానిపై రకరకాలుగా చర్చించుకుంటున్నప్పుడు నాకు గన్ లైసెన్స్ తీసుకోవాలనే ఆలోచన వచ్చింది. ఆ క్షణమే ప్రతి మహిళా స్వీయరక్షణకు సిద్ధంగా ఉండాలనిపించింది. అందుకే వరంగల్ కమిషనర్‌కు 'గన్ లైసెన్స్ కావాలి'అంటూ మెయిల్ పెట్టా. గన్ ఉపయోగించడం ద్వారా ప్రమాదం ఎదురైనపుడు వెంటనే మనల్ని మనం రక్షించుకునే అవకాశం ఉంటుందని భావించా. అయితే గన్ లైసెన్స్‌కు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి దరఖాస్తు చేసుకోవాలనే విషయం అప్పుడు నాకు తెలియదు. తెలిసిన తర్వాత గన్ లైసెన్స్ కోసం వరంగల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి స్వయంగా దరఖాస్తు ఇచ్చి వచ్చాను.

అందరూ మనకు జాగ్రత్తలూ చెపుతారు. కానీ ప్రమాద సమయంలో ఫోన్ చేసే అవకాశం, పోలీసులకు వెంటనే తెలియజేసే మార్గం దాడికి గురయిన మహిళకు ఎంతవరకూ ఉంటుందో చెప్పడం కష్టం. వెంటనే ఆమె స్పందించడం కూడా కష్టం కావొచ్చు. ఆ సమయంలో మనల్ని మనం రక్షించుకోవాల్సిన పరిస్థితులే ఎక్కువగా ఉంటాయి. అప్పుడు రక్షణ పరంగా మొదట ప్రతిఘటించాల్సింది దాడికి గురైన మహిళే. ఎందుకంటే ఆ సమయంలో సెకన్లలో ప్రాణాల మీదకు అపాయం వచ్చిపడే పరిస్థితులే అధికంగా ఉంటాయి. అందుకే స్వీయరక్షణ మీదే మహిళలు ఎక్కువగా ఆధారపడాలన్నది నా గాఢాభిప్రాయం. పైగా మన చేతుల్లో ఆయుధం ఉంటే దాడి చేసిన వారికి కూడా భయం ఉంటుంది. 'ఎందుకు సాధారణ మహిళలపైనే ఎక్కువగా దాడులు జరుగుతున్నాయి? ఒక పోలీసు మహిళపై దాడి ఎందుకు జరగడం లేదు' అని ఆలోచిస్తే కారణం సింపుల్. మహిళా పోలీసు చేతిలో రక్షణ ఆయుధాలు ఉండడమే. అందుకే ప్రమాద సమయాల్లో తక్షణం స్పందించాల్సింది దాడికి గురైన మహిళలే. మహిళలు తమ రక్షణపరంగా అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి. సమాజం కానీ, కుటుంబం కానీ, స్నేహితులు కానీ ఎవ్వరూ ఆమె రక్షణకు వెంటనే రాలేని పరిస్థితులు ఉంటాయి. అందుకే మహిళలు తమ భద్రతకు తాము ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి.

నిందితులు నేరానికి పాల్పడడానికి కారణాలు తాగుడు కావొచ్చు మరేదైనా కావొచ్చు. కానీ.. అవి సమస్యకు పరిష్కారం కావు. వాటిపై స్పందించాల్సింది ప్రభుత్వం. ఇవన్నీ ఆలోచించిన నాకు ఇలాంటి ప్రమాద సమయాల్లో నా దగ్గర ఆయుధం ఉంటే భద్రత ఉంటుందనిపించింది. నేను మహిళలకు ఒక్కటే చెప్పాలనుకుంటున్నా. మహిళలు అన్నింటా తమ ప్రతిభా సామర్థ్యాలు నిరూపించుకుంటున్నారు. కానీ మరోవైపు ఆరేళ్ల బాలిక నుంచి ఉన్నత విద్య చదువుకున్న 26 ఏళ్ల దిశ, ఎమ్మార్వో విజయారెడ్డి, మౌనిక తమ రక్షణ విషయంలో అసహాయిలుగానే మిగిలిపోయారు. తమను తాము కాపాడుకోలేకపోయారు.

ఎవరో వచ్చి రక్షిస్తారని ఏ మహిళా ఎదురుచూసే పరిస్థితి ఉండొద్దు. 'దిశ' హత్యాచార నేరస్థులను ఎన్‌కౌంటర్ చేయడం ఈ పరిస్థితుల్లో యాక్సెప్టబుల్ అనాల్సి వస్తుంది. ఇక్కడ నేను చెప్పేది ఒకటే అంతా అయిపోయిన తర్వాత చర్యలు తీసుకోవడం కాకుండా ముందే తగిన జాగ్రత్తలు తీసుకుంటే మంచిది. ఆడవాళ్లు తమ రక్షణ గురించి తాము ఆలోచించడం వల్ల తమపై దాడి చేసేవారిని ఆపగలగడమే కాదు నిందితులను చట్టానికి పట్టించినవాళ్లవుతారు కూడా.

నేను గన్ లైసెన్స్ తీసుకోవాలనుకుంటున్నానని మహిళలంతా తీసుకోవాలని సలహా ఇవ్వను. కానీ ఒక్కటి మాత్రం చెప్పగలను. మన రక్షణకు మనమే పూనుకోవాలి. ఎందుకంటే 'దిశ' తనకు ప్రమాదం ఎదురయ్యే అవకాశం ఉందని గ్రహించింది. ఈ విషయం ఫోనులో తన చెల్లెలితో మాట్లాడిన మాటల్లో స్పష్టంగా తెలుస్తుంది. కానీ దాన్ని ఆపగలిగే స్వీయరక్షణ గురించి మొదటి నుంచీ అప్రమత్తంగా ఉంటే పరిస్థితి వేరేలా ఉండేది. ఎమ్మార్వో విజయారెడ్డి విషయంలోనైనా, మౌనిక విషయంలోనైనా స్వీయరక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. అందుకే మొదట మనల్ని మనం రక్షించుకోవడానికి చొరవ చూపకపోతే, సన్నద్ధులం కాకపోతే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు మరిన్ని జరగొచ్చు కూడా. వాటిని అడ్డుకోవాల్సిన అవసరం ఉంది"



## ఇది న్యాయవ్యవస్థను కించపరచడమే!

**- రామ్‌గోపాల్ వర్మ**



"ఓ మహిళపై ఆ నలుగురు నిందితులు చేసిన దారుణాన్ని పరిగణనలోకి తీసుకుని పోలీసులు వారిని ఎన్‌కౌంటర్ చేయడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేయడంలో న్యాయం ఉంది. కానీ పోలీసులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని నిందితులను చంపడం సబబు కాదు. ఇది న్యాయవ్యవస్థను కించపరచడమే అవుతుంది. ఇలాంటి ఘటనలు అనాగరిక వ్యవస్థకు దారితీస్తాయి. నేరాలకు సంబంధించిన అన్ని వివరాలనూ రెండు కోణాల్లో చూడాలి. ఒకటి విఫలమైన వ్యవస్థ! రెండోది అందుకు బాధ్యులెవరు? ఈ రెండు విషయాలూ తెలుసుకుంటేనే భవిష్యత్తులో ఇలాంటి నేరాలను అరికట్టగలం. నిందితులు మరో నేరం చేసే లోపే వారిని అదుపు చేయాలని పోలీసులు ఎన్‌కౌంటర్ చేసేశారు. నిందితులు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు కస్టడీలో ఉన్నప్పుడు ఇలా చేస్తే జరిగిన నేరం గురించి న్యాయవ్యవస్థకు ఏం తెలుస్తుంది? నిందితులకు నియమాల ప్రకారమే శిక్ష విధించాలి కానీ పోలీసులు, మీడియా వర్గాలు, ప్రజలు చెప్పారని వారిని శిక్షవేస్తే సమాజం కుప్పకూలిపోతుంది."

## చట్టాన్ని రేప్ చేశారు!

**- చంద్రసిద్ధార్థ**



'ఎవరికైనా చావు అనేది శిక్ష కాదు.. విముక్తి. దిశ ఘటనలో నిందితులు చేసిన నేరానికి మరణశిక్ష కూడా సరిపోదు. చేసిన తప్పుకు కఠినశిక్ష విధించాలి. 'ఈ నరకం భరించలేం.. మమ్మల్ని చంపెయ్యండి' అని ప్రాధేయపడేలా చేయాలి. అప్పుడు కూడా చంపకూడదు. చనిపోయిన తర్వాత ఏం జరుగుతుందనేది ఎవరికీ తెలీదు. కానీ బతికుండగానే వారికి నరకం చూపించాలి. నిందితుల్ని కోర్టుకు తీసుకెళ్లడం, సంవత్సరాల తరబడి విచారణ జరగడం... ఇదంతా అనవసరపు ఖర్చే!. కాదనను!! కానీ ఎన్నో ఇతర అనవసరపు ఖర్చులతో పోలిస్తే ఈ ఖర్చు తక్కువే. ఈ నిందితులకు బెయిల్ దొరికి కొన్ని రోజుల తర్వాత జైలు నుంచి బయటకు రావచ్చు కూడా! అయితే న్యాయపరంగా చర్యలు తీసుకోకుండా పోలీసులు ఇలా దొంగదారి వెదుక్కొని నిందితుల్ని చంపడం నాకు నచ్చలేదు. సమస్య ఎక్కడుందో దాన్ని పరిష్కరించడానికి ప్రయత్నించాలి. బాధ్యతాయుతమైన పొజిషన్‌లో ఉన్న పోలీస్ కమిషనర్ ప్రెస్‌మీట్‌లో కూర్చుని అలా అబద్ధాలు చెబుతుంటే చూసే వాళ్లకు ఎలా అనిపిస్తుంది? ఇది పోలీసులు చేసిన హత్య అని అందరికీ తెలుసు. ఎన్‌కౌంటర్ స్పెషలిస్టులు అక్కడ కనిపిస్తూనే ఉన్నారు. నిందితులు పోలీసుల దగ్గర నుంచి గన్నులు లాక్కోవడం ఏమిటి? వీళ్లు వాళ్లను షూట్ చేయడం ఏమిటీ .. పోలీసులు ఇలా చెప్పేవన్నీ కట్టుకథలని అందరికీ తెలుసు. కానీ ఎవరూ మాట్లాడడం లేదు. అంటే అబద్ధాలు కూడా నిజాలుగా నమ్మాల్సిన రోజులు వచ్చేశాయన్న మాట! చట్టాలు మార్చేసి, చంపేసే అధికారం పోలీసులకు ఉందని డైరెక్ట్‌గానే చెప్పవచ్చు కదా!

వంద అబద్ధాలు ఆడి ఓ పెళ్లి చెయ్యమన్నారు. అలాగే న్యాయం జరగాలంటే అబద్ధాలు ఆడక తప్పదు అంటే ఎలా?. నిందితులు పేదవాళ్లు కనుక వాళ్లను తీసుకెళ్లి ఎన్‌కౌంటర్ చేశారు. మిగతా అన్ని కేసుల్లో అలా చేయగలరా? ఏళ్ల క్రితం మరణించిన ప్రత్యూష కేసు విషయంలో దోషులకు ఇంకా శిక్ష పడలేదు. ఆయేషా కేసు ఏమైంది? ఇప్పుడు ఈ నిందితుల్ని కాల్చేశారు. కోపంతో ఊగిపోతున్న ప్రజానీకాన్ని చల్లబరిచి, వాళ్ల దృష్టిలో మంచి పేరు తెచ్చుకోవడం కోసం ప్రభుత్వం ఇలా ఎన్‌కౌంటర్‌ను ఎంకరేజ్ చేసి ఉండవచ్చు.' దిశ' విషయంలో పోలీసులు సకాలంలో స్పందించకపోవడం వల్లే ఇంత ఘోరం జరిగింది. అందుకే ఆ తప్పు కప్పిపుచ్చుకోవడానికి పోలీసులు ఇలా చేసి ఉండవచ్చు కూడా! నేను కాదు... జనం అనుకుంటున్న మాటలివి.' దిశ' సంఘటన జరిగిన మర్నాడే అలాంటి సంఘటన మరొకటి జరిగింది. అంతకుముందు ఇంకొకటి జరిగింది. కానీ వాటి గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు.' దిశ' పై హత్యాచారం జరగడానికి వేరే కారణం కూడా ఉందని అంటున్నారు. పశుసంవర్ధక శాఖలో జరిగిన ఓ స్కామ్ 'దిశ' దృష్టికి రావడంతో అది ఆమె బయటపెడుతుందనే భయంతో కొంతమంది ఇలా ఈ నలుగురితో హత్యాచారం చేయించి, ఆ విషయం బయటకు రాకుండా వాళ్లని ఎన్‌కౌంటర్ చేయించినట్లు కొందరు చెబుతున్నారు. విచారణలో ఈ విషయం నిజమేనని తర్వాత తేలితే.. అప్పుడు పరిస్థితి ఎలా ఉంటుంది? నిజాలు నింపాదిగా బయటకు వస్తుంటాయి కదా! 'వాళ్లని చంపెయ్యండి సార్' అని జనం ఎమోషన్‌తో అని ఉండవచ్చు. కానీ అలా చేయడం వల్ల సామాన్యులకు, బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వారికీ తేడా ఏమిటి? ఇప్పుడు హింసను ఇష్టపడడం జనానికి అలవాటైంది. 'సిస్టమ్ మారాలి.. మహిళను గౌరవించాలి' వంటి నీతి వాక్యాలు వాళ్లకు ఎక్కవు. 'చంపండి.. కాల్చేయండి' వంటి మాటలు వినసొంపుగా ఉంటాయి. అటువంటి వాళ్లను ఎంటర్‌టైన్ చెయ్యడానికి కాదు కదా పోలీస్ యంత్రాంగం ఉంది. భవిష్యత్ పరిణామాల గురించి ఆలోచించాలి. తమకు గిట్టని వ్యక్తులను ఇలా కేసుల్లో ఇరికించి, ఎన్‌కౌంటర్ చేసే పద్ధతి వస్తే ఎంత ప్రమాదకరం! అధికారంలో ఉన్న వ్యక్తి తనకు అడ్డు వచ్చిన ప్రతి వాడినీ ఇలా లేపేస్తే ఏమవుతుంది? ఈ సంఘటన గుణపాఠం కావాలని కొందరు అంటున్నారు. ఎవరికి గుణపాఠం? 'అయ్యో నేను ఇప్పుడు రేప్ చేస్తే జనం నన్ను చంపేస్తారు' అని రేప్ చేసే ముందు ఎవరూ ఆలోచించరు. ఆ వ్యక్తి అప్పటి మానసిక పరిస్థితిని బట్టి ప్రవర్తిస్తుంటాడు. ఇదేమీ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు కాదు కదా ఫైన్లు వేస్తే మార్పు వచ్చేయ్యడానికి! రేప్ చేయడమన్నది మానసిక రోగం. వాడు ఎప్పుడు రేప్ చేస్తాడో వాడికే తెలియదు. ఇలాంటి కేసుల విషయంలో కోర్టులు ఎక్కువ కాలయాపన చేయకుండా త్వరితగతిన చర్యలు తీసుకొని దోషులకు శిక్ష పడేలా చూడాలి. ఏది ఏమైనా దిశను రేప్ చేసిన నిందితుల్ని ఎన్‌కౌంటర్ చేసిన పోలీసులు చట్టాన్ని రేప్ చేసినట్లయింది!
















# 'దొంగ' కోసం


కార్తీ

'ఖైదీ' విజయం తర్వాత కార్తీ హీరోగా నటించిన చిత్రం 'దొంగ'. ఆయనకు అక్క పాత్రలో నిజ జీవితంలో వదిన అయిన జ్యోతిక, కీలక పాత్రలో సత్యరాజ్ నటించారు. జీతూ జోసెఫ్ దర్శకత్వం వహించారు. ఈ నెల 20న విడుదలవుతున్న ఈ సినిమా తెలుగు థియేట్రికల్ రైట్స్‌ను హర్షిత మూవీస్ అధినేత రావూరి వి. శ్రీనివాస్ సొంతం చేసుకున్నారు. "ప్రచార చిత్రాలు, పాటలను మంచి స్పందన లభిస్తోంది. ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేసే అవకాశం ఇచ్చిన వయాకామ్18 స్టూడియోస్, ప్యారలల్ మైండ్స్ సంస్థలకు... హీరో కార్తీకి ధన్యవాదాలు" అని రావూరి వి. శ్రీనివాస్ అన్నారు. ఈ చిత్రానికి గోవింద్ వసంత సంగీత దర్శకుడు.


విజయశాంతి, మహేశ్‌బాబు

# సూర్యుడివో...చంద్రుడివో..

**మహేశ్‌బాబును 'సూర్యుడివో... చంద్రుడివో...' అంటున్నారు గేయ రచయిత రామజోగయ్య శాస్త్రి. అనిల్ రావిపూడి దర్శకత్వంలో మహేశ్ హీరోగా నటిస్తున్న 'సరిలేరు నీకెవ్వరు' కోసం ఆయన రాసిన మెలోడీ గీతమిది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతమందించారు. సోమవారం సాయంత్రం విడుదల కానుంది.**

# ఇస్మార్ట్ నిశ్శబ్దం!


అనుష్క, చార్మి

ముంబై మహానగరంలో అనుకోకుండా అనుష్క, ఛార్మి కలిశారు. ఓ రెస్టారెంట్‌లో కలిసి భోజనం చేశారు. అక్కడ దిగిన ఫొటోను ఛార్మి ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. "ముంబైలో స్వీటీ స్వీటీ అనుష్క. లంచింగ్ అండ్ మంచింగ్. ఇస్మార్ట్ నిశ్శబ్దం" అని ఛార్మి పేర్కొన్నారు.

# గ్రీన్ సిగ్నల్!

వివాదస్పద చిత్రం 'అమ్మరాజ్యంలో కడప బిడ్డలు' విడుదలకు మార్గం ఏర్పడింది. హైకోర్టు ఆదేశంపై రీజినల్ సెన్సార్ బోర్డ్ ఈ సినిమాను చూసి, ఇందులో అభ్యంతరకర సన్నివేశాలు ఉన్నాయంటూ సర్టిఫికెట్ ఇవ్వడానికి నిరాకరించింది. దాంతో రివైజింగ్ కమిటీకి వెళ్లారు చిత్ర నిర్మాతలు. శనివారం ఈ చిత్రాన్ని చూసిన రివైజింగ్ కమిటీ మైనర్ కట్స్‌తో సర్టిఫికెట్ ఇచ్చింది. సెన్సార్ నుంచి గ్రీన్‌సిగ్నల్ రావడంతో ఈ నెల 12న విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు ప్రారంభించారు. 'మా సినిమాకు యు, ఏ సర్టిఫికెట్ లభించింది. ఈ విషయంలో సహకరించిన రివైజింగ్ కమిటీ సభ్యులకు ధన్యవాదాలు' అని చిత్రబృందం పేర్కొంది. ఏ వర్గాన్నీ టార్గెట్ చేసి సినిమా నిర్మించలేదనీ, ఫ్యాక్షనిజం, రౌడీయిజం, రాజకీయ నేపథ్యంలో సాగే కమర్షియల్ ఎంటర్‌టైనర్ ఇదని నిర్మాతలు చెప్పారు. టి. అంజయ్య సమర్పణలో రూపుదిద్దుకొన్న ఈ చిత్రానికి సహ నిర్మాతలు: నట్టి క్రాంతి, నట్టి కరుణ, నిర్మాతలు: అజయ్ మైసూర్, టి.నరేశ్‌కుమార్, టి.శ్రీధర్.


రామ్‌గోపాల్ వర్మ

# హీరో కామెడీ చేస్తే నచ్చుతుంది

– కార్తికేయ



**"నా సినిమాల విషయంలో అందరి అభిప్రాయాలు తీసుకుంటా. విమర్శల్ని గౌరవిస్తా. '90.ఎం.ఎల్'కు మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ నటన పరంగా నాకు మంచి మార్కులు పడ్డాయి" అని కార్తికేయ అన్నారు. ఆయన హీరోగా శేఖర్ రెడ్డి ఎర్రా దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఇటీవల విడుదలైంది. ఈ సందర్భంగా శనివారం కార్తికేయ విలేకర్లతో మాట్లాడారు.**

చిన్న లోపంతో హీరో చిన్నప్పటి నుంచి ఆల్కహాల్ తీసుకోవడం అన్న పాయింట్ ఆసక్తికి గురి చేసింది. నిజంగా ఇలాంటి వారు కూడా ఉంటారా అనుకున్నా. కథ విన్నప్పుడు నేనెలా సర్‌ప్రైజ్ అయ్యానో.. ప్రేక్షకులు అలాగే ఫీలవుతారని చేసిన ప్రయత్నమిది. ప్రేక్షకులు వినోదాన్ని ఆస్వాదిస్తున్నారు. స్క్రీన్‌ప్లే పరంగా కొన్ని లోపాలున్నట్లు తెలిసింది. తర్వాతి చిత్రంలో ఆ పొరపాటు జరగకుండా జాగ్రత్త పడతాను.

**నమ్మకం కలిగించడమే లక్ష్యం..**

మాస్ హీరో అనిపించుకోవాలని నేనీ సినిమా చేయలేదు. నటుడిగా అన్ని రకాల సినిమాలూ చేయాలనుకుంటున్నా. చిన్నప్పుడు చిరంజీవిగారిని మాస్ సినిమాల్లో చూసి ఎంతో ఆనందించే వాడిని. ఆయనలా నన్ను నేను ఎలాంటి పాత్రల్లో చూసుకోవాలి అనుకున్నానో అలాంటి పాత్రల్లో ఇదొకటి. ఒకే తరహా పాత్రలు చేస్తూ పోతే కొన్నాళ్లకు తెలియని ఓ ముద్ర పడిపోతుంది. ఎలాంటి పాత్రకైనా సరిపోతాననే నమ్మకం కలిగించడమే ప్రస్తుత లక్ష్యం.

**దిశ ఘటనపై ఏమీ చేయలేకపోయా..**

హీరో కామెడీ చేసినా ప్రేక్షకులకు నచ్చుతుంది. రజనీకాంత్, చిరు, మహేశ్ వంటి హీరోలు నవ్విస్తుంటే చాలా సంతోషంగా ఉంటుంది. నేనూ అది దృష్టిలో పెట్టుకునే ఇందులో కామెడీ చేశా. విలన్‌గా చేయడానికీ నేను రెడీ! కానీ పోషించే పాత్రకు ఓ అర్థం ఉండాలి. త్వరలో ఇద్దరు కొత్త దర్శకులతో సినిమాలు చేయబోతున్నా. 'గుణ 369'లో నటుడిగా హత్యాచార నిందితులను శిక్షించాను. దిశ ఘటనపై ట్వీట్ చేయడం తప్ప ఏం చెయ్యగలుగుతున్నా అనిపించింది.

# పర్ఫెక్ట్ మ్యాచ్ అంటున్నారు

– ఉదయ్ శంకర్



"ఈ శుక్రవారం మూడు మ్యాచ్‌లో గెలిచాం. ఒకటి దిశ నిందితుల ఎన్‌కౌంటర్, రెండు టీమ్ ఇండియా మ్యాచ్‌లో గెలవడం, మూడోది మా సినిమా హిట్ కావడం. అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది" అని ఉదయ్ శంకర్ అన్నారు. ఎన్ వి. నిర్మల్ కుమార్ దర్శకత్వంలో ఉదయ్ శంకర్, ఐశ్వర్యా రాజేశ్ జంటగా జి.శ్రీరామ్ రాజు, భరత్ రామ్ నిర్మించిన 'మిస్ మ్యాచ్' ఇటీవల విడుదలైంది. శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో "తొలిప్రేమ' నుంచి రీమిక్స్ చేసిన 'ఈ మనసే' పాట థియేటర్‌లో ప్రేక్షకులను హోరెత్తిస్తోంది. సినిమా చూసి అందరూ పర్ఫెక్ట్ మ్యాచ్ అంటున్నారు" అని ఉదయ్ శంకర్ చెప్పారు. "మహిళా సాధికారతను తెలియజేసిన ఈ సినిమాని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలి" అని నిర్మాతలు తెలిపారు.

# ఆత్రుత, అసహనం, కోపం..


సింహా

"మీ ఇద్దరిని డెడికేషన్, టాలెంట్‌కు మారుపేరులా నిర్వచించవొచ్చు. 'రంగస్థలం' సమయంలో సింహాతో కలిసి పనిచేశా. ఆ ప్రయాణం మరపురానిది. మా నటుల ప్రపంచంలోకి సింహాకు స్వాగతం పలుకుతున్నా. కాలభైరవ విలక్షణ గాత్రానికి నేను పెద్ద అభిమానిని. ఆయన పాటల్ని వినాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నా" అని రామ్‌చరణ్ అన్నారు. కీరవాణి తనయుడు శ్రీసింహా కథానాయకుడిగా పరిచయమవుతున్న 'మత్తు వదలరా' సినిమా టీజర్‌ను రామ్‌చరణ్ సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు. రితేష్ రానా దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్, క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. చిరంజీవి (చెర్రీ), హేమలత నిర్మాతలు. కీరవాణి పెద్ద కుమారుడు కాలభైరవ సంగీతం అందిస్తున్నారు. మర్డరీ సస్పెన్స్ మిస్టరీ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రం ఆత్రుత, అసహనం, కోపం కలబోసిన భిన్న మనస్తత్వం వున్న కథానాయకుడిగా సింహా కనిపిస్తారు. "మర్డర్ మిస్టరీ కథకు వినోదం జోడించి తెరకెక్కించిన చిత్రమిది. ఈ నెల 25న విడుదల చేస్తున్నాం" అని నిర్మాతలు తెలిపారు.

## డైలీ సుడోకు - 217

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 9 | | 8 | 3 | | 5 | | | 7 |
| 2 | | | | | 1 | | | |
| | | | | 6 | | 2 | | |
| 6 | | | | | 3 | | 1 | |
| 5 | | 3 | | | | 6 | | 4 |
| | 4 | | 5 | | | | | 2 |
| | | 5 | | 4 | | | | |
| | | | 7 | | | | | 3 |
| 4 | | | 6 | | 9 | 5 | | 8 |

**సుడోకు- 216 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 3 | 6 | 7 | 8 | 1 | 5 | 4 | 2 | 9 |
| 8 | 1 | 9 | 7 | 2 | 4 | 5 | 6 | 3 |
| 2 | 4 | 5 | 9 | 3 | 6 | 8 | 7 | 1 |
| 4 | 9 | 2 | 3 | 6 | 1 | 7 | 5 | 8 |
| 7 | 3 | 8 | 4 | 5 | 9 | 2 | 1 | 6 |
| 1 | 5 | 6 | 2 | 7 | 8 | 3 | 9 | 4 |
| 6 | 8 | 4 | 5 | 9 | 2 | 1 | 3 | 7 |
| 9 | 2 | 3 | 1 | 8 | 7 | 6 | 4 | 5 |
| 5 | 7 | 1 | 6 | 4 | 3 | 9 | 8 | 2 |

**ఎలా పూరించాలి?** ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.


SPECTACULAR. GIGANTIC. DECEMBER 12.
KAVYA FILM COMPANY PRESENTS
మామాంగం
HISTORY OF THE BRAVE
DIRECTED BY M PADMAKUMAR
PRODUCED BY VENU KUNNAPPILLY
GEETHA FILM DISTRIBUTORS
BOOK YOUR TICKETS ONLY ON bookmyshow


ఈవారమే
విడుదల
Jayakumaar's Musical
100 CRORES ACADEMY
VARANGI Movies
వీరశాస్త
అయ్యప్ప కటాక్షం
సుమన్ 100వ చిత్రం
వి.యస్.పి.తెన్నేటి
వి.యస్.పి.తెన్నేటి
T.S.బద్రీష్ రామ్
రుద్రాభట్ల వేణుగోపాల్


TIGER COMPANY PRODUCTION
టి. అంజయ్య సమర్పించు
AJAY MYSORE
డిసెంబర్ 12న విడుదల
రామ్‌గోపాల్ వర్మ
అమ్మ రాజ్యంలో కడప బిడ్డలు
సిద్ధార్థ తాతోలు
నిర్మాతలు - టి. నరేష్ కుమార్, టి. శ్రీధర్ సహ నిర్మాతలు - నట్టి క్రాంతి, నట్టి కరుణ
నిర్మాత - అజయ్ మైసూర్ సహ నిర్మాతలు - నరసింహ రాజు రాచూరి, వంశీ త్రిమూర్తుల


SURESH PRODUCTIONS PVT. LTD.
people MEDIA FACTORY
డిసెంబర్ 13న విడుదల
VENKY మామ
K.S. RAVINDRA (BOBBY)
D.SURESH BABU T.G.VISHWA PRASAD
THAMAN S VIVEK KUCHIBHOTLA PRASAD MURELLA
PRAWIN PUDI BRAHMA KADALI RAM LAXMAN RAVI VARMA A. VIJAY SRIKANTH VISSA K.CHAKRAVARTHY
JANARDHAN MAHARSHI RADHA POOSALA NIKHIL KODURU G.RAMESH REDDY KOLLI SUJITH KUMAR RAMA BALAJI.D Y.NAGU
ADITYA MUSIC
వెంకి మామ

## ఎన్నిక ద్వారానే సంస్థాగత కమిటీలు

▸▸ స్థానిక ఎన్నికలకు అవే కీలకం: చంద్రబాబు



అమరావతి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): "పార్టీ సంస్థాగత కమిటీలను ఎన్నిక ద్వారానే ఏర్పాటు చేసుకోవడం శుభపరిణామం. నామినేషన్ల ద్వారా కమిటీల ఎంపిక ఇకపై లేదు. ఇప్పటికే మూడోవంతు కమిటీల ఏర్పాటు పూర్తయింది. మిగిలినవి కూడా శరవేగంగా పూర్తి చేయాలి" అని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పేర్కొన్నారు. పార్టీలో యువతకు, మహిళలకు పెద్దపీట వేయాలని, 50శాతం పదవులు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకే ఇవ్వాలని అన్నారు. పార్టీ సంస్థాగత ఎన్నికలపై చంద్రబాబు శనివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాల పర్యటనలు, నియోజకవర్గాల సమీక్షలతో కార్యకర్తల్లో పౌరుషం, పట్టుదల, ఉత్సాహం పెరిగాయన్నారు. వ్యవస్థగా పార్టీ బలోపేతం అయితేనే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందన్నారు. అందరికీ ఆమోదయోగ్యంగా పార్టీ కమిటీలు ఏర్పడాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో అవే కీలకమన్నారు.

### అమరవీరుల త్యాగాల వల్లే దేశం సురక్షితం

'అమరవీరుల త్యాగాల వల్లే దేశం సురక్షితంగా ఉంది. స్వాతంత్ర్యం అనుభవించగలుగుతున్నాం. వారి త్యాగాలు మరవలేనివి. సాయుధ బలగాల దినోత్సవం సందర్భంగా వారందరికీ మానఃపూర్వక ధన్యవాదాలు తెలియచేస్తున్నా" అని చంద్రబాబు ట్వీట్ చేశారు.

## మాఫీ కోసమే జగన్ ఢిల్లీ యాత్ర: టీడీపీ

అమరావతి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ ఢిల్లీ పర్యటనపై వ్యంగ్యోక్తులతో టీడీపీ నేతలు పదునైన విమర్శ చేశారు. శనివారం వర్ల రామయ్య విజయవాడలో మీడియాతో మాట్లాడాగా.. యనమల రామకృష్ణుడు పత్రికా ప్రకటన విడుదల చేశారు. కేసుల మాఫీ కోసం ఢిల్లీ వెళ్లబట్టే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కలిసేందుకు సమయం ఇవ్వలేదని యనమల విమర్శించారు. ఢిల్లీలో జగన్‌కు ఇది రెండో పరాభవమన్నారు. ఢిల్లీ ఎప్పుడెళ్లినా తన సొంత కేసులు, డిశ్చార్జ్ పిటిషన్లు, కోర్టు హాజరీ మినహాయింపుల గురించే అడుగుతున్నారని విమర్శించారు. అందుకే కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదన్నారు. సీబీఐ, ఈడీ కేసుల్లో మెడలోతు జగన్ కూరుకుపోయారన్నారు. శిక్షపడే సమయం దగ్గర పడిందనే జగన్‌కు భయమన్నారు. విచారణ ప్రారంభమైతే నేరాలు రుజువవుతాయనే భయం ఉందన్నారు. ఒకవైపు డిశ్చార్జి పిటిషన్లు వేస్తారని, ఇంకోవైపు శుక్రవారమే పర్యటనలు పెడతారని ఎద్దేవా చేశారు. ఈ కిరికిరి అంతా కోర్టు విచారణను జాప్యం చేసేందుకేనని యనమల ఆరోపించారు. కాగా, సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేక విమానంలో ఢిల్లీ వెళ్లి ఖాళీ చేతులతో తిరిగి వచ్చారని వర్ల రామయ్య అన్నారు. శుక్రవారం సీబీఐ కోర్టుకు హాజరు కాకుండా ఉండటం కోసమే జగన్ గురువారం ఢిల్లీ వెళ్లారా? అని ప్రశ్నించారు. లెటర్ ఆఫ్ రిగోరేటరీ ద్వారా ఆరు దేశాల నుంచి మనీలాండరింగ్‌పై సమాచారం రావడానికి సిద్ధంగా ఉందని, సీబీఐ దానిపై అనుబంధ చార్జిషీట్ వేయబోతోందని, ఈ నేపథ్యంలోనే కేంద్ర మంత్రిని శరణు కోరడానికే జగన్ ఢిల్లీ వెళ్లారా అని ప్రశ్నించారు.

## పోలీసుల్ని పెట్టి ఉల్లి అమ్మకాలా?: యనమల

అమరావతి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): "రాష్ట్రంలో ఏ పంటకూ గిట్టుబాటు ధర అందడం లేదు. భారీ వర్షాలతో పంట ఉత్పత్తులు తగ్గాయి. వేరుశనగ ధర సగానికి సగం... క్వింటాల్ రూ.8,200 నుంచి రూ.4 వేలకు పడిపోయింది. శనగ ధర క్వింటాల్‌కు రూ.600 పడిపోయింది. అమ్మాలంటే అడవి.. కొనాలంటే కొరివిగా మారింది" అని యనమల రామకృష్ణుడు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆయనో పత్రికా ప్రకటన చేశారు. రైతులను, వినియోగదారులను దోచుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా దళారులే స్వైరవిహారం చేస్తున్నారన్నారు. రైతు బజార్లను మినీ పోలీస్‌స్టేషన్లుగా మార్చారన్నారు. 'పోలీసు పర్యవేక్షణలో ఉల్లి పంపిణీనా? రైతుబజార్లకు వచ్చిన మహిళలపై దాడులా?' అని యనమల విమర్శించారు. రాజధానిలో టీడీపీ సింగపూర్ తరహా నిర్మాణాలు చేపడితే వైసీపీ శ్మశాన వాటికలపై దృష్టిపెట్టిందని విమర్శించారు.

## దాడిపై దర్యాప్తు వదిలేసి బస్సు సీజ్ చేస్తారా?

▸▸ హోంశాఖ ముఖ్య కార్యదర్శికి కళా లేఖ

అమరావతి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష నేత చంద్రబాబు రాజధాని పర్యటనకు ఉపయోగించిన బస్సును దర్యాప్తు పేరుతో పోలీసులు సీజ్ చేసి బస్సు యాజమాన్యాన్ని ఇబ్బంది పెడుతున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావు తెలిపారు. ప్రతిపక్షనేతపై దాడిచేసిన వారిని వదిలేసి దర్యాప్తు పేరుతో బస్సును సీజ్ చేయడం ఏంటని ఒక ప్రకటనలో ప్రశ్నించారు. పోలీసులు తొమ్మిది రోజులపాటు బస్సును తమ స్వాధీనంలోనే ఉంచుకోవడం సరికాదన్నారు. బస్సును వెంటనే విడుదల చేయాలని, చట్టం ప్రకారం పనిచేయాలని పోలీసులను డిమాండ్ చేశారు. ఈ మేరకు హోం శాఖ ముఖ్య కార్యదర్శికి కళా వెంకట్రావు శనివారం ఒక లేఖ రాశారు.

## డేటా చోరీ కేసు ఏమైంది?

▸▸ సీఎంకు బీజేపీ నేత కన్నా లేఖ

అమరావతి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల ముందు జరిగిన డేటా చోరీ కేసు దర్యాప్తు ఏమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ ముఖ్యమంత్రి జగన్‌ను ప్రశ్నించారు. ఈ మేరకు శనివారం ఆయనకు లేఖ రాశారు. రాష్ట్రంలో ఏడు కోట్ల మంది ప్రజల వ్యక్తిగత వివరాలు చోరీ అయ్యాయంటూ మార్చి నెలలో కేసు నమోదు చేశారని, అయినా ఐటీ గ్రిడ్స్ యజమాని అశోక్‌ను పోలీసులు ఇంత వరకూ ఎందుకు ప్రశ్నించలేకపోయారని కన్నా నిలదీశారు. ఈ కేసు నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

## మహిళల రక్షణకు చర్యలు తీసుకోండి

▸▸ జగన్‌కు సీపీఐ నేత రామకృష్ణ లేఖ

అమరావతి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళల రక్షణకు ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ కోరారు. ఈ మేరకు శనివారం ఆయన సీఎం జగన్‌కు లేఖ రాశారు. నేరం జరిగిన తర్వాత స్పందించేకన్నా జరగకుండా నియంత్రించాలని, సాంకేతికతను విస్తరించాలని సూచించారు. మహిళలు ఒంటరిగా బయటకు వెళ్లే సమయాల్లో రక్షణ కోసం జీపీఎస్ పరికరాలు అమర్చిన వాచీలు, లాకెట్లు వంటివి ధరించేలా మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. రాత్రి సమయాల్లో పోలీస్ గస్తీ మెరుగుపరచాలని, నేరస్వభావం గల దుండగులపై నిరంతర నిఘా కొనసాగాలని కోరారు.

## మతాల మధ్య చిచ్చుపెడుతున్న పవన్ : ఆలివర్

మహారాణిపేట(విశాఖ సిటీ), డిసెంబరు 7: "జనసేన అధినేత పవన్ కల్యాణ్ క్రైస్తవుల మనోభావాలును దెబ్బతీస్తున్నారు. రెండు మతాల మధ్య చిచ్చుపెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారు. విజయవాడలో కృష్ణానది తీరాన క్రైస్తవ సంప్రదాయాల ఆచరణ గురించి వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన పవన్‌పై చర్యలు తీసుకోవాలి" అంటూ ఆంధ్రప్రదేశ్ క్రైస్తవ నాయకుల ఫోరమ్ చైర్మన్, జనసేన మాజీ నాయకుడు ఆలివర్ రాయ్ డిమాండ్ చేశారు. శనివారం క్రైస్తవ ఫోరమ్ నేతలతో కలిసి ఆయన ఆమేరకు విశాఖ పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. బలవంతపు మత మార్పిళ్లు జరుగుతున్నట్లు ఎవరూ ఆరోపించలేదన్నారు. స్వచ్ఛందంగా క్రైస్తవ మతాన్ని స్వీకరిస్తే తప్పేమిటని ప్రశ్నించారు.

## రాజధానిగా అమరావతిని కొనసాగించాలి

▸▸ హైకోర్టును కర్నూలు తరలించాలి: హరిరామజోగయ్య

పాలకొల్లు, డిసెంబరు 7: "రాష్ట్రాన్ని నవ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలంటే అమరావతినే రాష్ట్ర రాజధానిగా కొనసాగించాలి. అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసం పరిపాలనను వికేంద్రీకరించినా అభ్యంతరం లేదు. ఇప్పటికే వేలకోట్ల రూపాయలను అమరావతి ప్రాంతానికి ఖర్చు చేసినందున రాజధానిగా అమరావతిని కొనసాగిస్తూ రెండో పరిపాలనా రాజధానిగా విశాఖపట్నం, రాజమహేంద్రవరం పట్టణాలకు మధ్యస్తంగా ఒక ప్రాంతాన్ని ఎంపిక చేయాలి" అని మాజీ ఎంపీ చేగొండి వెంకట హరిరామజోగయ్య సూచించారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు పట్టణంలోని ఆయన నివాసంలో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. హైకోర్టును కర్నూలుకు తరలించాలని, తూర్పు పశ్చిమ జిల్లాలకు అందుబాటులో ఉండే ప్రాంతంలో నిమ్స్ స్థాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని స్థాపించాలని, ఆరోగ్య కనీస అవసరాలు తీర్చడానికి ప్రతి నియోజకవర్గంలోనూ 100 పడకల ఆసుపత్రులను స్థాపించాలని సూచించారు.

# సభ ముందుకు 20 బిల్లులు

▸▸ ప్రభుత్వ సర్వీసులోకి ఆర్టీసీ ఉద్యోగులు

▸▸ మహిళలపై లైంగిక దాడి చేస్తే కఠిన చర్యలు

▸▸ రైతులకు నాణ్యమైన విత్తనాల సరఫరా

▸▸ మరికొన్ని చట్ట సవరణ బిల్లులు కూడా..

అమరావతి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సోమవారం నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాలకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేస్తోంది. ఈ సమావేశాల్లోనే సభ ముందుకు 20 బిల్లులు తీసుకొచ్చే ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. వీటితోపాటు కొన్ని చట్ట సవరణలకు సంబంధించిన బిల్లులు కూడా సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. బిల్లుల రూపకల్పనకు సంబంధించిన కసరత్తు ఆయా శాఖల అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. ఆ సమావేశాల్లోనే ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ సర్వీసులోకి విలీనం చేసే బిల్లును ప్రభుత్వం సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ బిల్లు రూపకల్పనకు సంబంధించిన పూర్తిస్థాయి కసరత్తును న్యాయనిపుణుల సలహాలతో ఆ శాఖ అధికారులు పూర్తి చేసినట్లు తెలిసింది. అదేవిధంగా ప్రభుత్వ, ప్రైవేటు మోటారు వాహనాల చార్జీల నియంత్రణకు సంబంధించి ప్రభుత్వం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసే ఉద్దేశంతో ఉంది. దీనికి సంబంధించిన విధివిధానాలను ఇప్పటికే రూపొందించింది. అయితే అది బిల్లు రూపంలో ప్రవేశపెట్టాలా? లేక మోటారు వాహనాల చట్టానికి సవరణ చేస్తే సరిపోతుందా? అనే అంశంపై అధికారుల్లో చర్చ జరుగుతోంది. మహిళలపై లైంగిక దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం ఉన్న చట్టంలోనే క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సవరణ తెస్తే సరిపోతుందా? లేదా కొత్త బిల్లు రూపకల్పన చేయాలా అనే అంశంపై ప్రభుత్వం న్యాయనిపుణుల సలహాలు తీసుకుంది. ఈ సమావేశాల్లోనే దీనికి సంబంధించిన చట్టసవరణగానీ, కొత్త బిల్లుగానీ ప్రవేశపెట్టాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే దీనికి సంబంధించి అధికారుల కసరత్తు పూర్తి కావాల్సి ఉంది. రాష్ట్రంలోని దేవాలయాల్లో ఉన్న కమిటీల సభ్యుల సంఖ్యను పెంచాలని కూడా ప్రభుత్వం భావిస్తోంది. అందుకు సంబంధించిన బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టడానికి రంగం సిద్ధం చేసింది. దీనితోపాటు దేవదాయశాఖకు సంబంధించిన మరో రెండు బిల్లులను అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు. వీటితోపాటు ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖకు సంబంధించిన రెండు బిల్లులు, రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడానికి, నకిలీలకు అడ్డుకట్ట వేయడానికి రూపొందించిన బిల్లులు సభ ముందుకు రానున్నాయి. వీటితోపాటు మరికొన్ని బిల్లులను ప్రభుత్వం సభ ముందు ఉంచనుంది. మొత్తంగా 20 బిల్లులు, మరికొన్ని చట్ట సవరణలకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం సిద్ధం చేసింది.

## రేపు బీఏసీ సమావేశం

అమరావతి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై సోమవారం శాసనసభ వ్యవహారాల కమిటీ(బీఏసీ) సమావేశం కానుంది. సభాపతి తమ్మినేని సీతారాం అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి... ముఖ్యమంత్రి జగన్, ప్రతిపక్షనేత చంద్రబాబు, ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ప్రభుత్వ చీఫ్‌విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొంటారు. అసెంబ్లీ శీతాకాల సమావేశాల పనిదినాలు, కొత్తగా తీసుకురావాల్సిన చట్టాలు, సభలో చర్చించాల్సిన అంశాలపై ఈ సమావేశంలో నిర్ణయం తీసుకుంటారు.

# ప్రయాణికులపై చార్జ్

(మొదటి పేజీ తరువాయి)

బస్సులు ఎక్కే సామాన్యులు మోయనున్నారు. అయితే, ఏటా ఆర్టీసీకి రూ.1,200కోట్ల మేర నష్టాలు వస్తున్న దరిమిలా, చార్జీలు పెంచకతప్పడం లేదని రవాణా శాఖ మంత్రి పేర్ని నాని ప్రకటించారు. దీనిపై ఆర్టీసీ యాజమాన్యం వినతిని ముఖ్యమంత్రి జగన్ అంగీకరించారని, ఒకటి రెండు రోజుల్లో పెంపు అమలు ఎప్పుడనేది సంస్థ ఎండీ ప్రకటిస్తారని మంత్రి వెల్లడించారు.

### అన్ని సర్వీసులపైనా..

పదమూడు జిల్లాల్లో 3,803 మార్గాల్లో 111,763 బస్సులు నడుపుతూ 65లక్షల మంది ప్రయాణికులను రోజూ గమ్యస్థానాలకు ఆర్టీసీ చేరుస్తోంది. ఈ సంస్థలో 53వేల సిబ్బంది పనిచేస్తున్నారు. పల్లె బస్సుల నుంచి ఏసీ స్లీపర్ దాకా అన్ని సర్వీసులు సరాసరి రోజుకు 365కిలోమీటర్లు తిరుగుతున్నాయి. ఈ సర్వీసులపై పెంచిన చార్జీలు త్వరలోనే అమలులోకి రానున్నాయి. తెలంగాణలో పెంచిన విధంగా ప్రతి కిలోమీటరుకు రూ.20పైసల చొప్పున పెంచిన ప్రభుత్వం.. పల్లె బస్సుల్లో పది పైసలు పెంచింది. దీంతో సరాసరి గ్రామీణ ప్రయాణికుడిపై రూ.4వరకూ అదనపు భారం పడుతుండగా, ఇతర బస్సుల్లో ఒకసారి పోయి, రావడానికి రూ.100వరకూ చెల్లించాల్సి ఉంటుంది.

### ఎంత నెట్టినా నష్టాలే..

కార్మికులు కష్టపడుతున్నారు. ప్రయాణికులు ఆదరిస్తున్నారు. ఫలితంగా నాలుగేళ్లలో పదిశాతం ఓఆర్ పెరిగి 80శాతానికి చేరింది. దీంతో సంస్థ ఆదాయం 2015-16లో రూ.4,940కోట్లు వస్తే 2018-19లో రూ.5,995కోట్లకు పెరిగింది. నాలుగేళ్లలో వెయ్యి కోట్లకుపైగా ఆదాయం పెరిగింది. అయినా నష్టమే. డీజిల్ ధరల పెరుగుదల, పల్లెబస్సుల నష్టాలు, మోటారు వాహన పన్ను భారం, అప్పులకు వడ్డీలు పెరిగిపోవడం ఆర్టీసీని కుంగదీస్తున్నాయని అధికారులు వివరిస్తున్నారు. బస్సు కిలోమీటరు నడపడానికి ఆర్టీసీకి రూ.44.58 ఖర్చవుతుంటే, ఆదాయం రూ.38.05 మాత్రమే. అంటే ప్రతి కిలోమీటరుకు ఆర్టీసీపై పడుతున్న భారం రూ.6.53. అప్పులకు ఏటా రూ.300కోట్ల వడ్డీలు చెల్లిస్తున్నారు. సిబ్బంది జీతభత్యాలు, బకాయిలు చెల్లించడంతో పాటు అప్పులు తీర్చడానికి ఆర్థిక సాయం చేయాలని, నాలుగైదేళ్లపాటు సహకరిస్తే సంస్థ నష్టాల్లోంచి లాభాల బాట పట్టేదని యాజమాన్యం నివేదిక ఇచ్చింది. విలీన ప్రక్రియ ప్రారంభం అవడంతో ఈ ప్రతిపాదనలన్నీ మరుగున పడ్డాయి.




ఈ నెల 5న 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనం

**పెరుగుదల ఇలా..**

| బస్సు సర్వీసు (కిలోమీటరుకు) | ప్రస్తుత ధర | పెంచిన తర్వాత |
|---|---|---|
| పల్లె బస్సులు | 0.63 | 0.73 |
| సిటీ సర్వీస్ | 0.78 | 0.88 |
| ఎక్స్‌ప్రెస్ | 0.87 | 1.07 |
| డీలక్స్ | 0.98 | 1.18 |
| సూపర్ లగ్జరీ | 1.16 | 1.36 |
| ఇంద్ర | 1.45 | 1.66 |
| గరుడ | 1.71 | 1.91 |
| గరుడ ప్లస్ | 1.82 | 2.02 |
| అమరావతి | 1.91 | 2.21 |

### 'రెగ్యులేటరీ'.. మాటేమిటి?

చార్జీల పెంపు నిర్ణయం పట్ల భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. రవాణాకు సంబంధించి రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటుచేసి, అన్నికోణాల్లోనూ సమీక్షించిన తరువాత పెంపు ఉంటుందని చెప్పిన జగన్.. ఉన్నపళంగా భారం మోపారని మెజారిటీ ప్రజలు ఆరోపిస్తున్నారు. పల్లె బస్సులపై ఎంవీ ట్యాక్స్ తొలగిస్తే ఆర్టీసీకి నష్టమే రాదని కార్మికులు చెబుతున్నారు. ఈ సర్వీసులకు డీజిల్ సబ్సిడీ ఇస్తే సంస్థ లాభాల బాట పడుతుందంటున్నారు. ఇదేమీ పట్టించుకోకుండా 'యాజమాన్యం అడిగింది.. సీఎం సిగ్నల్ ఇచ్చింది' అంటూ మంత్రి పేర్ని నాని చేసిన ప్రకటన కోట్లాది మంది ప్రయాణికులకు రుచించలేదు.

## పెద్ద భారమేమీ కాదు!

▸▸ త్వరలో కొత్త చార్జీలు అమల్లోకి: పేర్ని నాని

విజయవాడ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తప్పనిసరి పరిస్థితుల్లోనే ఆర్టీసీ చార్జీలు పెంచాల్సి వస్తోందని రవాణాశాఖ మంత్రి పేర్ని నాని అన్నారు. రోడ్డు రవాణా సంస్థను నష్టాల ఊబి నుంచి తప్పించటానికి, ప్రైవేటు పరం చేసే పరిస్థితులు ఉత్పన్నం కాకుండా ఉండటానికే ఈ నిర్ణయం తీసుకొన్నామని వివరించారు. పెరిగిన చార్జీలు ఎప్పటి నుంచి అమల్లోకి వస్తాయనేది రెండు రోజుల్లో ఆర్టీసీ ఎండీ ప్రకటిస్తారని చెప్పారు. దీనిపై ఆయన శనివారం 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

**ఆర్టీసీ చార్జీలు ఎందుకు పెంచాల్సి వచ్చింది?**

ఆర్టీసీ దివాలా తీయకుండా, సంస్థను ప్రవేటుపరం చేసే పరిస్థితి రాకుండా ఉండటంకోసం చార్జీలు పెంచాల్సి వస్తోంది. ఆర్టీసీ రూ.6,735కోట్ల మేర నష్టాల్లో ఉంది. కొత్తగా ఏటా రూ.1,200కోట్ల మేర నష్టాలు వస్తున్నాయి.

**విలీనం ద్వారా ప్రభుత్వంపై భారం ఎక్కువైందా?**

అలాంటిదేమీ లేదు. 2015నుంచి ఇప్పటివరకూ డీజిల్ ధర రూ.50నుంచి రూ.70కి పెరిగింది. ఆర్టీసీ సాలీనా 30కోట్ల లీటర్ల డీజిల్‌ను వినియోగిస్తోంది. ఏటా డీజిల్ మీద రూ.600కోట్ల నష్టం వస్తోంది.

**చార్జీల పెంపుతో భారంపడే అవకాశం ఉంది కదా?**

పక్క రాష్ట్రంలో 20పైసలు పెంచారు. అప్పుడు మీరెవరూ పెనుభారం అనలేదు. ఇక్కడ మేము పది పైసలే పెంచాం. అయినా మోయలేని భారం అంటున్నారు. ఆర్టీసీని బతికించాల్సిన అవసరం ఉంది. లేదంటే ప్రైవేటు పరం చేయాల్సి వస్తుంది. అలా జరగకుండా ఉండటానికే చార్జీలు పెంచాం.

**ఉద్యోగులను విలీనం చేశామంటున్నారు. నష్టాలు అన్న ప్రశ్న ఎందుకు వస్తోంది?**

ఎందుకు రావు? పాత అప్పులన్నీ ఎవరు కడతారు? వాటిని ప్రభుత్వమే కట్టాలి. జీతభత్యాలు ప్రభుత్వమే చెల్లించాలి. డీజిల్ వ్యయం భరించాలి. వెయ్యి బస్సులు కొనాలి. ఆర్టీసీ నష్టాలను ఆపాలి. సామాన్యుడిపై భారం పడకుండా ఉండటానికి పల్లె వెలుగులపై కిలోమీటరుకు 10 పైసలే పెంచాం. పక్క రాష్ట్రంలో 20పైసలు పెంచారు. పది పైసల పెంపు పెద్ద భారం కాదు.

### ▸▸ చార్జీల పెంపు వద్దు : మధు

ఆర్టీసీ చార్జీల పెంపు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు డిమాండ్ చేశారు. నిత్యావసరాల ధరల పెరుగుదలతో పేద, మధ్యతరగతి కుటుంబాలు ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ఈ నేపథ్యంలో ఆర్టీసీ చార్జీలు పెంచాలని నిర్ణయం తీసుకోవడం వల్ల ప్రజలపై తీవ్ర భారం పడుతుందని ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. ఆర్టీసీలో నష్టాలను పూడ్చేందుకు ప్రత్యామ్నాయాలు ఆలోచించాల్సింది పోయి ప్రజలపై భారం వేయడం సమంజసం కాదన్నారు.

### ▸▸ చెప్పిందొకటి... చేసేదొకటి: అచ్చెన్న

"ప్రజలపై పైసా భారం వేయనని పాదయాత్రలో జగన్ చెప్పారు. పన్నులు, చార్జీలు పెంచమని నమ్మించారు. ఆరు నెలల్లో ఆర్టీసీ చార్జీలు పెంచడం ప్రజలను మోసగించడమే. జగన్ చెప్పేదొకటి, చేసేదొకటి అని మరోసారి రుజువైంది" అని టీడీఎల్పీ ఉపనేత అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ చార్జీల పెంపుపై ప్రభుత్వాన్ని దునుమాడుతూ ఆయన ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. చార్జీల పెంపు నిర్ణయం జగన్ చేతగాని తనానికి నిదర్శనం. ఆర్టీసీ రూ.1200కోట్ల నష్టాల్లో ఉందని చెప్పడం హాస్యాస్పదమన్నారు. వైసీపీ ప్రభుత్వం పేదలను దారుణంగా మోసగించిందని అన్నారు.

# ఆనం వ్యాఖ్యలపై జగన్ ఆగ్రహం

▸▸ సంజాయిషీ కోరాలంటూ విజయసాయికి ఆదేశం

▸▸ గీత దాటితే ఎవరైనా చర్యలు తప్పవని హెచ్చరిక

అమరావతి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నెల్లూరు పట్టణ అసెంబ్లీ నియోజకవర్గంలో రౌడీలూ గుండాలూ ఎక్కువయ్యారు... ప్రజలు మనోవేదనకు గురవుతున్నారు... భూకబ్జాలూ... సెటిల్‌మెంట్లూ పెరిగిపోయాయంటూ వైసీపీ వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలపై వైసీపీ అధ్యక్షుడు, సీఎం జగన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఆనం నుంచి సంజాయిషీని కోరుతూ షోకాజ్ నోటీసును జారీ చేయాలని పార్టీ జాతీయ కార్యదర్శి విజయసాయిరెడ్డిని ఆదేశించారని సమాచారం. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. బీద మస్తానరావు పార్టీలో చేరుతున్న సందర్భంలో వెంకటగిరి ఎమ్మెల్యే వ్యాఖ్యలు ప్రస్తావనకు వచ్చాయి. దీంతో ఆనం వ్యాఖ్యలపై సీఎం జగన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రిగా ఉన్న నెల్లూరు నగర ఎమ్మెల్యేపై బాహాటంగా ఆనం ఇలా వ్యాఖ్యానించడం ఏమిటని జగన్ తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే తనతో సహా ఎవరైనా ఒకటేనని, క్రమశిక్షణా చర్యలు తప్పవని జగన్ హెచ్చరించినట్లు కథనం. ఆ సమయంలో అక్కడ నెల్లూరు జిల్లాకు చెందిన రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, మంత్రి అనిల్ కుమార్, రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, వైసీపీ నేత రూప్‌కుమార్ తదితరులు ఉన్నారు. ఆ సమయంలో పార్టీ అధ్యక్షుడు.. సీనియర్ నేత ఆనంపై కఠిన వైఖరితో ఉండాలని తేల్చి చెప్పడం చర్చనీయాంశమైంది. వ్యక్తిగత ఆధిపత్యం ప్రదర్శిస్తానంటే సహించబోనని ఈ సందర్భంగా జగన్ స్పష్టం చేయడంతో.. పార్టీలో ఆనంతో సహా ఇతర నేతలకూ జగన్ హెచ్చరికలు జారీ చేసినట్లయిందని పలువురు వ్యాఖ్యానించారు. శాసనసభ శీతాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో ప్రతిపక్షానికి చెందిన పలువురు ఎమ్మెల్యేలను వైసీపీలోకి లాక్కొనే ప్రయత్నం జరుగుతోంది. ఇలాంటి తరుణంలో పార్టీకి చెందిన ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి బహిరంగంగా మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలు పార్టీ అధినేతను ఇరుకున పెట్టాయని రాజకీయవర్గాలు చెబుతున్నాయి. ఇటీవల చిత్తూరు పర్యటనకు వెళ్లిన చంద్రబాబుతో రేణిగుంట విమానాశ్రయంలో ఆనం భేటీ అయ్యారన్న ప్రచారమూ వైసీపీ వర్గాల్లో జరుగుతోంది. ఈ నేపథ్యంలో బాహాటంగా ఆనం వ్యాఖ్యలు కలకలాన్ని రేపాయి.



బీద మస్తాన్ రావుని పార్టీలోకి ఆహ్వానిస్తున్న జగన్

### వైసీపీలో చేరిన బీఎమ్మార్

ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయనకు పార్టీ కండువాను కప్పి ఆహ్వానించారు. బీద వైసీపీలో చేరుతారంటూ కొంత కాలంగా ప్రచారంలో ఉంది. బీద మస్తాన్‌రావుతో పాటు ఆయన సన్నిహితులు కూడా వైసీపీలో చేరారు. కార్యక్రమంలో విజయసాయిరెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, మంత్రి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## నిరూపిస్తే తలదించుకుంటాం: బొత్స



శృంగవరపుకోట రూరల్, డిసెంబరు 7: ఇసుక వ్యాపారంలో వైసీపీ ప్రజాప్రతినిధులు, ఉన్నారని నిరూపిస్తే తలదించుకుంటాం. బహిరంగ క్షమాపణ కోరుతాం. ప్రభుత్వం నూతన ఇసుక విధానం రూపొందించడంలో కొద్దిపాటి జాప్యం జరిగింది. ఈ నేపథ్యంలో వరుస తుఫానులతో ఇసుక లభ్యంకాక కొరత ఏర్పడింది. దీనిపై విపక్షాలు విమర్శల దాడికి దిగడం అమానుషం" అని మంత్రి బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. శనివారం విజయనగరం జిల్లా ఎస్.కోట మండలం గౌరీపురంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుకను అడ్డంపెట్టుకొని మంత్రులు, ఎమ్మెల్యే నుంచి దిగువస్థాయి ప్రజాప్రతినిధులు వరకూ దోచుకుతిన్నారని ఆరోపించారు. సిగ్గూ లజ్జా లేకుండా దోపిడీకి పాల్పడ్డారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ట్విటర్‌లో కొంతమంది అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, అటువంటివి మానుకోవాలని హెచ్చరించారు.

## పవన్.. బహిరంగ చర్చకు సిద్ధమా: మోపిదేవి



తెనాలి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): "రైతుల సమస్యల గురించి పవన్ కల్యాణ్‌కు ఏమీ తెలియదు. సీఎం రైతులను గాలికి వదిలేశారంటూ ఆయన మదనపల్లి సభలో జగన్మోహన్ రెడ్డిని విమర్శించడం విడ్డూరం. ఆయనకు అవగాహన కల్పించడానికైనా, చేస్తున్న ఆరోపణలు నిజం కాదని చెప్పడానికైనా ఆధారాలు చూపేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. దమ్ముంటే పవన్ బహిరంగ చర్చకు రావాలి!" అంటూ మార్కెటింగ్ శాఖ మంత్రి మోపిదేవి వెంకటరమణారావు సవాల్ విసిరారు. గుంటూరు జిల్లా తెనాలిలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం ధరల స్థిరీకరణకు రూ.4 వేల కోట్లు ఏర్పాటు చేశామని ప్రకటించి, రూ.4 కూడా ఖర్చు చేయలేదన్నారు. ఆ సమయంలో పవన్‌కు రైతులపై ప్రేమ ఎందుకు కలుగలేదని ప్రశ్నించారు. రైతుల సమస్యలపై అసెంబ్లీ ఎదుట ధర్నాకు దిగుతానని వ్యాఖ్యానించడం సరికాదన్నారు. చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్ట్ చదివేందుకే పవన్ అలవాటు పడిపోయారని, దానిని నమ్ముకుంటే అభాసుపాలు కావటం తప్పదన్నారు.

## అటవీ భూముల్లోని పత్తి కొనుగోలుకు ఉత్తర్వులు

అమరావతి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అటవీ భూములు సాగు చేస్తున్న గిరిజన రైతులు పండించిన పత్తిని సీసీఐ కేంద్రాల్లో అమ్ముకోవటానికి అనుమతిస్తూ మార్కెటింగ్‌శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఈ-క్రాప్‌లో పంట నమోదు చేసుకోవటానికి వీల్లేకపోవడంతో సీసీఐకి పత్తిని అమ్ముకునే అవకాశం ఉండేది కాదు.

# ఆ రద్దు ఎందుకో?

▸▸ జగన్ ఇళ్లకు సౌకర్యాల కోసమిచ్చిన ఉత్తర్వుల రద్దుపై అంతటా చర్చ

▸▸ సీఎం సొంత భవనాలకు నిధులపై జాతీయస్థాయిలోనే తీవ్ర విమర్శలు

▸▸ రద్దుకు కారణం చెప్పని ప్రభుత్వం

అమరావతి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్ సొంత ఇళ్లు, క్యాంప్ ఆఫీసుల్లో అదనపు సదుపాయాలు కల్పించాలన్న నిర్ణయంపై సర్కారు వెనక్కు తగ్గడం సర్వత్రా చర్చనీయాంశమైంది. కొన్ని పనులను రద్దుచేస్తూ ప్రభుత్వం శుక్రవారం రాత్రి పొద్దుపోయాక ఉత్తర్వులు ఇచ్చింది. ఇందులో అల్యూమినియం కిటికీలు, తలుపుల ఏర్పాటుతోపాటు కొత్త ఫర్నిచర్ కొనుగోలు వంటివి కూడా ఉన్నాయి. సీఎంవో నుంచి ఆర్‌అండ్‌బీకి వచ్చిన ఆదేశాల మేరకే ఈ విభాగం తాజా నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. రద్దయిన పనుల విలువ రూ.2.87 కోట్లుగా తేల్చారు.

జగన్ ముఖ్యమంత్రి అయ్యాక తాడేపల్లితోపాటు హైదరాబాద్ లోటస్‌పాండ్‌లోని ఆయన నివాసానికి మౌలిక సదుపాయాలు, రక్షణ చర్యల నిమిత్తం గత నెల 26 నాటికి వివిధ పనుల కోసం పలు పద్దుల కింద రూ.16.50 కోట్లపైనే కేటాయించారు. తాడేపల్లిలోని జగన్ నివాసం కొత్తది. ఎన్నికల ఫలితాలు వెలువడటానికి ముందే గృహప్రవేశం చేశారు. రహదారి విస్తరణ, అభివృద్ధి, పక్కన ఉన్న భూమి సేకరణ, రక్షణ చర్యలు, సీసీటీవీల ఏర్పాటు, ఇతర అనేక సదుపాయాలు కల్పించేందుకు భారీగా నిధులు కేటాయించారు. అక్టోబరులో ఆ ఇంటికి కొత్తగా అల్యూమినియం కిటికీలు, తలుపులు ఏర్పాటు చేసేందుకు రూ.73 లక్షలు కేటాయించారు. దీనిపై అప్పట్లో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. జాతీయస్థాయిలో దీనిపై చర్చ జరిగింది. ఆ తర్వాత అదే నివాసానికి కొత్త ఫర్నిచర్ కొనుగోలుకు రూ.39లక్షలు, వార్షిక నిర్వహణకు రూ. 1.20 కోట్లు కేటాయించారు. లోటస్‌పాండ్‌లోని నివాసంలో అదనపు సదుపాయాలకోసం మరో రూ.24.50 లక్షలు కేటాయించారు. ఈ కేటాయింపులపైనా జాతీయస్థాయిలో చర్చ జరిగింది. సీఎం నివాసం, క్యాంపు ఆఫీసుల్లో సదుపాయాల కోసం కేటాయించిన నిధులతో సకల వసతులతో కూడిన కొత్త భవనం నిర్మించవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ వరుస కేటాయింపులపై జాతీయ మీడియాలోనూ కథనాలు వచ్చాయి. అప్పులు తెచ్చి ఉద్యోగులకు జీతాలు ఇస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో, సీఎం ఇళ్లు, క్యాంప్ ఆఫీసుల కోసం కోట్ల రూపాయలు ఎలా కేటాయిస్తున్నారన్న విమర్శలు వచ్చాయి. ఈ పరిణామాల నేపథ్యంలో జగన్ అనూహ్యంగా దీనిపై నిర్ణయాలు తీసుకున్నారు. అల్యూమినియం కిటికీలు, కొత్త ఫర్నీచర్‌తో పాటు అదనంగా ప్రతిపాదించిన పనులను రద్దుచేయాలని ఆయన ఆర్‌అండ్‌బీకి సూచించినట్లు తెలిసింది. ఆ వెంటనే ఆర్‌అండ్‌బీ విభాగం చీఫ్ ఇంజనీర్‌తో ఆరు పనులను రద్దుచేయాలని కోరుతూ శుక్రవారమే ప్రతిపాదనలు పెట్టించారు. అదేరోజు రాత్రి పొద్దుపోయాక ఆ పనుల జీవోలను రద్దుచేస్తూ ఆర్‌అండ్‌బీ ముఖ్యకార్యదర్శి కృష్ణబాబు వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, ఏ ఒక్క ఉత్తర్వులోనూ ప్రతిపాదిత జీవోలను ఎందుకు రద్దుచేస్తున్నారో పేర్కొనలేదు. ఇందుకు కారణాలు తమకు తెలియవని ఉన్నతాధికారులు 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు.

### రద్దయిన జీవోలివే..

- **జీవో 259:** తాడేపల్లిలోని సీఎం ఇళ్లు, క్యాంపు ఆఫీసుకోసం అల్యూమినియం కిటికీలు, తలుపులు ఏర్పాటు చేయాలని అక్టోబరు 15న ఇచ్చిన జీవో.
- **జీవో 308:** తాడేపల్లి నివాసానికి రూ. 39 లక్షలతో ఫర్నీచర్ కొనుగోలు చేయాలని నవంబరు 25న జారీ చేసిన జీవో.
- **జీవో 307:** తాడేపల్లిలోని ఇళ్లు, క్యాంపు ఆఫీసు వార్షిక నిర్వహణకు రూ. 1.2 కోట్లు కేటాయిస్తూ ఇచ్చిన జీవో.
- **జీవో 254:** తాడేపల్లిలోని ఎయిర్‌కూలర్లు, ఇతర సదుపాయాలను సమకూర్చేందుకు నవంబరు 4న జారీ చేసిన జీవో..
- **జీవో 160:** లోటస్‌పాండ్ నివాసంలో రూ. 24.50 లక్షలతో అదనపు సదుపాయాలు, రక్షణ చర్యలను చేపట్టేందుకు జారీచేసిన జీవో..
- **జీవో 327:** తాడేపల్లి నివాసంలో రూ. 8.50 లక్షల వ్యయంతో విద్యుత్ వ్యవస్థను 24 గంటలపాటు పర్యవేక్షించేందుకు జూలై 9న ఇచ్చిన జీవో.

ఆంధ్రజ్యోతి

# నేరము-శిక్ష

10 విజయవాడ ● ఆదివారం 8 డిసెంబరు 2019



## ఉన్నావ్‌లో మూడేళ్ల బాలికపై అత్యాచార యత్నం

ఉన్నావ్, డిసెంబరు 7: ఉన్నావ్‌లో మరో దారుణం.. మూడేళ్ల బాలికపై ఓ బాలుడు అత్యాచార యత్నం చేశాడు. ఇంటి సమీపంలో ఆడుకుంటున్న బాలికను ఎత్తుకెళ్లి, పొలంలో దారుణానికి తెగబడ్డాడు. బాలిక ఏడుస్తూ కేకలు వేయడంతో చుట్టుపక్కల ప్రజలు నిందితుడిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. కాగా, 2017లో ఉన్నావ్‌లోనే ఉద్యోగం ఇప్పిస్తామని ఓ యువతిపై బీజేపీ ఎమ్మెల్యే కుల్దీప్ సెంగార్ అత్యాచారం జరిపాడు. 2018లో మరో యువతిని ఇద్దరు రేప్ చేశారు. బెయిలుపై బయటకు వచ్చి, మరో ముగ్గురితో ఇటీవలే బాధితురాలిపై కిరోసిన్ పోసి నిప్పంటించారు. ఆమె శుక్రవారం అర్ధరాత్రి చనిపోయింది.

## 2017లో అత్యాచార కేసులు



**1,28,000**

దేశంలో 2017 చివరి నాటికి కోర్టుల విచారణలో ఉన్న రేప్ కేసుల సంఖ్య. ఆ ఏడాది 18,300 కేసులు మాత్రమే పరిష్కారమయ్యాయి.



**32,500**

*2017లో నమోదైన అత్యాచార కేసుల సంఖ్య. అంటే ఆ ఏడాది దేశవ్యాప్తంగా సగటున రోజుకు 90 మంది మహిళలు అత్యాచారానికి గురైనట్టు లెక్క.*









**11 ఏళ్లలో కేసులు**

2006-17 మధ్య నమోదైన అత్యాచారాలు




## రేప్‌ల రాజధాని

**86**

గత 11 నెలల కాలంలో ఉన్నావ్ జిల్లాలో నమోదైన అత్యాచార కేసుల సంఖ్య.

# ‘ఆమె’ మరణించింది

## ఉన్నావ్ బాధితురాలి కన్నుమూత.. 40 గంటలపాటు మృత్యువుతో పోరాటం

- శుక్రవారం రాత్రి 11.40 గంటలకు తుదిశ్వాస
- బాధిత కుటుంబానికి 25 లక్షలు:యూపీ సర్కారు

న్యూఢిల్లీ, డిసెంబరు 7: నిలువెల్లా కాలిన గాయాలతో 40 గంటల పాటు మృత్యువుతో పోరాడిన ‘ఆమె’ ఓడిపోయింది. ఈ దుర్మార్గుల ఆగడాలను భరించలేనంటూ ఆమె గుండె ఆగిపోయింది. భవిష్యత్తుకోసం బంగారు కలలు కన్న ఆ యువతి.. ఐదుగురు దుర్మార్గుల పైశాచికత్వానికి 23 ఏళ్లకే తనువు చాలించింది. తీవ్రమైన కాలిన గాయాలతో ఉన్నావ్ బాధిత మహిళ శుక్రవారం రాత్రి కన్నుమూసింది. రాత్రి 11.40 గంటలకు ఆమె మరణించిందని ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆస్పత్రి వైద్యులు ప్రకటించారు. ‘ఆమె పరిస్థితి శుక్రవారం రాత్రికి మరింత దిగజారింది. 11 గంటల ప్రాంతంలో కార్డియాక్ అరెస్ట్ అయింది. మా ప్రయత్నాలు విఫలమై 11.40 గంటల ప్రాంతంలో మరణించింది’ అని డాక్టర్ శలభ్‌కుమార్ ప్రకటించారు. పోస్ట్‌మార్టమ్ కోసం మృతదేహాన్ని ఫోరెన్సిక్ విభాగానికి పంపారు. ఉన్నావ్ జిల్లాలోని ఆమె స్వగ్రామానికి తరలించారు. బెయిల్ మీద వచ్చిన ఇద్దరు.. మరో ముగ్గురితో కలిసి.. న్యాయవాదిని కలిసేందుకు వెళ్తున్న ఆమెపై గురువారం తెల్లవారుజామున కిరోసిన్ పోసి నిప్పంటించిన సంగతి తెలిసిందే.ఖ



ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం ఉన్నావ్ రేప్ బాధితురాలి మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం

### ఇదీ జరిగింది..

శివం త్రివేదీ, శుభం త్రివేదీ అనే ఇద్దరు కలిసి తనపై అత్యాచారానికి పాల్పడ్డారంటూ గత ఏడాది డిసెంబరులో ఉన్నావ్‌కు చెందిన ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది.. పోలీసులు వారిద్దరినీ అరెస్టు చేశారు. గతనెల 25న నిందితులు బెయిలు మీద బయటికి వచ్చారు. అత్యాచారం కేసుపై శుక్రవారం న్యాయస్థానంలో విచారణ జరగనున్న నేపథ్యంలో.. గురువారం తెల్లవారుజామున 4.30 గంటలకు ఆ యువతి తన న్యాయవాదిని కలిసేందుకు ఉన్నావ్‌లోని తన ఇంటి నుంచి రాయబరేలీకి బయలుదేరింది. దారిలో ఆమెను శివంత్రివేదీ, శుభం, త్రివేదీ, హరిశంకర్ త్రివేదీ, రామ్‌శంకర్ త్రివేదీ, ఉమేశ్ బాజ్‌పాయ్ అనే వ్యక్తులు అడ్డుకున్నారు. కిరోసిన్‌పోసి నిప్పంటించారు. అటువంటి పరిస్థితుల్లోనూ ఆమె 112కు కాల్ చేసింది. స్థానికులు కూడా పోలీసులకు సమాచారమిచ్చారు. అక్కడకు వచ్చిన పోలీసులు ఆమెను ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఎయిర్ అంబులెన్స్‌లో ఢిల్లీకి తరలించారు. తనపై దాడి చేసినవారి పేర్లు ఆమె చెప్పడంతో వారిని పోలీసులు అరెస్టు చేశారు.

### దహనం చేయడానికి ఏం మిగిలిందని?

**ఉన్నావ్ బాధితురాలి సోదరుడి ఆవేదన**

బతికించాలని వేడుకున్న సోదరిని కాపాడుకోలేకపోయామని బాధితురాలి సోదరుడు కన్నీరు మున్నీరయ్యాడు. “ అన్నా.. నన్ను కాపాడు. నాకు బతకాలని ఉంది. ” అని ఆమె కోరిందని, ఆమె కోరిక తీర్చలేకపోయామని ఆవేదన చెందాడు. . ఆమెను దారుణంగా చంపేసిన వారికి బతికే హక్కులేదని వారిని వెంటనే ఉరితీయాలని లేదా ఎన్‌కౌంటర్ చేయాలని అతడు డిమాండ్ చేశాడు. అప్పుడే తన సోదరి ఆత్మకు శాంతి చేకూరుతుందన్నాడు. తన సోదరి మృతదేహాన్ని దహనం చేయడానికి ఏం మిగిలిందని అతడు వాపోయాడు. అందుకే ఆమె మృత దేహాన్ని దహనం చేయకుండా ఖననం చేయాలని నిర్ణయించుకున్నామని చెప్పాడు.

## రేపిస్టులకు మరణశిక్ష కంటే...
# కఠినమైనదేముంటుంది?

- చైల్డ్ పోర్నోగ్రఫీ పెద్ద సవాల్.. మంత్రి స్మృతీ ఇరానీ వ్యాఖ్యలు



భోపాల్, డిసెంబరు 7: మహిళలు, పిల్లలపై అత్యాచారాలకు పాల్పడినవారికి మరణశిక్ష కంటే కఠినమైనది ఏముంటుందని కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి స్మృతీ ఇరానీ అన్నారు. ‘చట్టాలను పదును దేల్చాలని చాలామంది అంటున్నారు. ఇప్పటికే పసిమొగ్గలపై అత్యాచారాలకు మరణశిక్షను చేర్చాం. న్యాయం జరిగేలా ప్రభుత్వ స్థాయిలో చేయాల్సింది చేస్తున్నాం. రేప్ కేసుల పరిష్కారానికి 1,023 ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటుచేస్తున్నాం. అత్యాచారాలకు పాల్పడ్డ దాదాపు ఏడు లక్షల మంది డేటాను క్రోడీకరిస్తున్నాం. మళ్లీ వారు తప్పులు చేస్తే క్షణాల మీద న్యాయదేవత ముందు నిలబెట్టడానికి, దర్యాప్తు చేయడానికి ఇది ఉపకరిస్తుంది’ అని ఆమె ఓ కార్యక్రమంలో అన్నారు. ‘మహిళను ఎలా చూడాలో పిల్లలకు నేర్పాల్సినది తలిదండ్రులే. మహిళకు గౌరవం కుటుంబం నుంచే మొదలవ్వాలి. సమాజానికి ఎదురవుతున్న మరో సవాలు పిల్లలతో అశ్లీల లైంగిక చిత్రాలు తీయడం. మహిళలపై లైంగిక దాడులు, వారిని హింసించడం తేలిగ్గా తీసుకోరాదు.. దీనికి కొనసాగింపుగానే చైల్డ్ పోర్నోగ్రఫీని కూడా అరికట్టాలి” అని ఆమె అన్నారు.

## ‘ఉన్నావ్’ నిందితులను ఉరి తీయాలి

- సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించాలి: మాయావతి
- యోగి ప్రభుత్వాన్ని రద్దు చేయాలి: అఖిలేశ్
- దుండగులది హద్దుల్లేని క్రూరత్వం: మమత
- ప్రతి భారతీయుడు సిగ్గుపడాలి: కేజ్రీవాల్

లఖ్‌నవ్, డిసెంబరు 7: ఉన్నావ్ అత్యాచార బాధితురాలి హత్యతో అన్ని రాజకీయ పార్టీల నేతలు తీవ్రంగా స్పందించారు. హత్య చేసిన మానవ మృగాలను ఉరి తీయాలని డిమాండ్ చేశారు. మహిళలపై జరుగుతున్న దాడులపై సుప్రీంకోర్టు సుమోటోగా స్పందించాలని, తగిన చర్యలు తీసుకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించాలని బీఎస్పీ అధినేత్రి మాయావతి విజ్ఞప్తి చేశారు. నిందితులను నిర్ణీత కాలంలోనే ఉరి తీయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆమె గవర్నర్ ఆనందీబెన్ పటేల్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కాగా హత్యను నిరసిస్తూ సమాజ్‌వాది పార్టీ అధినేత, యూపీ మాజీ సీఎం అఖిలేశ్‌యాదవ్ శనివారం అసెంబ్లీ ఎదుట ధర్నా చేపట్టారు. మహిళలకు రక్షణ కల్పించలేని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బాధితురాలిపై కిరోసిన్ పోసి నిప్పంటించిన దుండగులది హద్దుల్లేని క్రూరత్వమని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. కాగా ఉన్నావ్ బాధితురాలి హత్య ప్రతి భారతీయుడు సిగ్గుపడాల్సిన విషయమని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఇదిలా ఉండగా.. నిందితులను నెల రోజుల్లోగా ఉరి తీయాలని ఢిల్లీ మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ స్వాతి మలివాల్ అన్నారు. యూపీ సర్కారు, పోలీసుల నిర్లక్ష్యం వల్లే బాధితురాలి హత్యకు గురైందని సీపీఎం నేత బృందా కరత్ ఆరోపించారు. మరోవైపు హైదరాబాద్‌లో దిశ నిందితులను ఎన్‌కౌంటర్ చేసినట్లుగానే ఉన్నావ్ నిందితులను కూడా చేయాలని పలువురు నెటిజన్లు డిమాండ్ చేశారు.

## అత్యాచారాల రాజధానిగా భారత్

- మన ఆడబిడ్డలను కాపాడుకోలేకపోతున్నాం
- హింసను నమ్మే వ్యక్తి దేశాన్ని నడుపుతున్నారు
- ప్రధాని నోరెందుకు విప్పడం లేదు?: రాహుల్

వయనాడ్, డిసెంబరు 7: దేశంలో చోటుచేసుకుంటున్న అత్యాచార ఘటనలపై కాంగ్రెస్ నేత, ఎంపీ రాహుల్‌గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. భారత్.. అత్యాచారాల రాజధానిగా మారిందని, ఆడబిడ్డలను ఎందుకు కాపాడుకోలేకపోతున్నారంటూ ఇతర దేశాలు ప్రశ్నిస్తున్నాయని అన్నారు. తెలంగాణలో హత్యాచార నిందితుల ఎన్‌కౌంటర్, ఉన్నావ్ అత్యాచార బాధితురాలి మృతి నేపథ్యంలో శనివారం రాహుల్ వయనాడ్‌లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో స్పందించారు. దేశం మరో ఆడబిడ్డను కోల్పోయిందని, దేశంలో హింసను, ప్రత్యేకించి మహిళలపై దాడులను అరికట్టడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రేప్ కేసులో బీజేపీ ఎమ్మెల్యే ప్రమేయం ఉన్నా.. ప్రధాని నోరు విప్పడంలేదని విమర్శించారు. ప్రతిరోజూ ఏదో ఒకచోట అమ్మాయిలు రేప్‌కు, లైంగిక దాడులకు గురవుతూనే ఉన్నారని, మైనారిటీలు, దళితుల పట్ల హింస కూడా పెరిగిపోతోందని అన్నారు. హింసను, వివేచన లేని అధికారాలను బలంగా నమ్మే వ్యక్తి దేశాన్ని నడుపుతుండటం వల్లే ఇవి చోటుచేసుకుంటున్నాయంటూ పరోక్షంగా ప్రధాని మోదీనుద్దేశించి రాహుల్ వ్యాఖ్యానించారు.



ఉన్నావ్ బాధితురాలి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ప్రియాంకగాంధీ

### మహిళలకే చోటు లేకుండా పోయింది: ప్రియాంక

**ఉన్నావ్:** ఉత్తరప్రదేశ్‌లో నేరగాళ్లకు స్థానం లేదని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ చెబుతుంటారని, కానీ.. మహిళలకే రాష్ట్రంలో చోటు లేకుండా పోయిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక వాద్రా అన్నారు. శనివారం ఆమె ఉన్నావ్ మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## రేప్ జరిగినప్పుడు చూద్దాం!

- మహిళ పట్ల ఉన్నావ్ పోలీసుల నిర్లక్ష్యం
- ఫిర్యాదు స్వీకరించని సిబ్బంది

ఉన్నావ్(యూపీ), డిసెంబరు 7: ఉన్నావ్ అత్యాచార బాధితురాలిని తగలబెట్టి 36 గంటలు గడిచాయో.. లేదో.. మరో బాధిత మహిళ పట్ల పోలీసులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారు. తనపై అత్యాచార యత్నం చేయబోయారంటూ ఫిర్యాదు చేయడానికి వచ్చిన ఆమెను ఎగతాళి చేశారు. ‘ఇప్పుడు రేప్ జరగలేదుగా? అత్యాచారం జరిగిన తర్వాత రా.. చూద్దాం’ అంటూ పంపేశారు. ఐదు నెలల క్రితం మందులు కొనడానికి వెళ్తుండగా ఐదుగురు అత్యాచారం చేయబోయారని, వారిలో ముగ్గురిని గుర్తించానంటూ పేర్లు బయటపెట్టింది. ‘ఆ ఘటన అనంతరం 1090కి ఫోన్ చేశా. వాళ్లు 100కి కాల్ చేయమన్నారు. ఆ నంబరుకి ఫోన్ చేశా. ఉన్నావ్‌లో పోలీసుల దృష్టికి తీసుకెళ్లా. ఘటన ఎక్కడ జరిగిందో అక్కడే ఫిర్యాదు చేయమని చెప్పారు. మూడు నెలలుగా అక్కడికి, ఇక్కడికి తిరుగుతూనే ఉన్నాను’ అని బాధితురాలు పేర్కొంది. నిందితులు తనను చంపుతామంటూ బెదిరించారని తెలిపింది. ఉత్తరప్రదేశ్ ఉన్నావ్ జిల్లా సిందుపూర్ గ్రామంలో ఈ ఘటన జరిగింది. ఇదే గ్రామం లో ఉన్నావ్ అత్యాచార బాధితురాలిని తగులబెట్టారు.

## ఆ క్షమాభిక్ష పిటిషన్ నాది కాదు

- ఉపసంహరణకు అవకాశం ఇవ్వండి
- రాష్ట్రపతికి ‘నిర్భయ’ కేసు నిందితుడు వినయ్‌శర్మ లేఖ

న్యూఢిల్లీ, డిసెంబరు 7: ‘నిర్భయ’ కేసు నిందితుల్లో ఒకడైన వినయ్‌శర్మ దాఖలు చేసిన క్షమాభిక్ష పిటిషన్‌లో ఊహించని మలుపు. అసలు తాను పిటిషన్‌పై సంతకమే చేయలేదని.. ప్రస్తుతం ఉన్నదానిని వెంటనే ఉపసంహరించుకునే అవకాశం ఇవ్వాలని అతడు అభ్యర్థించాడు. ఈ మేరకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు లేఖ రాశాడు. కేంద్ర హోంశాఖ రాష్ట్రపతికి పంపిన క్షమాభిక్ష పిటిషన్‌లో తన సంతకం లేదనీ.. అది తాను పెట్టుకున్న అర్జీ కాదని స్పష్టం చేశాడు. కాగా, క్షమాభిక్షను తిరస్కరిస్తూ ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం పంపిన సిఫారసును హోంశాఖ ఆమోదించి రాష్ట్రపతికి పంపింది.



*ముంబైలో పెట్రోలింగ్ పోలీసు సిబ్బందిని శుక్రవారం రాత్రి బాలీవుడ్ నటి రాణీ ముఖర్జీ కలిశారు. మహిళల భద్రతపై విలేకరులతో మాట్లాడారు. ‘అప్రమత్తతతోనే నేరాలను ఆపగలం. రాత్రింబవళ్లు మనల్ని కాపాడుతున్న పోలీసు సిబ్బందికి సెల్యూట్. వారి పాత్రను మర్దానీ-2 చిత్రం ద్వారా ప్రజలకు తెలియజేస్తా’ అని చెప్పారు.*

## బాధిత కుటుంబానికి 25 లక్షలు

**ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు ‘ఉన్నావ్’ కేసు: యోగి**

ఉన్నావ్ అత్యాచార బాధితురాలి కుటుంబానికి యూపీ ప్రభుత్వం రూ.25 లక్షల ఆర్థికసాయం ప్రకటించింది. వారికి ఓ ఇంటినికూడా కేటాయిస్తామని, ఇతర సదుపాయాలను కూడా కల్పిస్తామని వెల్లడించింది.కాగా, ఉన్నావ్ అత్యాచార బాధితురాలి మృతి పట్ల ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి సీఎం యోగి ఆదిత్యనాథ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. నిందితులందరినీ అరెస్టు చేశామని, కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు అప్పగించి.. వారికి త్వరగా శిక్ష పడేలా చేస్తామని ఆయన పేర్కొన్నారు.

## ఆర్థికసాయం వద్దు.. వారిని చంపేయండి

‘నా కుమార్తె మృతికి కారణమైన దోషులను హైదరాబాద్ ఎన్‌కౌంటర్ తరహాలో చంపేయాలి. లేక వెంటనే ఉరి తీయాలి. అదే నాకు ఓదార్పు. నాకు ఎటువంటి ఆర్థిక సాయం అవసరం లేదు.

*- ఉన్నావ్ బాధితురాలి తండ్రి*

# వాళ్లనూ చంపేయండి!

- హత్యాచార కేసుల్లో పెరుగుతున్న ఆగ్రహం
- ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూర్, సిర్పూర్, లింగాపూర్ మండలాల్లో స్వచ్ఛంద బంద్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

‘దిశ’ నిందితుల ఎన్‌కౌంటర్ కొత్త మలుపు తిరిగింది! ఇతర హత్యాచార కేసుల్లోనూ నిందితులను కాల్చి చంపాలనే డిమాండ్ పెరుగుతోంది. ఒక్క తెలంగాణలోనే కాదు.. దేశవ్యాప్తంగా నిందితులను ఎన్‌కౌంటర్ చేయాలని బాధితులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోని ఆసిఫాబాద్, హాజీపూర్, వరంగల్ తోపాటు యూపీలోని ఉన్నావ్‌లోనూ ‘తక్షణ న్యాయా’నికి బాధితులు డిమాండ్ చేస్తున్నారు. ‘దిశ’ హత్యాచార నిందితుల ఎన్‌కౌంటర్ నేపథ్యంలో ఆసిఫాబాద్ జిల్లాలో దళిత మహిళపై హత్యాచారానికి పాల్పడ్డ వారిని కూడా ఎన్‌కౌంటర్ చేయాలనే డిమాండ్ ఉధృతమైంది. శనివారం జైనూరు, సిర్పూర్ (యూ), లింగాపూర్ మండలాల్లో ప్రజలు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. రోడ్లపైకి వచ్చి ర్యాలీలు, రాస్తారోకోలు చేపట్టారు. వేలాది మంది రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. జైనూరులో చేపట్టిన రాస్తారోకోతో ఆసిఫాబాద్-ఆదిలాబాద్ ప్రధాన రహదారిపై వాహనాలు మూడు గంటలపాటు నిలిచిపోయాయి. నిందితులను ఎన్‌కౌంటర్ చేస్తామని ఎస్పీ మల్లారెడ్డి వచ్చి హామీ ఇస్తేనే దీక్ష విరమిస్తామని స్పష్టం చేశారు. డీఎస్పీ సత్యనారాయణ వచ్చి.. నిందితులకు శిక్ష పడేలా చూస్తామని హామీ ఇచ్చి విరమింపజేశారు. తమకూ న్యాయం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా హాజీపూర్‌లో బాధితుల కుటుంబ సభ్యులు, గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ముగ్గురు విద్యార్థినులపై లైంగిక దాడి, హత్యలకు పాల్పడి మృతదేహాలను బావిలో పూడ్చిన నిందితుడు సైకో శ్రీనివాస్‌రెడ్డిని శిక్షించడంలో జాప్యం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. గ్రామస్థులతోపాటు బాధిత కుటుంబాలు శనివారం పంచాయతీ వద్ద సమావేశమయ్యారు. 8నెలలుగా సైకో కిల్లర్‌ను జైల్లో పెట్టి పోషిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



### ప్రవీణ్‌ను ఉరి తీస్తే సంతోషించేవాళ్లం: శ్రీహిత తల్లిదండ్రులు

తొమ్మిది నెలల తన కుమార్తెను అత్యాచారం, హత్య చేసిన నిందితుడిని కూడా ఎన్‌కౌంటర్ చేస్తే బాగుండేదని, కోర్టులో పడిన ఉరిశిక్ష అమలు జరిగినా పాప ఆత్మ శాంతించేదని చిన్నారి శ్రీహిత తండ్రి జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. దిశ నిందితులను ఎన్‌కౌంటర్ చేసినట్టు తమ కుమార్తెను చిదిమేసిన వాడిని కూడా చంపేస్తే బాగుండేదని అన్నారు. ఘటన జరిగిన 52 రోజులకు నిందితుడు పోలెపాక ప్రవీణ్‌కు జిల్లా కోర్టు ఉరిశిక్ష విధిస్తూ తీర్పునివ్వడంతో చాలా సంతోషించామని, కొద్ది రోజులకే హైకోర్టు మరణ శిక్షను జీవిత కారాగార శిక్షగా తీర్పు వెల్లడించడం తమ మనసును కలిచివేసిందని అన్నారు. మహిళలపై హత్యలు, అత్యాచారాలు ఎక్కడ జరిగినా వెంటనే ఎన్‌కౌంటర్ చేసే బిల్లును రానున్న పార్లమెంట్ సమావేశాల్లో పెట్టాలని కోరారు. ‘దిశ’ ఘటనకు ముందు రోజు హన్మకొండకు చెందిన యువతిపై అత్యాచారం, హత్య చేశారు. ఆ నిందితుడిని కూడా ఎన్‌కౌంటర్ చేస్తే బాగుండేదని బాధితులు కోరుతున్నారు. దోషులను శిక్షించి న్యాయం చేయాలని బాధితురాలి తల్లి హన్మకొండ బాల సముద్రంలోని ఏకశిలా పార్కులో 2రోజులు దీక్ష చేశారు.

### దేశవ్యాప్తంగా...

అత్యాచారం, హత్య కేసుల్లో బాధితులకు తక్షణ న్యాయం చేయాలనే డిమాండ్లు దేశవ్యాప్తంగా వస్తున్నాయి. కొన్నిచోట్ల నిందితులపై దాడులు కూడా చేస్తున్నారు. “నా కుమార్తె మృతికి కారణమైన దోషులను హైదరాబాద్ ఎన్‌కౌంటర్ తరహాలో చంపేయాలి. లేదా, వెంటనే ఉరి తీయాలి. అదే నాకు ఓదార్పు” అని ఉన్నావ్ బాధితురాలి తండ్రి అన్నారు. తనకు ఎటువంటి ఆర్థిక సాయం అవసరం లేదని నిందితుల మరణమే తనకు ఓదార్పని వ్యాఖ్యానించారు. ఆమెను దారుణంగా చంపేసిన వారికి బతికే హక్కు లేదని, వారిని వెంటనే ఉరితీయాలని లేదా ఎన్‌కౌంటర్ చేయాలని బాధితురాలి సోదరుడు డిమాండ్ చేశాడు. మధ్యప్రదేశ్‌లో బాలికపై అత్యాచారం చేసిన నిందితుడిని ఇండోర్ కోర్టు ప్రాంగణంలోనే న్యాయవాదులు చితకబాదారు.

## అత్యాచారాలు ఆగవా.. ఆపరా.!

- కేరళలో మంచి నీళ్లు అడిగి అత్యాచారం
- బెంగాల్‌లో ఆరేళ్ల బాలికపై గ్యాంగ్ రేప్!
- బిహార్‌లో ఐదేళ్ల బాలికపై ఆటోడ్రైవర్
- మధ్యప్రదేశ్‌లో ఉపాధ్యాయురాలిపై..
- యూపీలో 14 ఏళ్ల బాలికపై గ్యాంగ్ రేప్

న్యూఢిల్లీ, డిసెంబరు 7: దిశ ఘటనతో అత్యాచారాలు, శిక్షలపై దాదాపు ప్రతి ఇంటిలో చర్చ జరిగింది. అయినా అకృత్యాలు ఆగడం లేదు. గురువారం నుంచి శనివారం మధ్యలో వేర్వేరు రాష్ట్రాల్లో, ఐదేళ్ల బాలిక నుంచి ఉపాధ్యాయురాలి దాకా అత్యాచారానికి గురయ్యారు. కేరళలోని కంజిరపల్లిలో గురువారం ఓ బాలిక (12) ఒంటరిగా ఉండగా ఇంటికి వెళ్లిన యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. మొబైల్ ఫోన్ ఆధారంగా పోలీసులు శనివారం అతడిని అరెస్టు చేశారు. పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతా గార్డెన్ రీచ్ ప్రాంతంలో ఆరేళ్ల చిన్నారిని కమ్యూనిటీ హాల్ బాత్‌రూంలో బంధించి కొందరు అత్యాచారం జరిపారు. వీరిలో ఒక నిందితుడిని పట్టుకొన్నారు. శుక్రవారం రాత్రి బిహార్‌లోని ఖరువా మోరె ప్రాంతంలో ఐదేళ్ల బాలికపై ఆటోడ్రైవర్ అత్యాచారం జరిపాడు. మధ్యప్రదేశ్‌లోని సిధీ జిల్లాలో గురువారం ఓ స్కూల్ టీచర్ ఇంటికి వస్తుండగా నలుగురు ఘాతుకానికి పాల్పడ్డారు. దిమో జిల్లాలో కొందరు లైంగికంగా వేధించడంతో యువతి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. యూపీలోని బులంద్‌షహర్‌లో బాలిక (14)పై బం. ధువులు నలుగురు రేప్‌నకు పాల్పడి వీడియో తీసి ఆన్‌లైన్‌లో పెట్టారు. మహారాష్ట్రలోని హింగోలీ జిల్లాలో గత జిల్లాలో బాలిక (13)ను కిడ్నాప్ చేసి లైంగికంగా వేధిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. బాలికను శనివారం విడిపించారు.

## అది నేరం కాదు

**పెళ్లికాని జంట హోటల్ గదిలో ఉండటంపై హైకోర్టు**



చెన్నై, డిసెంబరు 7: పెళ్లి కాని జంట హోటల్ గదిలో ఉండటం నేరం కాదని మద్రాసు హైకోర్టు స్పష్టం చేసింది. దాన్ని నేరమనే చట్టాలేమీ లేవని పేర్కొంది. కోయంబత్తూరులోని హైర్ సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో నిర్వహిస్తున్న హోటల్ గదుల్లో పోలీసు, రెవెన్యూ బృందాలు ఈ ఏడాది జూన్ 25న సోదాలు నిర్వహించాయి. ఓ గదిలో పెళ్లికాని జంట, మద్యం బాటిళ్లు కనిపించడంతో ఆ అపార్ట్‌మెంటుకు సీలు వేశారు. దీన్ని సవాలు చేస్తూ నిర్వాహకులు దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయమూర్తి జస్టిస్ ఎంఎస్ రమేశ్ విచారించారు. సీలు వేయడం అక్రమమని, 'సామాన్య న్యాయం' సూత్రాలను పూర్తిగా ఉల్లంఘించడమేనని న్యాయమూర్తి పేర్కొన్నారు.



## సామాన్యుడికి అందనంత దూరంలో న్యాయం

- **నిరుపేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించడానికి ఇంకా ఎంతో చేయాలి: రాష్ట్రపతి కోవింద్**

జోధ్‌పూర్, డిసెంబరు 7: న్యాయ ప్రక్రియ చాలా ఖరీదైన వ్యవహారంగా మారిపోయిందని, సామాన్యుడికి అందనంత దూరంలో ఉందని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు చాలా కారణాలు ఉన్నాయని, మరీ ముఖ్యంగా, హైకోర్టు, సుప్రీం కోర్టులకు సామాన్య కక్షిదారులు వెళ్లలేకపోతున్నారని చెప్పారు. రాజస్థాన్‌లో కొత్తగా నిర్మించిన హైకోర్టు భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. జోధ్‌పూర్ ఎయిమ్స్ రెండో స్నాతకోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "నిరుపేదలు కానీ నిర్భాగ్యులు కానీ తమ ఫిర్యాదు పట్టుకుని ఈరోజు ఇక్కడకు (హైకోర్టు) రాగలుగుతున్నారా!? ఇది చాలా ముఖ్యమైన ప్రశ్న. ఎందుకంటే, అందరికీ న్యాయం అందాలని మనం రాజ్యాంగ పీఠికలోనే రాసుకున్నాం" అని వివరించారు. న్యాయ ప్రక్రియకు చేయాల్సిన ఖర్చుపై గతంలో మహాత్మ గాంధీ కూడా ఆవేదన వ్యక్తం చేశారని గుర్తు చేశారు. దరిద్ర నారాయణుల సంక్షేమమే మనకు ఎల్లప్పుడూ పరమ ధర్మం కావాలని ఉద్బోధించారని వివరించారు. నిరుపేదలు, బలహీనుల ముఖం చూసినప్పుడు మనకు సరైన మార్గం కనిపిస్తుందంటూ గాంధీజీ చెప్పిన సూక్తిని ఉటంకించారు. దానిని గమనంలో ఉంచుకోవాలని సూచించారు. ఇందుకు ఒక మార్గం ఉచితంగా న్యాయ సహాయాన్ని అందించడమని వివరించారు. సుప్రీం కోర్టు తన తీర్పులను తొమ్మిది ప్రాంతీయ భాషల్లో అందుబాటులో ఉంచుతోందంటూ సంతోషం వ్యక్తం చేశారు. న్యాయ శాఖలో సమాచార సాంకేతికత ఎన్నో అద్భుత ఫలితాలను తీసుకొచ్చిందన్నారు. ఆరోగ్యం సహా ఎన్నో రంగాల్లో దేశం ముందడుగు వేసిందని, అయినా, పౌరులందరికీ మరీ ముఖ్యంగా నిరుపేదలు, మారుమూల ప్రాంతాల్లో ఉండేవారికి నాణ్యమైన విద్య, వైద్యం అందించడానికి ఇంకా ఎంతో చేయాల్సి ఉందని చెప్పారు. వృత్తి పట్ల మక్కువతో, నైపుణ్యాలను పెంచుకుని ప్రజల జీవన కాలాన్ని పెంచాలని డాక్టర్లు, విద్యార్థులకు ఉద్బోధించారు. జీవితంలో విజయం సాధించడానికి సత్యం, ప్రేమ, నిబద్ధతలను పాటించాలని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హర్షవర్ధన్ సూచించారు.

## మహిళ రోదిస్తోంది.. సత్వరం న్యాయం జరిగేలా చూడండి

- **సుప్రీం చీఫ్ జస్టిస్‌కు కేంద్రం అభ్యర్థన**
- **రేప్ కేసులు రెండునెలల్లోగా తేల్చెయ్యండి**
- **రాష్ట్రపతి, సీజే సమక్షంలో రవిశంకర్ ప్రసాద్**



న్యూఢిల్లీ, డిసెంబరు 7: అత్యాచార కేసుల పరిష్కారం విషయంలో న్యాయస్థానాల్లో జరుగుతున్న జాప్యంపై కేంద్రం పరోక్షంగా నిష్టురమాడింది. "ఈ దేశ మహిళ రోదిస్తోంది. సత్వర న్యాయం కోసం ఎదురుచూస్తోంది. మీరే ఆ న్యాయం చేయాలి" అని కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని అభ్యర్థించారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సమక్షంలో ఆయన ఈ విజ్ఞాపన చేశారు. "రేప్ కేసులు వెంటనే పరిష్కారమయ్యేట్లు ఓ పర్యవేక్షణ యంత్రాంగం ఉండాలి. ఫాస్ట్‌ట్రాక్ కేసుల పర్యవేక్షణ జరగాలి. ఈ యంత్రాంగానికి నిధులు సమకూర్చడానికి కేంద్రం సిద్ధంగా ఉంది" అని ఆయన రాజస్థాన్ హైకోర్టు భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో అన్నారు. "ఇప్పటికే 704 ఫాస్ట్ ట్రాక్ కోర్టులు పనిచేస్తున్నాయి. పసిమొగ్గలపై అత్యాచారాలకు సంబంధించి పోక్సో కేసుల నిమిత్తం 1,123 కోర్టుల ఏర్పాటు జరుగుతోంది. ఇందులో 400 కోర్టులకు గ్రీన్‌సిగ్నలిచ్చాం. 160 కోర్టులు పనిచేయడం మొదలెట్టాయి" అని కోరారు. "న్యాయం, ధర్మం ప్రకారమే ఈ దేశంలో అన్నీ జరుగుతాయన్న ప్రతిష్ఠను భారత్ మళ్లీ సంతరించుకునేట్లు చేయాల్సిన అవసరం ఉంది" అని పేర్కొన్నారు. "చట్టాలకు సంబంధించినంత వరకూ మేం చేయగలిగింది చేశాం. పసివారిపై పైశాచికానికి తెగబడ్డవారికి మరణ శిక్ష విధించవచ్చనీ, రెండు నెలల్లోనే తీర్పులు వెలువరించాలనీ చెప్పాం. వీటిపై కోర్టులే దృష్టిపెట్టాలి" అని ఆయన పేర్కొన్నారు. రేప్ కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేసేలా దృష్టి పెట్టండని అన్ని రాష్ట్రాల సీఎంలకు తాను లేఖలు రాస్తున్నానని చెప్పారు. రెండు నెలల్లో ఇలాంటి కేసులు పరిష్కారమయ్యేలా చూడండడని అన్ని హైకోర్టులకూ లేఖలు రాస్తానని కూడా ఆయన వెల్లడించారు. "దిగువస్థాయి కోర్టుల్లో మరింత ప్రతిభావంతులు రావాల్సిన అవసరం ఉంది. మనకు మంచి జడ్జీలున్నారు. ప్రతిభావంతులను న్యాయవ్యవస్థలోకి తీసుకొచ్చే ప్రయత్నం జరగాలి" అన్నారాయన.



### న్యాయం ప్రతీకారంగా మారరాదు

## తక్షణ న్యాయం అసాధ్యం

**హైదరాబాద్ ఎన్‌కౌంటర్ నేపథ్యంలో సీజే బోబ్డే వ్యాఖ్యలు**

"ఈ మధ్య దేశంలో జరిగిన కొన్ని సంఘటనలు పాత చర్చను కొత్త బలంతో ముందుకు తీసుకొచ్చాయి. నా దృష్టిలో తక్షణ న్యాయం అనేది అసాధ్యం. న్యాయం ఎన్నడూ ప్రతీకారంగా మారకూడదు. ఒక వేళ గనక మారితే ఆ న్యాయం తన రూపురేఖల్ని కోల్పోతుంది..."

*- జస్టిస్ శరద్ అరవింద్ బోబ్డే, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి*

జైపూర్, డిసెంబరు 7: హైదరాబాద్ హత్యాచార నిందితుల ఎన్‌కౌంటర్ దేశాన్ని కుదిపేస్తున్న వేళ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అత్యంత కీలకమైన అభిప్రాయాల్ని వ్యక్తం చేశారు. "తక్షణ న్యాయం అందివ్వడం అసాధ్యం. నేర న్యాయవ్యవస్థ తీరు మారాలి. న్యాయం ఎన్నడూ ప్రతీకార రూపు తీసుకోకూడదు. అలా తీసుకున్నట్లయితే ఆ న్యాయం తన స్వాభావిక లక్షణాల్ని కోల్పోతుంది" అని ఆయన కుండబద్దలు కొట్టారు. శనివారం ఆయన జైపూర్‌లో రాజస్థాన్ హైకోర్టు నూతన భవన ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడారు. కోర్టుల్లో న్యాయం అందడం లేదు గనకే ప్రజల నుంచి డిమాండ్లు పెరుగుతున్నాయని, తక్షణ న్యాయం కోసం వారు పోరాడుతున్నారని, న్యాయం సత్వరం అందేట్లు చూడండంటూ న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ కోరడంపై జస్టిస్ బోబ్డే తాను రాసుకున్న ప్రసంగపాఠాన్ని పక్కనపెట్టి మరీ.. స్పందించాల్సి వచ్చింది. నేర న్యాయవ్యవస్థ తన తీరును పునఃపరిశీలించుకోవాలని, ఓ క్రిమినల్ కేసును పరిష్కరించే విషయంలో అనుసరిస్తున్న వైఖరిని, తీసుకుంటున్న సమయాన్ని ఆలోచించుకోవాలని ఆయన సూచించారు. "న్యాయవ్యవస్థ తన తప్పులు సరిదిద్దుకోవాలి. ఆ పని బహిరంగపరచాలా వద్దా అనేది వేరే చర్చ. గతంలో ఓ (జడ్జీల) మీడియా సమావేశం అనేక విమర్శలకు దారి తీసింది. కానీ దిద్దుబాటుకు అది ఓ కారణమయ్యింది" అని ఆయన గుర్తుచేశారు.

## అగ్రకులాలకో న్యాయం.. అణగారిన వర్గాలకు ఓ న్యాయమా?

- **సజ్జనార్‌తో ఈ పని చేయించారు: మంద కృష్ణ**
- **ఆసిఫాబాద్ నిందితుల ఎన్‌కౌంటర్‌కు డిమాండ్**



హైదరాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హత్యాచార ఘటనల్లో అగ్రకుల బాధితులకు ఓ న్యాయం.. అణగారినవర్గాల బాధితులకు మరో న్యాయమా? అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ప్రశ్నించారు. సీపీ సజ్జనార్‌ను పొగడటం, తప్పుబట్టడం రెండూ తప్పేనన్నారు. అధికారం చేతుల్లో ఉన్న నాయకులు ఆయనతో ఈ పనులు చేయించారని వ్యాఖ్యానించారు. అణగారినవర్గాలకు చెందిన హత్యాచార బాధిత కుటుంబాలతో గవర్నర్‌ను కలిసి న్యాయం కోరతామన్నారు. ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. కాగా.. ప్రభుత్వాలు దళితులపై చిన్నచూపు తగదని అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్ అన్నారు. శనివారం ఆయన నిర్మల్ జిల్లా గోసంపల్లెలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. దళిత కుటుంబానికి కూడా దిశలాగే న్యాయం జరగాలన్నారు. ఆసిఫాబాద్ జిల్లాలో దళిత మహిళపై హత్యాచారానికి పాల్పడ్డవారిని కూడా ఎన్‌కౌంటర్ చేయాలనే డిమాండ్ ఉధృతమైంది.

### అగ్రవర్ణాలకే సత్వర న్యాయమా: కృష్ణయ్య

హైదరాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రజల ఒత్తిడితో 'దిశ' నిందితులపై పోలీసులు స్పందించిన తీరును స్వాగతిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన మహిళలపై జరిగిన హత్యాచారాల్లోనూ పోలీసులు 'సత్వర న్యాయం' చేయాలని డిమాండ్ చేశారు. "అగ్రవర్ణాల మహిళలపై దారుణాలు చేస్తే ప్రభుత్వం, పోలీసులు సత్వర న్యాయం చేస్తారా?" అని ఆయన ప్రశ్నించారు. హాజీపూర్ ఘటనలో నిందితుడు శ్రీనివాస్ రెడ్డికి ఎలాంటి శిక్ష విధించలేదని కృష్ణయ్య ఆరోపించారు.

## చటాన్‌పల్లికి ఎన్‌హెచ్‌ఆర్సీ బృందం

- **ఎన్‌కౌంటర్ స్థలాన్ని పరిశీలించిన సభ్యులు**

మహబూబ్‌నగర్, షాద్‌నగర్, డిసెంబరు 7: దిశ హత్యాచార నిందితుల ఎన్‌కౌంటర్‌పై జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్‌ఆర్సీ) బృందం విచారణను ప్రారంభించింది. నలుగురు సభ్యుల బృందం శనివారం మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రానికి చేరుకుంది. జిల్లా ప్రధాన ఆస్పత్రిలో ఆరిఫ్, శివ, నవీన్, చెన్నకేశవులు మృతదేహాలను పరిశీలించింది. అనంతరం వైద్యాధికారులు, పోస్ట్‌మార్టం నిర్వహించిన గాంధీ ఆస్పత్రి వైద్యుల బృందం, ఎస్పీతో 2గంటలపాటు సమావేశమైంది. పోస్ట్‌మార్టం నివేదికను, వీడియోలను పరిశీలించింది. ఎన్‌హెచ్‌ఆర్సీ సభ్యులు మార్చురీకి వెళ్ళి నిందితుల మృతదేహాలను పరిశీలించారు. ఎన్‌కౌంటర్ జరిగిన చటాన్‌పల్లికి వెళ్లారు. డీసీపీ ప్రకాశ్‌రెడ్డిని అడిగి, ఎన్‌కౌంటర్‌కు సంబంధించిన విషయాలను తెలుసుకున్నారు. అంతకుముందు దిశ హత్యజరిగిన తొండుపల్లి టోల్ ప్లాజా, మృతదేహాన్ని నిందితులు కాల్చివేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. డీసీపీ ప్రకాశ్‌రెడ్డి వారి పర్యటన వివరాలను మీడియాకు వెల్లడించారు. కాగా హెచ్‌ఆర్సీ సభ్యులు ఆదివారం మృతుల కుటుంబ సభ్యులతో సమావేశమయ్యే అవకాశాలున్నాయి.

### దిశపై సుప్రీంకోర్టులో రెండు వ్యాజ్యాలు

'దిశ' హత్యాచారం కేసులో నిందితుల ఎన్‌కౌంటర్‌పై సుప్రీం కోర్టులో శనివారం రెండు వ్యాజ్యాలు దాఖలయ్యాయి. దీనిపై స్వతంత్ర సంస్థతో దర్యాప్తు జరిపించాలని పిటిషనర్లు కోరారు. న్యాయవాదులు జీఎస్ మణి, ప్రదీప్ యాదవ్ కలిసి ఒక పిటిషన్, న్యాయవాది ఎంఎల్ శర్మ మరో పిటిషన్ దాఖలు చేశారు.




తొండుపల్లి టోల్ ప్లాజా వద్ద దిశ హత్యజరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎన్‌హెచ్‌ఆర్సీ బృందం

### నా భర్త ఎన్‌కౌంటర్ అన్యాయం

- ***గుడిగండ్లలో చెన్నకేశవులు భార్య రేణుక రాస్తారోకో***



*మక్తల్ టౌన్, డిసెంబరు 7: తన భర్తను పోలీసులు హతమార్చి ఎన్‌కౌంటర్ అం టున్నారని దిశ హత్యాచారం కేసు నిందితుడు చెన్నకేశవులు భార్య రేణుక వాపోయింది. శనివారం నారాయణపేట జిల్లా గుడిగండ్ల గ్రామంలో రేణుక కుటుంబ సభ్యులు, బంధువులు అంతర్ రాష్ట్ర రహదారిపై ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రేణుక, చెన్నకేశవులు తల్లి జయమ్మ బోరున విలపించారు.*

### నా బిడ్డ ఘటన తీవ్రమైనది కాదా?: దిశ తండ్రి

*శంషాబాద్, డిసెంబరు 7: హత్యాచార నిందితుల ఎన్‌కౌంటర్‌కు సంబంధించి జాతీయ మానవ హక్కుల సంఘం విచారణను స్వాగతిస్తున్నట్లు దిశ తండ్రి తెలిపారు. శనివారం ఆయన 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఎన్‌కౌంటర్‌పై కొందరు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు కదా? అని అడగ్గా.. చట్టప్రకారం ప్రతి ఒక్కరికీ పోరాడే హక్కు ఉంటుందని, ఎవరైనా జరిగిన అన్యాయాన్ని చట్టం ముందు చెప్పుకోవచ్చని అన్నారు. దిశ ఘటన తీవ్రమైన చర్య కాదా? అని హక్కుల సంఘం సభ్యులను ప్రశ్నించారు. వారు తన వద్దకు వస్తే మాట్లాడటానికి సిద్ధమని పేర్కొన్నారు.*

### నారాయణపై సీపీఐ నేతల ఆగ్రహం!

హైదరాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): 'దిశ' నిందితుల ఎన్‌కౌంటర్‌పై పోలీసుల చర్యను సమర్థించిన సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణపై పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశంలో పలువురు నేతలు ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయకుండా చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న పోలీసుల చర్యను సమర్థించడంపై తీవ్రఅసంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం. కాగా, కేంద్రంలో ఎన్డీయే పాలనలో ప్రమాదకరంగా మారిన మతోన్మాద చర్యలను ఎదుర్కొనేందుకు కలిసి వచ్చే రాజకీయ శక్తులతో లౌకిక, ప్రజాతంత్ర విశాల ఐక్య వేదికను రూపొందించాల్సిన అవసరం ఉందని పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా చెప్పారు. శనివారం ప్రారంభమైన పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశంలో జాతీయ, రాష్ట్రాల్లోని రాజకీయ పరిస్థితులపై చర్చించారు.

### ఆ నలుగురి ఎన్‌కౌంటర్ సరైందే

- **కాదు కాదు.. అది ముమ్మాటికీ తప్పే**
- **నేతలు, సెలబ్రిటీల్లో భిన్నాభిప్రాయాలు**

న్యూఢిల్లీ, చెన్నై, డిసెంబరు 7: దిశ హత్యాచారం కేసులో నలుగురు నిందితుల ఎన్‌కౌంటర్‌పై దక్షిణాదికి చెందిన పలువురు రాజకీయ నాయకులు, సెలబ్రిటీలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఈ ఎన్‌కౌంటర్‌ను గోవా మంత్రి మైఖేల్ లోబో సమర్థించారు. శివసేన కూడా ఎన్‌కౌంటర్‌ను సమర్థిస్తూ ఆ పార్టీ అధికార పత్రిక 'సామ్నా' సంపాదకీయం రాసింది. పోలీసులు చట్టప్రకారమే వ్యవహరించారని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి గోవిందకారజోళ అభిప్రాయపడ్డారు. నిందితులకు ఉరిశిక్ష విధిస్తే బాగుండేదని డీఎంకే ఎంపీ కనిమొళి అభిప్రాయపడ్డారు. ఈ ఎన్‌కౌంటర్‌ను స్వాగతిస్తున్నట్లు తమిళ నటుడు శరత్‌కుమార్ ప్రకటించగా.. పోలీసులకు కృతజ్ఞతలు చెప్పినట్లు సినీనటుడు విశాల్ పేర్కొన్నారు.



## ప్యాకేజ్డ్ ఫుడ్‌తో ఊబకాయం

- ***ప్రమాణాల్లో అట్టడుగున భారత్***
- ***ప్రమాణాల్లో అట్టడుగున భారత్***
- ***మన ప్యాకేజ్డ్ ఫుడ్‌లో కొవ్వెక్కువ***
- ***ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ అధ్యయనంలో వెల్లడి***

*న్యూఢిల్లీ, డిసెంబరు 7: క్షణం తీరిక లేకుండా.. కాలంతో పాటు పరుగులు తీస్తూ యాంత్రిక జీవనం గడుపుతున్న రోజులివి. దాంతో మనవాళ్లు ఆకలేస్తే ఇన్‌స్టంట్ న్యూడుల్స్, రెడీమేడ్ ఫుడ్ లాగించేస్తున్నారు. ఇంకా బద్ధకం అనిపిస్తే.. ప్యాకేజ్డ్ చిప్స్, ఇతర చిరుతిళ్ల వైపు మొగ్గుచూపుతున్నారు. డాక్టర్లు పళ్లరసాలు తాగాలని సలహాలిస్తే.. వాటి స్థానాన్నీ ప్యాకేజ్డ్ డ్రింక్స్‌తో భర్తీ చేసేసి "మమ" అనేస్తున్నారు. అయితే.. భారత్‌లో లభ్యమవుతున్న ప్యాకేజ్డ్ ఫుడ్, డ్రింక్స్‌లో ఆరోగ్యానికి హాని కలిగించే స్థాయిలో చక్కెర, ఉప్పు, కొవ్వు ఉన్నాయని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ జరిపిన పరిశోధనలో తేలింది. 'ఒబేసిటీ రివ్యూస్' జర్నల్‌లో ఈ అధ్యయనం ప్రచురితమైంది. 2013-18 మధ్యకాలంలో పలు దేశాల్లోని ప్యాకేజ్డ్ ఫుడ్‌పై జరిపిన అధ్యయనంలో.. నాణ్యతను పాటించే దేశాల కేటగిరీలో ఇంగ్లండ్, అమెరికా, ఆస్ట్రేలియా తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. ఆ జాబితాలో భారత్ కింది నుంచి మొదటి స్థానంలో ఉండగా.. చైనా, చిలీ ఆ తర్వాతి స్థానాలను ఆక్రమించాయి. ఆస్ట్రేలియా హెల్త్ స్టార్ రేటింగ్ సిస్టం (హెచ్‌ఎస్‌ఆర్) మేరకు జరిపిన ఈ అధ్యయనంలో.. భారత్‌లోని ప్యాకేజ్డ్ ఫుడ్‌లో ప్రతి వంద గ్రాములకు 1,515 కిలో జౌల్స్ మేర శక్తి, 7.3 గ్రాముల పంచదార, అధిక మొత్తంలో ఉప్పు, కొవ్వు ఉన్నట్లు తేలింది. తరచూ వీటిని తినేవారు ఊబకాయం బారిన ప్రమాదముందని వెల్లడైంది. ఊబకాయం సంబంధిత వ్యాధులకు భారత ప్యాకేజ్డ్ ఫుడ్ దగ్గరి దారి అని తేలింది. చైనా ర్యాంకింగ్ భారత్‌కంటే కొంత మెరుగ్గానే ఉన్నా.. ఆ దేశానికి చెందిన ప్యాకేజ్డ్ ఫుడ్ చాలా ప్రమాదకరమని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ అధ్యయనం స్పష్టం చేసింది. కాగా.. పేద దేశాల్లో లభ్యమవుతున్న ప్యాకేజ్డ్ ఫుడ్, డ్రింక్స్‌లో నాణ్యత చాలా బాగుందని.. కొవ్వు, చక్కెర, ఉప్పు స్థాయిలు తక్కువగా ఉన్నాయని ఈ అధ్యయనం గుర్తించడం గమనార్హం.*

# దాగుడు మూతల రాజకీయం

(మొదటి పేజీ తరువాయి)



ఢిల్లీలోని బీజేపీ నేత ఒకరు తెలిపారు. "కేంద్రంలో బీజేపీ పూర్తి మెజారిటీతో అధికారంలోకి రాదని, ప్రాంతీయ పార్టీల మద్దతులో కాంగ్రెస్ గద్దెనెక్కుతుందని జగన్-కేసీఆర్ నమ్మారు. జట్టు కట్టి కేంద్రంలో చక్రం తిప్పాలని భావించి, అందుకోసం పావులు కదిపారు. గత అక్టోబరులో డీఎంకే అధినేత స్టాలిన్, తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ తదితర నేతలతో వారు జరిపిన చర్చల గురించి మాకు పూర్తిగా తెలుసు. వీరిద్దరూ కొన్ని ప్రాంతీయ పార్టీలకు ఆర్థిక సహాయం కూడా అందించారు. ఇందుకు సంబంధించిన సమాచారం అంతా మా వాళ్ల వద్ద ఉంది" అని బీజేపీ ముఖ్య నేత ఒకరు తెలిపారు. "ఊహించని విధంగా మోదీ అఖండ మెజారిటీతో అధికారంలోకి రావడంతో వారు ఖిన్నులయ్యారు. మోదీని ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. కానీ, మా మోదీ- షా స్నేహానికి ప్రాణం ఇస్తారు. కానీ, నమ్మక ద్రోహం చేశారని తెలిస్తే మాత్రం ఇక క్షమించే అవకాశం ఉండనే ఉండదు" అని ఆయన వివరించారు. ఈ కారణం వల్లే ఆ సీఎంలు ఎంత ప్రయత్నించినా, కేంద్రంతో పూర్తి స్థాయి సత్సంబంధాలు నెలకొల్పుకోలేక పోతున్నట్టు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో, వారు కేంద్రాన్ని ఇరకాటంలోకి నెట్టడం ద్వారా దారిలోకి తెచ్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. బీజేపీ కూడా ఇందుకు దీటుగానే ప్రతిస్పందిస్తోంది.

### కేసులే అసలు కిటుకు..

ఏపీలో అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్, బీజేపీ నుంచి తనకు ఆశించిన సహకారం లభించడం లేదని భావిస్తున్నారు. అందుకే తన ఓటు బ్యాంకును సంఘటితం చేసుకుంటూ, అధికారాన్ని పదిలం చేసుకునే ప్రయత్నాల్లో పడ్డారు. "బీజేపీ అగ్రనేతల చిన్న చిన్న సూచనలను కూడా జగన్ పట్టించుకోవడం లేదు. అంతేకాదు; బీజేపీ- ఆరెస్సెస్ అభీష్టానికి వ్యతిరేకంగా క్రైస్తవ మత వ్యాప్తికి పూర్తిగా సహకరిస్తున్నారు. దేశంలో పెట్టుబడుల వాతావరణం దెబ్బతినే విధంగా విద్యుత్ ప్రాజెక్టుల రద్దు, పోలవరం రీటెండరింగ్ వంటి వివాదాస్పద నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఆయన పరిపాలనా శైలితో కేంద్ర ప్రభుత్వం కూడా అంతర్జాతీయంగా సమస్యలు ఎదుర్కొంటోంది. అందుకే ఆయనకు ముకుతాడు బిగించాలని అగ్రనేతలు భావిస్తున్నారు. గతంలో ఎప్పుడంటే అప్పుడు మోదీ- షాలను కలవగలిగిన జగన్‌కు ఇప్పుడు అపాయింట్‌మెంట్ దక్కకపోవడంలో మర్మం ఇదే" అని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. బీజేపీ వ్యతిరేక పార్టీలతో జగన్ సంబంధాలు నెరపుతున్నారని అగ్ర నేతలు ఆగ్రహంతో ఉన్నట్టు సమాచారం. తాజాగా జార్ఖండ్‌లో జేఎంఎం-కాంగ్రెస్ కూటమికి జగన్ ఆర్థిక సహాయం చేస్తున్నారేమోనన్న అనుమానాలు పార్టీ ముఖ్య నేతల్లో వ్యక్తమవుతున్నాయి. "ఒకవైపు మా ప్రత్యర్థి పార్టీలతో సంబంధం కొనసాగిస్తూనే, మరోవైపు మాతో స్నేహం నటించి, కేసుల విషయంలో సహాయం పొందడానికి జగన్ ప్రయత్నిస్తున్నారు. ఈ విషయం గ్రహించకపోవడానికి మేమేమీ అమాయకులం కాదు" అని బీజేపీ ముఖ్య నేత ఒకరు తెలిపారు. ఇవన్నీ తెలియడం వల్లే జగన్‌ను దూరం పెట్టాలని బీజేపీ అగ్ర నేతలు భావించారని, అందుకే కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆయనను కలుసుకునేందుకు రెండుసార్లు ఆసక్తి ప్రదర్శించలేదని వివరించారు. కేంద్రంలోని పెద్దలతో తమకు సత్సంబంధాలు ఉన్నాయని చెబుతూ విజయసాయి, ఓ అధికారి జగన్‌ను తప్పుదోవ పట్టిస్తున్నారని, కేంద్ర పెద్దల ఆలోచనా విధానాన్ని వారు పసికట్టలేకపోతున్నారని ఒక సీనియర్ నేత వ్యాఖ్యానించారు.

### సమ్మెలో కేసీఆర్‌కు ఝలక్

తెలంగాణలో ఆర్టీసీ సమ్మె విషయంలో కేసీఆర్‌ను కేంద్రమే దారికి తెచ్చిందన్న చర్చ బీజేపీ వర్గాల్లో కొనసాగుతోంది. కేంద్ర మోటారు వాహనాల చట్టం ప్రకారమే రూట్లను ప్రైవేటీకరిస్తామన్న కేసీఆర్‌కు కేంద్ర మంత్రి గడ్కరీయే సూటిగా సమాధానమిచ్చారని, ఆర్టీసీ ప్రైవేటీకరణకు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమనీ, ప్రైవేటు బస్సుల ప్రతిపాదనను పూర్తిగా పక్కనబెట్టాల్సిందేనని ఆయన స్పష్టం చేసినట్టు భోగట్టా. అందువల్లే ఆ మరుసటి రోజు జరిగిన ఆర్టీసీ కార్మికుల సమావేశంలో సీఎం వారికి పలు వరాలను ప్రకటించడమే కాదు; ప్రైవేటీకరణ ఉండబోదని పేర్కొన్నట్టు బీజేపీ వర్గాలు పేర్కొన్నాయి.

### కేంద్ర, రాష్ట్రాల వ్యూహ ప్రతివ్యూహాలు

ప్రాంతీయ పార్టీలకు ముకుతాడు వేయాలన్నది బీజేపీ ప్రవచిత విధానం. అడ్డూ అదుపు లేని సంక్షేమ పథకాలు, పంపకాలతో ప్రాంతీయ పార్టీలు సమాజాన్ని, ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్నాయని ఆ పార్టీ భావిస్తోంది. అందుకే కేంద్రం నుంచి రాష్ట్రాలకు ఇచ్చే సాయానికి కత్తెర వేస్తూ వస్తోంది. అయితే, ప్రాంతీయ పార్టీ ప్రభుత్వాలు ఆర్థిక కష్టాలతో అన్ పాపులర్ (జనాదరణ కోల్పోయే) పరిస్థితి సృష్టించి, ఆ దశలో రాజకీయంగా తాను పాగా వేయాలన్నది బీజేపీ ఎత్తుగడ అని ప్రాంతీయ నేతలు భావిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లోనూ ఇదే విధానాన్ని అవలంబించాలని బీజేపీ భావిస్తోందని చెబుతున్నారు. ఇప్పటికే పీకల్లోతు ఆర్థిక కష్టాల్లో ఉన్న తెలుగు రాష్ట్రాలకు కేంద్రం నుంచి ఆర్థిక సాయం రాకుండా చేసి.. ఆ తర్వాత తాను రంగ ప్రవేశం చేయాలని బీజేపీ భావిస్తోందని ప్రాంతీయ పార్టీల నేతలు భావిస్తున్నారు. అయితే, ఈ వ్యూహాన్ని ముందే పసిగట్టిన తెలుగు రాష్ట్రాల పాలకులు కేంద్రం నిధులు ఇవ్వడం లేదంటూ ముందే ఎదురుదాడి చేస్తున్నారని విశ్లేషించారు. బీజేపీతో ఏనాటికైనా ప్రమాదం తప్పదని జగన్-కేసీఆర్ ముందే పసిగట్టారు. జట్టుగా ఎదుర్కొనడానికి ప్రయత్నించారు. అయితే, జగన్‌ను కేసీఆర్‌కు దూరం చేయడంలో బీజేపీ కొంతవరకు సఫలమైంది. ఇటీవల మహారాష్ట్రలో బీజేపీకి ఎదురుదెబ్బ తగలడం పట్ల టీఆర్ఎస్‌లో సంతోషం వ్యక్తమైంది. దీన్ని దాచుకోవడానికి ఆపార్టీ నేతలు పెద్దగా ప్రయత్నించలేదు కూడా! బీజేపీ కూడా ఇప్పటికిప్పుడే జగన్-కేసీఆర్‌తో పూర్తిస్థాయి వైరానికి సిద్ధపడడం లేదు. రెండు తెలుగు రాష్ట్రాల్లో పరిస్థితులు ఇంకా పూర్తిగా తమకు సానుకూలంగా మారలేదని భావిస్తోంది. ఇప్పటికే శివసేన దూరమైన నేపథ్యంలో, ప్రస్తుతానికి ఈ రెండు పార్టీలపై ఒత్తిడి పెంచి, దారిలోకి తెచ్చుకుని, పార్లమెంటులో బిల్లులకు ఆమోదం పొందడమే బీజేపీ పెద్దల వ్యూహంగా కనిపిస్తున్నది. బీజేపీ వ్యూహాన్ని పసిగట్టిన ఇద్దరు ముఖ్యమంత్రులు ఇదే అదునుగా కేంద్రంపై తమదైన శైలిలో ఒత్తిడి పెంచుతున్నారు. ఈ ఆసక్తికర రాజకీయం ఎక్కడిదాకా సాగుతుందో, ఎవరిది పై చేయి అవుతుందో!

### ఐటీ ఊరట!

న్యూఢిల్లీ, డిసెంబరు 7: అసలే ఆర్థిక మందగమనం.. జనం చేతిలో డబ్బులు ఆడని పరిస్థితి.. మరి బయటపడటమెలా? వ్యక్తిగత ఆదాయపు పన్ను (ఐటీ) పరిమితిని పెంచడం ద్వారా ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. ఇటు వేతన జీవులకు పెద్ద ఊరట కలిగించడం, అటు వినియోగ శక్తిని పెంచడం ద్వారా ఆర్థిక వ్యవస్థలో కాస్త ఊపు తేవడం అనే రెండు పిట్టలను ఒకేసారి కొట్టడంపై గురిపెడుతోంది. శనివారమిక్కడ జరిగిన లీడర్‌షిప్ సదస్సులో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన మనసులోని ఆలోచనలను కొంతమేర బయటపెట్టారు. వచ్చే బడ్జెట్‌లో ఐటీ రేట్లలో కోత విధించే అంశాన్ని పరిశీలిస్తున్నామని ఆమె వెల్లడించారు. చెల్లించాల్సిన ఆదాయపు పన్ను తగ్గడం వల్ల ప్రజల వినియోగ శక్తిని పెరిగి, ప్రైవేటు పెట్టుబడులు పెరిగేందుకు అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. తద్వారా ఆర్థిక మందగమనం నుంచి బయటపడవచ్చని అభిప్రాయపడ్డారు. ఆర్థిక వ్యవస్థ పుంజుకునేందుకు తోడ్పడే చర్యల్లో భాగంగా ప్రభుత్వ రంగ బ్యాంకులు గత రెండు నెలల్లో రూ.5 లక్షల కోట్లను పంపిణీ చేశాయని తెలిపారు. ప్రజల కొనుగోలు శక్తి పెరిగేందుకు ఈ సొమ్ము తోడ్పడుతుందని చెప్పారు. అదే సమయంలో మౌలిక సదుపాయాలపై భారీగా ఖర్చు చేస్తున్నామని, మరిన్ని ఉద్దీపనలను ప్రకటించేందుకూ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వివరించారు. పూర్తి వివరాల కోసం బడ్జెట్ వరకు వేచి చూడాలని ఆమె పేర్కొన్నారు.

### జీఎస్టీ బాదుడు?

న్యూఢిల్లీ, డిసెంబరు 7: జీఎస్టీతో అంతా సరళం అంటూ సుతిమెత్తగా చెబుతూ వచ్చిన కేంద్రం.. ప్రజల నెత్తిన పెనుభారం మోపేందుకు సిద్ధమవుతోంది. దేశంలో వస్తు సేవల పన్ను(జీఎస్టీ) అమల్లోకి వచ్చి రెండున్నరేళ్లు. వచ్చే వారం జరిగే జీఎస్టీ మండలి సమావేశంలో కీలక మార్పులపై తుది నిర్ణయం తీసుకునే అవకాశముందన్నది సమాచారం. ఆ వర్గాలు తెలిపిన ప్రకారం చూస్తే.. ప్రస్తుతం 5 శాతంగా ఉన్న బేస్ శ్లాబ్‌ను 9-10 శాతానికి పెంచడం, 12% శ్లాబ్‌ను పూర్తిగా పక్కన పెట్టి ఈ శ్లాబులోని 243 వస్తువులను 18% శ్లాబులోకి తీసుకురావడం వంటి ప్రతిపాదనలు కీలకమైన ప్రభావం చూపే అంశాలు. ప్రస్తుతం పలు వస్తు సేవలకు పన్ను మినహాయింపు ఉంది. ఇప్పుడు వాటిలో పలు వస్తు సేవలను కొత్తగా పన్ను పరిధిలోకి చేర్చనున్నారు. ఈ జాబితాలోకి తొలిసారి తాటి కల్లును కూడా చేర్చనుండటం విశేషం. దాంతోపాటు ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్య ఖర్చులు, రూ.1000లోపు ఉండే హోటల్ గదులు, కంపెనీలు లీజుకు తీసుకున్న ఇళ్ల వంటివి ఈసారి జాబితాలో చేరనున్నాయని తెలుస్తోంది.

### 25న కల్యాణ సంరంభం

- **రిజిస్ట్రేషన్లకు చివరి తేదీ ఈ నెల 10**

హైదరాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మూడున్నర దశాబ్దాలుగా హైదరాబాద్‌లోని కల్యాణ కల్పతరువు సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న అఖిల భారత తెలుగు బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక 'కల్యాణ సంరంభం' ఈ నెల 25న మెహదీపట్నంలోని పుల్లారెడ్డి ఫార్మసీ కాలేజీ ఆవరణలో జరగనుంది. 2 తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాలు, దేశాల్లోని తెలుగు వధూవరులు కూడా తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు. కల్యాణ సంరంభంలో పాల్గొనడానికి ఈనెల 10లోపు రిజిస్ట్రేషన్లు చేయించుకోవాల్సి ఉంటుంది. జంట నగరాల్లోని ప్రజలు విజయనగర్ కాలనీలోని కల్యాణ కల్పతరువు కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు. జిల్లాలు, ఇతర రాష్ట్రాల్లోని వారు www.kktvivaha.org వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లోనే నమోదు చేసుకోవచ్చు. వివరాలను 040-23344550, 9951905259, 9848350404, 8143060027 నంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కల్యాణ కల్పతరువు గౌరవ ప్రధాన నిర్వాహకులు కలవకొలను శ్రీనివాసరావు తెలిపారు.

# సిరీస్ పట్టేయాలని!

## వెస్టిండీస్‌తో భారత్ రెండో టీ20 నేడు




ప్రాక్టీస్‌లో మనీష్ పాండే, కోహ్లీ

**తమ టీ20 చరిత్రలోనే అత్యధిక పరుగుల లక్ష్యాన్ని అలవోకగా ఛేదించిన భారత జట్టు ఇప్పుడు సిరీస్ విజయంపై కన్నేసింది. వెస్టిండీస్‌తో నేడు జరిగే రెండో టీ20లోనూ ఎప్పటిలాగే విరుచుకుపడాలనుకుంటోంది. అయితే ఉప్పల్ మ్యాచ్‌లో బ్యాట్స్‌మెన్ చెలరేగినా, బౌలర్లు ధారాళంగా పరుగులు సమర్పించుకోవడంతో పాటు చెత్త ఫీల్డింగ్‌తో నిరాశపరిచింది. ఈ లోపాలను కోహ్లీసేన రెండో మ్యాచ్‌తో అధిగమించాలి. ఇక విండీస్ జట్టు కూడా బ్యాటింగ్‌లో అదుర్స్ అనిపించుకున్నా.. చేజింగ్ వీరుడు విరాట్ విశ్వరూపానికి భారీ స్కోరును కూడా కాపాడుకోలేకపోయింది. దీంతో వారికీ మ్యాచ్ చావో రేవోగా మారింది.**

**తిరువనంతపురం:** టీ20 ఫార్మాట్‌లో వెస్టిండీస్ ప్రపంచ చాంపియన్ అయినప్పటికీ ఆ జట్టుపై భారత్ వరుస విజయాలతో తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శిస్తోంది. తొలి టీ20లో అదరగొట్టిన భారత్ ఆదివారం ఇక్కడి గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ స్టేడియంలో జరిగే రెండో మ్యాచ్ కోసం బరిలోకి దిగబోతోంది. భారత్ గెలిస్తే మూడు టీ20ల సిరీస్ ఖాయం కానుండగా.. అటు విండీస్‌పై మాత్రం కచ్చితంగా గెలవాల్సిన ఒత్తిడి నెలకొంది. ఈ సీజన్‌లో భారత్ ఇప్పటికే సొంత గడ్డపై తమ తొలి టీ20 సిరీస్‌ను బంగ్లాదేశ్‌పై సాధించింది. మరోవైపు చివరి పది టీ20 మ్యాచ్‌ల్లో విండీస్ తమ ప్రత్యర్థిపై ఒక్కసారి మాత్రమే గెలవగలిగింది. ఇక స్థానిక మైదానంలో ఇప్పటివరకు కేవలం ఒక వన్డే, ఒక టీ20నే జరగ్గా రెండిట్లోనూ భారత్ గెలిచింది.

**బౌలింగ్ మెరుగుపడాల్సిందే..:** తొలి టీ20లో విండీస్ వీర బాదుడుకు భారత బౌలర్లు దారుణంగా బలయ్యారు. ఏకంగా 15 సిక్సర్లు నమోదయ్యాయి. దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్‌లతో జరిగిన సిరీస్‌ల్లో దీపక్ చాహర్ కళ్లు చెదిరే బంతులతో ఆశ్చర్యపరిచాడు. కానీ ఉప్పల్ మ్యాచ్‌లో అతడు ఓ వికెట్ తీసి 54 పరుగులు సమర్పించుకోవాల్సి వచ్చింది. ఇక గాయం నుంచి కోలుకున్న భువనేశ్వర్ ఓవర్‌కు తొమ్మిది పరుగులిచ్చి వికెట్ తీయలేకపోయాడు. స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్ అయితే మరీ దారుణం. తన చివరి ఆరు టీ20 మ్యాచ్‌ల్లో అతడికి దక్కింది రెండు వికెట్లు మాత్రమే. నేటి మ్యాచ్‌లో అతడిని కొనసాగిస్తారా? లేక కుల్దీప్‌తో భర్తీ చేస్తారా అనేది ఆసక్తికరంగా మారింది. మరోవైపు జట్టు ఫీల్డింగ్ కూడా ఆందోళనగానే ఉంది. మొత్తం నాలుగు క్యాచ్‌లు నేలపాలయ్యాయి. రోహిత్ శర్మ, వాషింగ్టన్ సుందర్‌తో పాటు కెప్టెన్ కోహ్లీ కూడా ఈ విభాగంలో ఆకట్టుకోలేకపోయాడు. బ్యాటింగ్‌లో రోహిత్ ఫామ్‌లోకి వస్తే విండీస్‌కు కష్టాలే. రాహుల్‌కు తనకు దక్కిన చాన్స్‌ను సద్వినియోగం చేసుకున్నాడు. రిషభ్ పంత్, శివమ్ దూబేలపై ఒత్తిడి నెలకొంది.

**కసితో కరీబియన్లు:** సిరీస్‌లో సజీవంగా ఉండేందుకు ఈ మ్యాచ్‌లో విండీస్ మరింత జోరును ప్రదర్శించాలనుకుంటోంది. తొలి మ్యాచ్‌లో బ్యాట్స్‌మెన్ తమ స్థాయికి తగ్గట్టుగా ఆడారు. ఇవాన్ లూయిస్, హెట్‌మయెర్, కింగ్, పొలార్డ్, హోల్డర్ ధనాధన్ బ్యాటింగ్‌తో స్కోరును 200 దాటించారు. అయితే కోహ్లీ ఊచకోతకు విండీస్ బౌలర్లు బలి కావాల్సి వచ్చింది. పేసర్ విలియమ్స్ అయితే 3.4 ఓవర్లలోనే 60 పరుగులిచ్చాడు. దీంతో ఆదివారం మ్యాచ్‌లో అతడి స్థానం ప్రమాదంలో పడినట్టే. ఆరంభంలోనే హోల్డర్, కాట్రెల్ భారత వికెట్లను తీసి ఒత్తిడిలో పడేయాలనుకుంటున్నారు. ముఖ్యంగా ఎక్స్‌ట్రా పరుగుల విషయంలో జట్టు దృష్టి పెట్టాలని భావిస్తోంది. మరోవైపు నాలుగు మ్యాచ్‌ల నిషేధం ముగియడంతో ఈ మ్యాచ్‌లో కీపర్‌గా నికోలస్ పూరన్ ఆడే అవకాశం ఉంది.




**జట్లు (అంచనా)**

**భారత్:** రోహిత్, రాహుల్, విరాట్ కోహ్లీ (కెప్టెన్), రిషభ్ పంత్, శ్రేయాస్ అయ్యర్, శివమ్ దూబే, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, దీపక్ చాహర్, భువనేశ్వర్, చాహల్.

**వెస్టిండీస్:** సిమ్మన్స్, లూయిస్, బ్రాండన్ కింగ్, హెట్‌మయెర్, పూరన్, పొలార్డ్ (కెప్టెన్), హోల్డర్, పియెర్, విలియమ్స్, కాట్రెల్, హేడెన్ వాల్ష్.

## కోహ్లీని కవ్వించొద్దని చెప్పానా..!

### డైలాగ్‌తో విరాట్‌కు బిగ్ బీ ప్రశంస



**ముంబై:** వెస్టిండీస్‌తో తొలి టీ20లో అద్భుత బ్యాటింగ్‌తో చెలరేగిన కెప్టెన్ విరాట్ కోహ్లీ (94 నాటౌట్) ఇన్నింగ్స్‌కు బాలీవుడ్ సూపర్‌స్టార్ అమితాబ్ బచ్చన్ ఫిదా అయ్యాడు. ఈ సందర్భంగా అతడిని ప్రశంసిస్తూ.. తన సూపర్ హిట్ చిత్రం 'అమర్ అక్బర్ ఆంథోనీ' చిత్రంలోని ఓ డైలాగ్‌ను ఉటంకించాడు 'విరాట్‌ను కవ్వించొద్దని ఎన్నోసార్లు చెప్పా. కానీ నా మాట విన్నారా. ఇప్పుడు చూడండి ఏం జరిగిందో. ఓ చిట్టీ రాసి వారి చేతిలో పెట్టాడు. వెస్టిండీస్ ప్లేయర్ల ముఖాలు ఎలా మాడిపోయాయో' అని బిగ్ బీ ట్వీట్ చేశాడు. అమితాబ్ ట్వీట్‌కు విరాట్ స్పందిస్తూ..'ఈ డైలాగ్ నాకెంతో ఇష్టం. సర్. మీరెప్పుడూ నాకు స్ఫూర్తిగా నిలుస్తారు' అని అన్నాడు. వెస్టిండీస్ దిగ్గజ బ్యాట్స్‌మన్ వివ్ రిచర్డ్స్ కూడా కోహ్లీ బ్యాటింగ్‌పై ప్రశంసలు కురిపించాడు. 'అద్భుతం.. అత్యద్భుతం విరాట్' అని ట్వీట్ చేశాడు. 'థాంక్స్ బిగ్‌బాస్. మీ ప్రశంసలు నాకెంతో విలువైనవి' అని రిచర్డ్స్ ట్వీట్‌కు విరాట్ బదులిచ్చాడు.

## ఇదేం ఫీల్డింగ్..?



యువరాజ్

**న్యూఢిల్లీ:** వెస్టిండీస్‌తో జరిగిన తొలి టీ20లో భారత జట్టు చెత్త ఫీల్డింగ్‌పై మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఈ మ్యాచ్‌లో రోహిత్ రెండు క్యాచ్‌లు, వాషింగ్టన్ సుందర్, కోహ్లీ ఒక్కో క్యాచ్‌ను వదిలేశారు. 'ఉప్పల్ మ్యాచ్‌లో భారత్ ఫీల్డింగ్ పేలవంగా ఉంది. బంతిని అందుకోవడంలో యువ ఆటగాళ్లు ఆలస్యంగా స్పందిస్తున్నారు. మితిమీరిన క్రికెట్ దీనికి కారణమా?' అని ట్వీట్ చేశాడు.

## 'లేక్‌వ్యూ' ఓఎస్‌డీగా పీవీ సింధు



**అమరావతి (ఆంధ్రజ్యోతి):** ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధును హైదరాబాద్‌లోని లేక్‌వ్యూ అతిథిగృహం ఓఎస్‌డీగా నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. దీంతోపాటు ఆమెకు శనివారం నుంచి వచ్చే ఏడాది ఆగస్టు 31 వరకు 'ఆన్ డ్యూటీ' సౌకర్యం కల్పిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో విశాఖ వృద్ధుడికి 4 పతకాలు



శ్రీరాములు

**విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి):** మలేసియాలో ఇటీవల ముగిసిన ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో విశాఖపట్నానికి చెందిన వెటరన్ అథ్లెట్ వి.శ్రీరాములు నాలుగు పతకాలు (రెండు పసిడి, రెండు రజతాలు) సాధించి సత్తా చాటాడు. 95 ఏళ్ల ఈ నేవీ మాజీ కమాండర్ 95-100 ఏళ్ల విభాగం 5 కి.మీ రేస్ వాక్‌లో, డిస్కస్ త్రోలో స్వర్ణ పతకాలు గెలుపొందాడు. షాట్‌పుట్, జావెలిన్ త్రోలో రజత పతకాలు సొంతం చేసుకున్నాడు. ఈ నెల 10న విశాఖకు తిరిగిరానున్న శ్రీరాములను సన్మానించనున్నట్టు తూర్పు నౌకా దళం అధికారులు తెలిపారు.

## డోపింగ్‌లో పట్టుబడ్డ సత్నామ్



**న్యూఢిల్లీ:** ప్రముఖ బాస్కెట్ బాలర్ సత్నామ్ సింగ్ భమారా డోపింగ్‌లో పట్టుబడ్డాడు. ఎన్‌బీఏ లీగ్‌లో ఆడే అవకాశం సొంతం చేసుకున్న తొలి భారతీయుడిగా సత్నామ్ చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. 7 అడుగుల 2 అంగుళాల ఎత్తున్న సత్నామ్.. మూత్రం 'ఏ' శాంపిల్‌లో నిషేధిత ఉత్ప్రేరకాలున్నట్టు 'నాడా' పరీక్షల్లో తేలింది. దీంతో అతడిపై తాత్కాలికంగా సస్పెన్షన్ విధించారు. అయితే, తనపై వచ్చిన ఆరోపణలతో భమారా విభేదించాడు. తాను స్వచ్ఛంగా ఉన్నట్టు చెప్పాడు. క్రమశిక్షణ ప్యానెల్ విచారణకు సిద్ధంగా ఉన్నట్టు సత్నామ్ చెప్పాడని 'నాడా' తెలిపింది. 2015లో ఎన్‌బీఏ ప్లేయర్ల డ్రాఫ్ట్‌లో చోటు దక్కించుకున్న సత్నామ్‌ను 'డాలస్ మావెరిక్స్' సొంతం చేసుకుంది.

### కివీస్‌పై భారత్ విజయం

**కాన్‌బెర్రా:** ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న భారత జట్టు మూడు దేశాల జూనియర్ మహిళల హాకీ టోర్నీలో మరో విజయం సాధించింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 4-1తో న్యూజిలాండ్‌పై గెలిచింది. షర్మిలాదేవి రెండు గోల్స్ (12వ, 43వ)తో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది. మిగతా రెండు గోల్స్ డుంగ్‌డుంగ్ (27వ), లాల్‌రిండికి (48వ) చేశారు. కివీస్ తరపున ఏకైక గోల్‌ను ఒలివియా షనోన్ (4వ) సాధించింది.

## భారత్ 'డబుల్' సెంచరీ

దక్షిణాసియా క్రీడలు

**ఖాట్మండు:** దక్షిణాసియా క్రీడల పతకాల వేటలో భారత్ దూసుకెళ్తోంది. శనివారం భారత అథ్లెట్లు 29 స్వర్ణాలు సహా 49 పతకాలు సాధించారు. దీంతో ఆరోరోజు ముగిసేసరికి పతకాల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న భారత్ 214 (110 స్వర్ణ, 69 రజత, 35 కాంస్యాలు) పతకాలతో డబుల్ సెంచరీ దాటింది. ఈత కొలనులో భారత స్విమ్మర్లు 7 పసిడి పతకాలు గెలిచారు. రెజ్లింగ్‌లో సత్యవర్త్ కడియన్ (97 కిలోలు), సుమీత్ మాలిక్ (125 కి), మహిళల్లో గుర్షన్‌ప్రీత్ కౌర్ (76 కి), సరిత మోర్ (57 కి) నాలుగు స్వర్ణాలు పట్టేశారు. షూటింగ్ 25 మీ. ర్యాపిడ్ ఫైర్ పిస్టల్‌లో అనీష్ భన్వాలా, 10 మీ ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో మెహులీ ఘోష్-యష్ వర్ధన్ గోల్డ్ మెడల్స్ గెలిచారు. ట్రాక్ అండ్ ఫీల్డ్ చివరి రోజు భారత అథ్లెట్లు పసిడి నెగ్గకపోయినా.. 8 పతకాలు అందించారు. స్క్వాష్‌లో హరేందర్ పాల్, సునయన, తన్వి ఫైనల్‌కు చేరుకున్నారు. ఫుట్‌బాల్‌లో భారత్ 1-0తో నేపాల్‌ను ఓడించి తుది పోరుకు చేరుకుంది.

**8 పరుగులకే ఆలౌట్:** మహిళల టీ20 క్రికెట్‌లో మాల్దీవులు జట్టు రెండో అత్యల్ప స్కోరును నమోదు చేసింది. నేపాల్‌తో మ్యాచ్‌లో మాల్దీవులు 11.3 ఓవర్లలో 8 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ ఐమా ఐషాత్ (1) ఒక్క పరుగు చేయగా.. మిగతా 9 మంది బ్యాట్స్‌వుమెన్ డకౌటయ్యారు. స్వల్ప లక్ష్యాన్ని నేపాల్ వికెట్ కోల్పోకుండా ఏడు బంతుల్లోనే ఛేదించింది.







Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : K. Srinivas,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.

epaper.andhrajyothy.com